అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 25-5-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 144

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar

www.navatelangana.com


12 పేజీలు వెల : 6.50

డీయూ ప్రతిపాదన వివాదాస్పదం

- అంబేద్కర్ ఫిలాసఫీపై యూజీ కోర్సు తొలగింపునకు సిఫారసు
- సంబంధిత విభాగం, విద్యావేత్తల నుంచి విమర్శలు



న్యూఢిల్లీ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ ఫిలాసఫీపై అండర్ గ్రాడ్యుయేట్(యూజీ) కోర్సును తొలగించాలన్న ఢిల్లీ యూనివర్సిటీ (డీయూ) ప్రతిపాదన వివాదాస్పదమవుతున్నది. డీయూ స్టాండింగ్ కమిటీ చేసిన ఈ ప్రతిపాదనపై యూనివర్సిటీ ఫిలాసఫి డిపార్ట్‌మెంట్ నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ కోర్సును అలాగే ఉంచాలని సదరు విభాగం డీయూ వైస్ ఛాన్సలర్‌ను కోరింది. ఈ విషయంలో ఇటు దేశంలోని విద్యావేత్తలు, నిపుణుల నుంచి సైతం వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. అంబేద్కర్ మహనీయుడి ...6లో



బాయ్‌కాట్...

పార్లమెంట్ భవన ప్రారంభానికి ప్రతిపక్షాలు దూరం

రాష్ట్రపతిని విస్మరించడం ప్రజాస్వామ్యంపై దాడేనని మండిపాటు

రాజ్యాంగ స్ఫూర్తికి భంగమని విమర్శ

పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి దూరంగా ఉండాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. తాము ఈ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు 20 పార్టీలు ప్రకటించాయి. కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సీపీ (ఐ) ఎం, సీపీఐ, ఆర్ఎస్‌పీ, ఆర్జేడీ, జేడీయూ, ఎన్సీపీ, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), జేఎంఎం, వీసీకే, ఆర్ఎల్డీ, ఎండీఎంకే, ముస్లింలీగ్, నేషనల్ కాన్ఫరెన్స్, కేరళ కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు బుధవారం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నాయి.

న్యూఢిల్లీ :నూతన పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతి కాకుండా తానే ప్రారంభించాలని ప్రధాని నరేంద్ర మోడీ తీసుకున్న నిర్ణయాన్ని ఇరవై ప్రతిపక్ష పార్టీలు ముక్తకంఠంతో నిరసించాయి. రాబోయే లోక్‌సభ ఎన్నికలలో రాజకీయ ప్రయోజనం పొందేందుకే ప్రధాని ఈ నిర్ణయం తీసుకున్నారని మండిపడ్డాయి. కనీసం రాష్ట్రపతికి ఆహ్వానం సైతం అందించక పోవటం దుర్మార్గమని విమర్శించాయి. పైగా జాతీయోద్యమం నుంచి పలాయనం చేసి, బ్రిటీష్ వారి సేవలో మునిగిన కరడుకట్టిన హిందూత్వ వాది వీడీ సావర్కర్ జయంతి రోజు పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించడాన్ని కొన్ని పార్టీలు తప్పుపట్టాయి. ప్రతిపక్షాల నిర్ణయంపై బీజేపీ నేతలు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. అందరినీ ఆహ్వానించామని, రావడం రాకపోవడం వారి విజ్ఞతకే వదిలేశామని హోం మంత్రి అమిత్ షా అన్నారు. ప్రతిపక్షాలు తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ కోరారు.

రాష్ట్రపతే ఎందుకు ప్రారంభించాలి?

ఈ నెల 28న జరిగే పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమం అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధానికి దారితీస్తోంది. ఈ భవనాన్ని ...5లో

మోడీ నిర్ణయం అప్రజాస్వామికం

'రాష్ట్రపతిని పూర్తిగా విస్మరించి, తానే పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించాలని మోడీ నిర్ణయించడం మన ప్రజాస్వామ్యానికి అవమానకరమే కాకుండా దానిపై దాడి చేయడమే అవుతుంది. రాష్ట్రపతి పదవిని కించపరచడానికే ఇలాంటి అమర్యాదకరమైన చర్యకు పాల్పడుతున్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి కూడా ఇది భంగకరం. రాష్ట్రపతి పదవిని తొలిసారిగా మహిళా ఆదివాసీ నేత చేపట్టినందుకు జాతి యావత్తూ సంబరాలు జరుపుకుంటుంటే ప్రధాని మోడీ తీసుకున్న నిర్ణయం ఆ స్ఫూర్తిని తక్కువ చేయడమే అవుతుంది. అప్రజాస్వామిక చర్యలు ప్రధానికి కొత్త కావు. ఆయన పార్లమెంటును ఏనాడూ ఖాతరు చేసింది లేదు. ప్రతిపక్ష సభ్యులను అనర్హులను చేశారు. సభ నుండి సస్పెండ్ చేశారు. వారు ప్రజా సమస్యలను లేవనెత్తితే మౌనం వహించారు. ప్రజాస్వామ్య ఆత్మను పార్లమెంట్ నుండి గెంటివేస్తే కొత్త భవనంలో ఏమి విలువ ఉంటుంది?' అని ప్రతిపక్షాలు ఒక సంయుక్త ప్రకటనలో విమర్శించాయి.

జార్ఖండ్‌లో రాష్ట్రపతి



న్యూఢిల్లీ : వివిధ కార్యక్రమాలకు హాజరయ్యే నిమిత్తం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం జార్ఖండ్ చేరుకున్నారు. ఆమె మూడు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటిస్తారు. రాంచీలో నిర్మించిన హైకోర్ట్ నూతన భవనాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. కుంతిలో కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ గురువారం నిర్వహించే ...6లో

ఇంకా నిర్ణయం తీసుకోలేదు : ఎంపీ కేకే

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి వెళ్లేది.. లేనిది గురువారం చెబుతామని భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) ఎంపీ కే.కేశవరావు తెలిపారు. పార్లమెంట్ ప్రారంభోత్సవానికి హాజరు కావాలన్న అంశంపై ఇంకా తమ పార్టీ నిర్ణయం తీసుకోలేదని, దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

11 లక్షల ఎకరాలకు పోడు పట్టాలివ్వాల్సిందే

రాష్ట్ర ప్రభుత్వ తీరుపై కొన్ని సెక్షన్లలో అసంతృప్తి

- అపరిష్కృత సమస్యలపై జూన్‌లో ఆందోళనా పోరాటాలు
- 111 జీవోపై పారదర్శకంగా విపక్షాలతో చర్చించాలి
- లెఫ్ట్ తోడ్పాటుంటే బీఆర్ఎస్‌కు ఎక్కువ సీట్లు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కమ్యూనిస్టుల తోడ్పాటు ఉంటేనే బీఆర్ఎస్‌కు ఎక్కువ సీట్లు వచ్చే అవకాశముందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఆ ప్రభావం ఉంటుందని అన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశానంతరం బుధవారం తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చించామని చెప్పారు. రాజకీయ బలాబలాలను అంచనా వేశామన్నారు. ప్రస్తుతానికి బీఆర్ఎస్ మొదటిస్థానంలో, కాంగ్రెస్ రెండో స్థానంలో ఉంటాయని వివరించారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వంపై కొన్ని సెక్షన్ల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్నదని అన్నారు. పదేండ్ల నుంచి అధికారంలో ఉండడం వల్ల సహజంగానే అసంతృప్తి ఉంటుందన్నారు. అయితే కేసీఆర్ ప్రభుత్వం చేసిన వాగ్దానాలను అమలు జరపకపోవడం వల్ల, అనేక విషయాల్లో అప్రజాస్వామిక పద్ధతులను అవలంభించడం కారణంగా ఈ అసంతృప్తి పెరుగుతోందని చెప్పారు. ఇటీవల కొన్ని సెక్షన్ల డిమాండ్లు నెరవేర్చడంపై సీఎం కేసీఆర్ దృష్టి సారించారని వివరించారు. వీఆర్ఏలు, జేపీఎస్‌లు, కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ, బీసీలకు లక్ష రూపాయల సాయం వంటి చర్యలతో ఈ అసంతృప్తి కాస్త తగ్గిందన్నారు.

వచ్చేనెల 24 నుంచి పోడు భూములకు పట్టాలను పంపిణీ చేస్తామంటూ ప్రభుత్వం ప్రకటించడం శుభపరిణామమేగానీ, ఎంత మందికి ఇస్తారనేదానిపై అయోమయం సరికాదన్నారు. అర్హత ఉన్న గిరిజనులందరికీ పోడు పట్టాలు వస్తాయా?అన్నది చర్చనీయాంశంగా మారిందని చెప్పారు. 11 లక్షల ఎకరాలకు పోడు పట్టాలివ్వాల్సిందేనని ఆయన ...7లో

కేరళలో నేటి నుంచి ఈ-పాలన



తిరువనంతపురం : ఎల్డీఎఫ్ పాలనలో కేరళ రాష్ట్రం మరో ఘనతను సొంతం చేసుకుంటున్నది. నేటి నుంచి ఆ రాష్ట్రం పూర్తి స్థాయి ఈ-పాలన రాష్ట్రంగా అవతరించనున్నది. ఈ విషయాన్ని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటించనున్నారు. ఈ-పాలనతో ప్రభుత్వ సేవలు డిజిటల్ రూపంలో, పారదర్శకంగా, శీఘ్రంగా అందనున్నాయి. డిజిటల్ అక్షరాస్యతను సాధించటంతో పాటు కేరళను 'మొత్తం ఈ-పరిపాలన గల రాష్ట్రం'గా ప్రకటించటం అనేది విజ్ఞాన ఆధారిత సమాజం, ఆర్థిక వ్యవస్థ వైపు దక్షిణాది ...2లో

ఇంకెప్పుడు కొంటారు..?



- ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై రైతుల ఆగ్రహం
- తడిచిన, మొలకెత్తిన ధాన్యం కొనట్లేదని ఆవేదన
- సొసైటీ కార్యాలయం ఎదుట ధాన్యానికి నిప్పు పెట్టి నిరసన

నవతెలంగాణ-బోధన్ / భువనగిరిరూరల్/ మహబూబాబాద్

ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకుందామనుకున్న రైతన్నలు సొసైటీ, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్‌మిల్లర్ల తీరుతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. అసలే కొనుగోళ్లలో ఆలస్యం.. మిల్లర్ల దోపిడీతో సతమతమవుతుండగా.. మరోవైపు అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోయి రంగు మారి మొలకెత్తింది. అయితే, ఆ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా క్షేత్రస్థాయిలో జరగడం లేదు. దాంతో విసుగు చెందిన ఓ రైతు మొలకెత్తిన ధాన్యాన్ని బుధవారం సొసైటీ ఎదుట కుమ్మరించి తన ఆవేదన వ్యక్తం చేశాడు. మరోచోట క్వింటాకు 5 కిలోల తరుగు తీస్తుండటంతో రైతులు రాస్తారోకో చేశారు. ఇంకోచోట ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ వడ్లకు నిప్పు పెట్టారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి...

నిజామాబాద్ జిల్లా సాలూర మండల కేంద్రానికి చెందిన రైతు కుంట్ల సాయిలు ధాన్యం వర్షానికి తడిసి రంగు మారింది. దాన్ని సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు తీసుకోవడం లేదని విసుగుచెంది బుధవారం ఒక ట్రాలీ లోడు ధాన్యాన్ని సొసైటీ ఎదుట గుమ్మరించాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అలాగే ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు. ఈ సందర్భంగా రైతు కుంట్ల సాయిలు మాట్లాడుతూ.. గత నెలలో కురిసిన అకాల వర్షాలకు ధాన్యం తడిచిపోయి రంగు మారి మొలక వచ్చిందని తెలిపారు. అయినా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేస్తున్నా కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి రంగు మారిన, ...7లో



ఐఆర్బీ సంస్థకు టెండర్ ఎలా ఇస్తారు..?

- నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఆ సంస్థకే వంత పాడుతున్న కేటీఆర్ : రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"ఓఆర్ఆర్ టెండర్ దక్కించుకున్న ఐఆర్బీ సంస్థ లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ ఇచ్చిన 30 రోజుల్లో..టెండర్ మొత్తంలో 10 శాతం అడ్వాన్స్‌డ్‌గా చెల్లించాలి. ఆ ప్రకారం ఐఆర్బీ సంస్థ రూ. 7,388 కోట్లలో రూ.738 కోట్లను ...5లో





గుడిసెల కూల్చివేత.. ఉద్రిక్తత

అడ్డుకున్న మహిళలు

- అటు అరెస్టులు.. ఇటు కూల్చివేతలు
- వందలాది మంది అరెస్ట్
- ప్రజా ప్రతిఘటనతో వెనుతిరిగిన అధికార యంత్రాంగం

నవతెలంగాణ-మహబూబాబాద్

రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేదలు నిలువ నీడ కోసం వేసుకున్న గుడిసెలపై అధికార యంత్రాంగం మూకుమ్మడిగా దాడి చేసింది. గింత జాగ కోసం పోరాడుతున్న పేదలపై కనికరం చూపకుండా గుడిసెలు వేసుకుంటా వుంటే.. తొలగిస్తూ వస్తున్నారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పోలీసులను తోడు తీసుకొచ్చుకుని తెల్లవారు జామునే గుడిసెల ప్రాంతానికొచ్చారు. అడ్డుకున్న పేదలను ఓ వైపు అరెస్టు చేస్తూనే.. మరోవైపు కూల్చివేతలు కానిచ్చారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ సమీపంలోని కురవి రహదారి వెంట బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. సర్వే నెంబర్ 255లో సుమారు 50 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అక్కడ దాదాపు రెండు వేల మంది ...5లో

జూన్ డెడ్‌లైన్ ?

బండిని మార్చాలి..కవితను అరెస్టు చేయాలి

అంతా పైకి బాగానే కనిపిస్తున్నప్పటికీ తెలంగాణ బీజేపీలో అంతర్గత పోరు తారాస్థాయికి చేరుకున్నట్టు కనిపిస్తున్నది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్ష సీటు చుట్టూ రాజకీయం నడుస్తున్నది. బండి సంజయ్‌ని అధ్యక్ష స్థానం నుంచి తప్పిస్తేనే రాష్ట్రంలో బీజేపీ మరింత ఎదిగేందుకు అవకాశం ఉంటుందని అధిష్టానంపై అసంతృప్తి గ్రూపు తీవ్రస్థాయిలో ఒత్తిడి పెంచుతున్నట్టు తెలిసింది. ఈ విషయంలో ఆ పార్టీ అధిష్టానానికి జూన్ నెలాఖరు వరకు డెడ్‌లైన్ విధించినట్టు ప్రచారం జరుగుతున్నది.

- కేసీఆర్ ఆస్తులపై విచారణ జరపాల్సిందే
- బీజేపీ అధిష్టానానికి అసంతృప్తుల అల్టిమేటం
- లేకుంటే మా దారి మేం చూసుకుంటామని హెచ్చరిక
- రాజగోపాల్‌రెడ్డితో దిగ్విజయ్ సింగ్ చర్చలు !



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బండి సంజయ్ స్థానంలో ఈటలను అధ్యక్షునిగా నియమించాలనీ, కవితను అరెస్టు చేయడంతో పాటు కేసీఆర్ కుటుంబం ఆస్తులపై విచారణ జరిపించాలనే డిమాండ్లను అసంతృప్తులు ముందుకు తెస్తున్నట్టు తెలిసింది. జూన్ నెలాఖరులోగా అధ్యక్షున్ని మార్చకపోతే తమ దారి తామూ చూసుకుంటామని అల్టిమేటం జారీచేశామని రాజగోపాల్‌రెడ్డి తన అనుచరుల వద్ద బహిరంగంగానే చెప్పినట్టు ప్రచారం జరుగుతున్నది. తనతో కాంగ్రెస్ నేత దిగ్విజయ్‌సింగ్ సంప్రదింపులు జరిపి ఆ పార్టీలోకి తిరిగి రావాలని కోరారని కూడా ఆయన అనుచరుల వద్ద ప్రస్తావించినట్టు వినికిడి. అయితే, రాజగోపాల్‌రెడ్డి ఇప్పటికైతే తన నిర్ణయాన్ని స్పష్టంగా తెలపలేదని తెలిసింది. ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, తదితర అసంతృప్త నేతలు దక్షిణ భారతదేశ రాజకీయాలకు సంబంధించిన బ్లూప్రింట్‌ను అధిష్టానం వద్ద ఉంచినట్టు ప్రచారం జరుగుతున్నది. దక్షిణాది రాష్ట్రాల్లో సీఎం ఎవరు?, ప్రతిపక్ష పార్టీల అధ్యక్షులు ఎవరు? వారిలో బలమైన నేతలెవరు? అనే అంశం కూడా ఎన్నికల ఫలితాల్లో కీ రోల్ పోషించే అవకాశం ఉంటుంది. మొదటి నుంచీ దక్షిణాది రాష్ట్రాల్లో మత విద్వేషాలను ప్రజలు సహించరు. వాటిని భుజాన వేసుకుని వచ్చే పార్టీలకు తగిన బుద్ధి చెబుతూనే ఉంటారు. విద్వేషపూరిత రాజకీయాలు చేస్తే ప్రజలు మరింత దూరమయ్యే ప్రమాదముంది.

ఈ పరిణామాలన్నింటినీ వివరిస్తూ ఇందిరాగాంధీ హత్య తర్వాత దేశమంతటా కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు వీయగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వచ్చిన ఫలితాలు, రాష్ట్ర ఏర్పాటు తర్వాత వచ్చిన ఎన్నికల రిజల్ట్, తాజాగా కర్నాటకలో బీజేపీకి ఎదురైన పరాభవం, బండి సంజయ్ వివాదాస్పద వ్యాఖ్యలు, ఇలా ప్రతి అంశాన్నీ అధిష్టానం ఎదుట పూసగుచ్చినట్టు వివరించినట్టు తెలిసింది. ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో ...2లో

హైదరాబాద్‌లో స్టెమ్‌క్యూర్స్ ల్యాబ్

దేశంలోనే అతిపెద్ద ప్రయోగశాల ఏర్పాటు : కేటీఆర్



నిక్కీహెలితో కేటీఆర్...

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణకు మరో పెట్టుబడి రానున్నది. స్టెమ్ క్యూర్స్ కంపెనీ హైదరాబాద్‌లో తయారీ ల్యాబ్‌ని ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఈ ల్యాబ్ ప్రధానంగా స్టెమ్ చికిత్సపై దృష్టి సారిస్తుంది. ఇది భారతదేశంలోనే అతిపెద్ద స్టీమ్ సెల్ మ్యానిఫ్యాక్చరింగ్ ప్లాంట్. దాదాపు 54 అమెరికన్ మిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఈ తయారీ యూనిట్‌తో 150 మందికిపైగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్ స్టెమ్ క్యూర్స్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ సాయిరాం అట్లూరితో ...2లో

మోడీపై ప్రజలకు సన్నగిల్లుతున్న నమ్మకం

అది తగ్గేకొద్దీ అనుమానాలు, ప్రశ్నలు పెరుగుతున్నాయి

- నోట్ల రద్దుతో నల్లధనం వైట్‌మనీగా మారింది
- పతనం అంచున పెట్టుబడిదారీ వ్యవస్థ
- సోషలిజం వైపు అడుగులు : ప్రముఖ ఆర్థికవేత్త డి.పాపారావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అనాలోచిత నిర్ణయాల వల్ల మోడీ పట్ల ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతున్నదని ప్రముఖ ఆర్థికవేత్త, జర్నలిస్టు డి.పాపారావు అన్నారు. నోట్ల రద్దు వల్ల మోడీ సర్కారుకు క్లీన్‌చీట్ రాకపోగా ప్రజల్లో విశ్వసనీయత తగ్గిందని చెప్పారు. నమ్మకం తగ్గేకొద్దీ వ్యవస్థలు, వ్యక్తుల పట్ల ప్రజల్లో అనుమానాలు, ప్రశ్నించుకోవటం ఎక్కువ అవుతాయన్నారు. అవి ఎక్కువయ్యే కొద్దీ వాస్తవాలేంటి? అబద్ధాలేంటి? అనే వాటిని నిర్ధారించుకోవటం జరుగుతుందన్నారు. ఈ పరిణామాలు కొత్త వ్యవస్థల వైపు అడుగులు వేసేందుకు దారులు తీస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో ఉందనీ, సోషలిజం వైపు వేగంగా అడుగులు పడుతున్నాయని నొక్కి చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'నోట్ల రద్దుతో క్లీన్‌చిట్ సాధ్యమేనా?' అనే అంశంపై వెబినార్ నిర్వహించారు. ఈ అంశంపై పాపారావు మాట్లాడారు. నోట్ల రద్దుతో ఎన్ని ఇబ్బందులు పడ్డా మోడీ సర్కారు తమ కోసం ఏమో చేస్తుందనే భ్రమల్లో ప్రజలు మునిగిపోయారని చెప్పారు. ప్రజలకు చివరకు నిరాశే మిగిలిందన్నారు. నోట్ల రద్దు సమయంలో దేశంలో పది లక్షల కోట్ల రూపాయల విలువైన రూ.500,1000 నోట్లు రద్దు అయ్యాయనీ, వాటిలో 3 నుంచి 4 లక్షల కోట్ల రూపాయలు తిరిగి రావని ఆర్బీఐ భావించిన విషయాన్ని గుర్తుచేశారు. కానీ, వాస్తవ పరిస్థితుల్లో ఆ డబ్బునంతా వైట్‌మనీగా మార్చుకునేందుకు డీమానిటైజేషన్ దోహదపడిందని వివరించారు. ప్రభుత్వమే చేసిన అతి పెద్ద మనీల్యాండరింగ్ కేసు అని ఫోర్బ్ పత్రిక ఆనాడే ప్రచురించిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ తర్వాత మోడీ డిజిటల్ ఎకానమీ పల్లవి ఎత్తుకున్నారని చెప్పారు. దాని ద్వారా పన్నుల ఎగవేత తగ్గుతుందనీ, లావాదేవీల్లో పారదర్శకత ఏర్పడుతుందని చెప్పారు. ఆ క్రమంలోనే ఆన్‌లైన్ లావాదేవీలు ఇటీవల బాగా పెరగాయన్నారు. కాగితం కరెన్సీ వాడకం కూడా తగ్గిందన్నారు. ఈ నేపథ్యంలో నోట్ల ముద్రణ తగ్గాల్సి ఉండగా..వాస్తవ పరిస్థితి దానికి భిన్నంగా ఉందన్నారు. 2016లో రూ.15 లక్షల కోట్ల కరెన్సీ చలామణిలో ఉండగా ఆర్బీఐ లెక్కల ప్రకారమే ఇప్పుడు అది రూ. 32 లక్షల కోట్లు ఉందని వివరించారు. వాడకం లేకున్నా సర్క్యులేషన్ ఎందుకు పెరిగింది? అది ఎక్కడ ఉంది? అని కేంద్రాన్ని ప్రశ్నించారు. దేశంలో రెండు ఎకనామీలున్నాయని చెప్పారు. ఎక్కువస్థాయిలో ప్రజలు వాడుతున్న డిజిటల్ ఎకనామీలో లావాదేవీల ట్రాన్సరెన్సీ చాలా బాగుందనీ, తెల్లడబ్బు ఎకనామీలో ప్రజలున్నారని చెప్పారు. దీనికి సమానంతరంగా రెండో ఎకానమీ మనకు తెలియకుండానే నడుస్తున్నదని తెలిపారు. కార్పొరేట్లు, ఎక్కువ మంది రాజకీయ నేతలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మాఫియా వ్యక్తులు రెండో ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్నారనీ, లావాదేవీలు కనపడకుండానే చేతులు మారిపోతున్నాయని వివరించారు. వారంతా నల్లడబ్బు ఎకనామీలో ఉన్నారని చెప్పారు. దేశంలో నల్లడబ్బు లేకుండా పోయిందనేది అవాస్తవమన్నారు. బీజేపీ శ్రేణులు రూ.2 వేల నోట్ల ముద్రణపై అనేక కట్టు కథలు చెప్పి ప్రజల్ని మైమరిపించాయన్నారు. బీజేపీ శ్రేణులు కూడా మోడీ మాయజాలంలో ఉన్నాయన్నారు. వారంతా అసత్య ప్రచారాలు చేస్తున్నారని చెప్పారు. రూ.2 వేల నోటు రద్దును ఆర్బీఐ ప్రకటించినప్పటికీ దాని వెనుక రాజకీయ ఒత్తిడి కూడా దాగి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. కర్నాటక ఎన్నికల ఫలితాల చర్చ లేకుండా మరిచిపోయేలా చేసిందా? రానున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీల వద్ద డబ్బులు లేకుండా చేయడంలో భాగంగా చేసిందా? ఇతర రాష్ట్రాల్లో ఆయా పార్టీల నేతలకు కేసీఆర్, జగన్ డబ్బులు సమకూరుస్తున్నారన్న ప్రచార నేపథ్యంలో జరిగిందా? ఇలా అనేక అనుమానాలకు రూ.2 వేల నోటు రద్దు అంశం అవకాశమిస్తున్నదన్నారు. తాను అవినీతికి పాల్పడననీ, ఎవ్వరినీ పాల్పడనివ్వనని మోడీ చెప్పింది అవాస్తవమని తేలిందన్నారు. కర్నాటకలో ఆపార్టీ ఓటమికి 40 శాతం కమిషన్ కూడా ఒక కారణమేనని చెప్పారు. అబద్ధాలతో కూడిన రాజకీయాలకు కాలం చెల్లబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రూ.2 వేల మార్పిడి కోసం ఎక్స్‌ట్రా 20 శాతం ఇచ్చి బంగారం కొంటున్నారనీ, లగ్జరీ వస్తువుల కొనుగోలు ఇటీవల బాగా పెరిగిందని చెప్పారు. దీనిని బట్టే ఆ డబ్బు ఎక్కడ ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు.

కేరళ 'మధ్యాహ్న భోజనం'పై కేంద్రం రంధ్రాన్వేషణ

న్యూఢిల్లీ: కేరళలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వంపై సమయం దొరికిన ప్రతి సందర్భంలోనూ విషం చిమ్మడం కేంద్రానికి అలవాటుగా మారింది. కేరళ ప్రభుత్వం చెబుతున్న వాస్తవాలు బీజేపీ నాయకత్వానికి ఎంత మాత్రం రుచించడం లేదు. ప్రతి విషయంలోనూ తలదూర్చుతూ రంధ్రాన్వేషణ చేయడమే పనిగా పెట్టుకుంది. 2022-23లో రాష్ట్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులలో 99 శాతం మందికి మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించామంటూ కేరళ ప్రభుత్వం చెబుతున్న వాస్తవాలను కేంద్రం జీర్ణించుకోలేకపోతోంది. అందులో నిజానిజాలు తెలుసుకునేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో కేంద్ర విద్యా శాఖ, కేరళ ప్రభుత్వ అధికారులు సభ్యులుగా ఉంటారు. పీఎం పోషణ్ యోజనకు సంబంధించి మంగళవారం కార్యక్రమాల పీఏబీ జరిపిన సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. రాష్ట్రంలోని 99 శాతం మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నామంటూ కేరళ ప్రభుత్వం చేసిన 'అసంభవమైన' ప్రకటనను పరిశీలించాలని కేంద్రం నిర్ణయించిందని విద్యా శాఖ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలను సరిచూసుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రతినిధులు కొన్ని జిల్లాలలో పర్యటించాలని పీఏబీ సమావేశంలో నిర్ణయించారు. ఈ కమిటీ పాఠశాలలు, బ్లాకులు, జిల్లాలు... ఇలా వివిధ స్థాయిల నుండి గతంలో వచ్చిన సమాచారాన్ని మరోసారి పరిశీలిస్తుంది.

హైదరాబాద్‌లో స్టెమ్‌క్యూర్స్ ల్యాబ్

(మొదటిపేజీ తరువాయి)

బోస్టన్ నగరంలో సమావేశం అయ్యారు. అమెరికాలో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని నైపుణ్యాన్ని భారతదేశానికి తీసుకొచ్చి తీవ్రమైన వ్యాధులకు స్టెమ్ సెల్ ఉత్పత్తులతో చికిత్సను అందించడమే ఈ కంపెనీ లక్ష్యం.

ప్రపంచ మెడికల్ ఇన్నోవేషన్‌కు తన సొంత నగరమైన హైదరాబాద్ హబ్‌గా మారిందని సాయిరాం అట్లూరి సంతోషం వ్యక్తం చేశారు. తమ సంస్థకు తెలంగాణ ప్రభుత్వం ముఖ్యంగా మంత్రి కేటీఆర్ అందిస్తున్న సహకారానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

స్టెమ్ క్యూర్స్ కంపెనీని హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నట్టు మంత్రి కేటీఆర్ తెలిపారు. కంపెనీ పెట్టుబడి ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేసిన ఆయన సంస్థకు కావాల్సిన సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అత్యంత తీవ్రమైన వైద్య ఆరోగ్య సమస్యలకు స్టెమ్ సెల్ థెరపీతో పరిష్కారం లభిస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ అత్యాధునిక చికిత్సా విధానాలు దేశంలో విస్తతంగా అందుబాటులోకి రావాలన్నారు. స్టెమ్ క్యూర్ సంస్థ ఏర్పాటు చేయనున్న ల్యాబ్‌తో దేశంలో ఈ చికిత్సా విధానాలు అందరికి అందుతాయన్న ఆశాభావాన్ని మంత్రి కేటీఆర్ వ్యక్తం చేశారు.

నల్లగొండలో ఐటీ టవర్ త్వరలోనే ప్రారంభం ముందుకొచ్చిన సొనాటా సాఫ్ట్‌వేర్

నల్లగొండ పట్టణానికి ఐటీ పరిశ్రమ రానున్నది. త్వరలో ప్రారంభం కానున్న ఐటీ టవర్‌లో తన కార్య కలాపాలు ప్రారంభించేందుకు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ సొనాటా ముందుకొచ్చింది. ద్వితీయ శ్రేణి పట్టణాలకు ఐటీ పరిశ్రమను విస్తరించాలన్న తెలం గాణ ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా నల్గొండ ఐటీ టవర్‌లో సుమారు 200ఉద్యోగాలను సొనాటా సాఫ్ట్‌వేర్ కల్పించనున్నది.

సొనాటా సాఫ్ట్‌వేర్ కార్య నిర్వాహక ఉపాధ్యక్షులు శ్రీని వీరవెల్లి మంత్రి కేటీఆర్‌తో అమెరికాలోని బోస్టన్ నగరంలో సమా వేశం అనంతరం ఈ ప్రకటన వెలువడింది. బ్యాం కింగ్, ఫైనాన్షియల్ సెక్టార్, ఆరోగ్య రంగం, లైఫ్ సైన్సెస్ రంగాల్లో సేవలు అందించేందుకు అవసర మైన సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ ఇన్నోవేషన్ల కోసం సొనాటా కార్యకలాపాలు నిర్వహించనున్నది. ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభించనున్న కంపెనీ స్థానిక యువతకు టెక్నాలజీ రంగంలో నైపుణ్య శిక్షణ కల్పించ నుంది. మంత్రి కేటీఆర్ తో జరిగిన సమావేశంలో తెలంగాణ పరి శ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, పెట్టుబడుల ప్రత్యేక కార్యదర్శి విష్ణు వర్ధన్ రెడ్డి చీఫ్ రిలేషన్స్ ఆఫీసర్ అమర్నాథ్‌రెడ్డి ఉన్నారు.

జూన్ డెడ్‌లైన్ ?

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణలో బీజేపీ మరింత దూకుడు పెంచాలంటే బండి సంజయ్ సామర్థ్యం సరిపోదని కూడా అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. బండిని తొలగిస్తే పాత బీజేపీ శ్రేణుల్లో వ్యతిరేకత వస్తుందని భావిస్తే...సంజయ్‌కి గౌరవప్రదంగా మరో పదవి ఇచ్చి అయినా సరే పక్కకు తప్పించాలని ఒత్తిడి పెంచినట్టు తెలిసింది. తామంతా కేసీఆర్ బాధితులమనీ, ఆయన్ను ఓడించే లక్ష్యంతో పనిచేస్తున్నామని కుండలు బద్దలు కొట్టినట్టు సమాచారం. రాష్ట్ర అధ్యక్షున్ని మార్చకుండా, కేసీఆర్ కుటుంబంపై ఎలాంటి రాజకీయ ఒత్తిడి చేయకుండా ఉంటే తాము మరో ప్రత్యామ్నాయం చూసుకోవాల్సి ఉంటుందని అల్టిమేటం జారీచేసినట్టు విశ్వసనీయ సమాచారం.

కేరళలో నేటి నుంచి ఈ-పాలన

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రయాణంలో ఒక ప్రధాన అడుగు అని కేరళ ప్రభుత్వం తాను విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నది. కేరళ సంపూర్ణ అక్షరాస్యత కలిగిన భారత రాష్ట్రంగా అవతరించి, సంపూర్ణ ఈ- అక్షరాస్యత సమాజంగా మారాలనే తపనను ప్రారంభించిన దశాబ్దాల తర్వాత వచ్చిన ఈ అద్వితీయ విజయం.. ప్రభుత్వం కోరుకునే దూర దృష్టితో కూడిన విధాన కార్యక్రమాల ద్వారా గ్రహించబడిందని వెల్లడించింది. కేరళ ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్ (కేఎఫ్ఓఎన్) ఈ దిశలో నిర్ణయాత్మక ముందడుగు అవుతుందనీ, ఇంటర్నెట్ యాక్సెస్ పౌరుల హక్కుగా ప్రకటించిన భారత రాష్ట్రంగా కేరళ నిలుస్తుందని వివరించింది.

భారత ప్రభుత్వం నిర్వహించిన నేషనల్ ఈ-సర్వీస్ డెలివరీ అంచనాలో కేరళ అగ్రస్థానంలో నిలిచింది అని పేర్కొన్నది.

విద్యారంగ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- జూన్ 20న తెలంగాణ విద్యాదినోత్సవాన్ని విజయవంతం చేయండి : అధికారులకు మంత్రి సబిత ఆదేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో విద్యా రంగంలో పదేండ్లలో సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అధికారులను విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో విద్యాశాఖ పనితీరుపై ఆమె సమీక్షించారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా 21 రోజుల పాటు విద్యా రంగంలోని విజయాలకు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. వచ్చేనెల 20న నిర్వహించే తెలంగాణ విద్యా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక పాఠశాల నుంచి పీజీ కళాశాల వరకు అన్ని విద్యాసంస్థల్లో సభలు, సమావేశాలను నిర్వహించి విద్యా రంగంలో సాధించిన విజయాలను వివరించాలని కోరారు. సర్కారు స్కూళ్లకు సకల హంగులు కల్పించే లక్ష్యంతో చేపట్టిన 'మన ఊరు- మన బడి', 'మన బస్తీ-మన బడి' కింద సకల వసతులతో ఆధునికీకరించిన ప్రభుత్వ పాఠశాలలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. మొదటి విడతలో రూ. 3,497.62 కోట్లు వెచ్చించి, 9,123 స్కూళ్లను 12 అంశాలను ప్రాతిపదికగా తీసుకుని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని వివరించారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 10 వేల గ్రంథాలయాలు, 1,600 డిజిటల్ తరగతి గదులను ఒకే రోజు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

రూ.60 కోట్లతో 12.39 లక్షల మందికి నోట్‌పుస్తకాలు

రూ.190 కోట్లు వ్యయం చేసి 30 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందిస్తున్నామని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠశాలల పున్ణప్రారంభం నాటికి విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రాష్ట్రంలో మొదటి సారిగా రూ.60 కోట్లు వ్యయం చేస్తూ ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న 12.39 లక్షల మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. వాటిని కూడా పాఠశాలలు పున్ణప్రారంభం నాటికి విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రెండు లక్షల మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు రూ.10 కోట్ల ఖర్చుతో ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 26 లక్షల మంది విద్యార్థులకు రూ.150 కోట్లు వెచ్చించి ఒక్కో విద్యార్థికి రెండు జతల యూనిఫారమ్ అందిస్తున్నామని వివరించారు.

విద్యారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. విద్యా రంగంపై వెచ్చిస్తున్న మొత్తాన్ని పెట్టుబడిగా భావిస్తోందని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యా సంచాలకులు శ్రీదేవసేన, అధికారులు రమేష్, జయప్రదబాయి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ టోర్నీని విజయవంతం చేయండి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సీఎం కప్ టోర్నీ క్రీడలు ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరుగుతున్నందున వాటి నిర్వహణా ఏర్పాట్లను జాగ్రత్తగా పూర్తి చేయాలని రాష్ట్ర క్రీడా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఇతర శాఖల ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారంనాడాయన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతల విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ సంజయ్ కుమార్ జైన్, సిటీ పోలీస్ కమిషనర్, గ్రేటర్ హైదరాబాద్ కమీషనర్ లోకేష్ కుమార్, హైదరాబాద్ కలెక్టర్ అజయ్ కుమార్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ డాక్టర్ సి హరీష్, పర్యాటకశాఖ మేనేజింగ్ డైరెక్టర్ మనోహర్, ఆర్టీఓ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, విద్యుత్, మెట్రో వాటర్ బోర్డ్ అధికారులు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ క్రీడల్లో దాదాపు పదివేలకు పైగా క్రీడాకారులు హాజరుకానున్నందున తాగునీరు, పారిశుధ్య పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ నెల 27 నుండి క్రీడాకారులు హైదరాబాద్‌కు వస్తున్నందున మొత్తం ఆరు స్టేడియాల పరిధిలో బందోబస్తు, నిరంతరాయ విద్యుత్ సౌకర్యం సమకూర్చాలని చెప్పారు. 29వ తేదీన ఎల్బీ స్టేడియంలో జరిగే క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి కేటీఆర్ హాజరవుతారనీ, పలువురు మంత్రులు కూడా పాల్గొంటారని తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో భాగంగా మార్చ్‌పాస్ట్, ప్రముఖ క్రీడాకారులకు సన్మాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. దాదాపు 200 బస్సులతో స్టేడియంకు చేరుకోనున్నందున ట్రాఫిక్ ఏర్పాట్లు పర్యవేక్షించాలని పోలీస్ అధికారులనుకోరారు. క్రీడాకారుల బస ప్రాంతాలలో వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక వైద్య శిబిరాలు, ఎమర్జెన్సీ అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతి స్టేడియంకు ఒక ఇంచార్జిగా జిల్లా అధికారిని నియమించాలనీ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లు క్రీడల నిర్వహణ విషయంలో నోడల్ అధికారులుగా వ్యవహరించాలని కోరారు. 3700పైగా బాలికలు, మహిళలు పాల్గొంటున్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు.

పెన్షన్ 10 వేల పెంపు కోసం దశల వారీ ఉద్యమం

వికలాంగులకు సామాజిక భద్రత కల్పించాలి

- వికలాంగుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు
- 40 శాతం వైకల్యం కలిగిన వికలాంగులకు రాయితీ బస్సు పాసులివ్వాలి
- ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వికలాంగుల పెన్షన్ 10 వేలకు పెంపు కోసం దశల వారీగా ఉద్యమం చేస్తామనీ, వికలాంగులకు సామాజిక భద్రత కల్పించాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి ఎమ్ అడివయ్య తెలిపారు. బుధవారం హైదరాబాద్ చిక్కడపల్లిలోని ఎన్‌పీఆర్‌డీ కేంద్ర కమిటీ సభ్యులు జెర్కొని రాజు అధ్యక్షతన రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 43.02 లక్షల మంది వికలాంగులు ఒక్కటి కంటే ఎక్కువ వైకల్యాలు కలిగిన వారు ఉన్నారని తెలిపారు. జనాభాలో 12.02 శాతం వికలాంగులు ఉన్నారని చెప్పారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా సంక్షేమ పథకాల్లో 12 శాతం వారికి కేటాయించాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్ పదవుల్లో వికలాంగులకు రిజర్వేషన్లు అమలుకు వీలుగా ప్రత్యేక చట్టం చేయాలని కోరారు. వారి కుటుంబాలకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలనీ, వైకల్య ధ్రువీకరణ పత్రం ఉన్న వారికి బస్సులు, రైల్వేల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలనీ డిమాండ్ చేశారు. మానసిక వికలాంగులు, మూగ చెవిటి వికలాంగుల మహిళలపై లైంగిక వేదింపులు, లైంగికదాడులు జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. 40 శాతం వైకల్యం కలిగిన వికలాంగులకు రాయితీ బస్సు పాసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు మూగ, చెవిటి, మానసిక వికలాంగులు, అంధులకు 40 శాతం వైకల్యం ఉంటే బస్సు పాసులు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాక్ పోస్టుల భర్తీ చేయాలనీ డిమాండ్ చేశారు. ప్రతి జిల్లా కేంద్రంలో వికలాంగులకు స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారికి ఉచిత కోచింగ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. '40 శాతం వైకల్యం కలిగిన వికలాంగులకు యుడీఐడీ కార్డులు వెంటనే పంపిణీ చేయాలి. ఆసరా పెన్షన్ల మంజూరుకు ఆదాయ పరిమితి నిబంధన ఎత్తి వేయాలి. జీవో 17ను వెంటనే రద్దు చేయాలి. ప్రతి గ్రామంలో డీఆర్ డీఏ ద్వారా వికలాంగులకు ప్రత్యేక గ్రూపులు ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేయాలి. ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు సామూహిక ప్రాంతాలన్నీ అవరోధరహితంగా మార్చాలి. వైకల్యం తీవ్రతను బట్టి బ్యాటరీ వీల్ చైర్స్, మోటరైజెడ్ వెహికల్స్ ఇవ్వాలి. ఉపాధి హామీ పథకంలో ప్రతి ఒక్కరికి జాబ్ కార్డ్ ఇచ్చి పని కల్పించాలి. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రతి వికలాంగునికి అంత్యోదయ రేషన్ కార్డు మంజూరు చేయాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో వారికి ఐదు శాతం కేటాయించాలి. వినికిడి పరీక్షలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా చేసి. అవసరమైన పరికరాలు ఇవ్వాలి' అని అడివయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు టి మధు బాబు, అరిఫ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు పి. బలిశ్వర్, వి.ఉపేందర్, నాయకులు శశికళ, లింగయ్య, భుజంగ రెడ్డి, ప్రభు స్వామి, మోగులయ్య, బుచ్చమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తక్షణం ఇంటర్మీడియట్ గోడౌన్లలో ధాన్యం దించాలి : గంగుల కమలాకర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైస్ మిల్లుల వద్ద స్థలం లేకున్నా, మిల్లులు సహకరించకున్నా తక్షణం ఇంటర్మీడియట్ గోడౌన్లలో ధాన్యం దించాలని పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ లోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయం నుంచి ధాన్యం సేకరణపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ రాజకీయాలు పట్టించుకోకుండా రైతులు రోడ్లపైకి రాకుండా వారికి అండగా ఉండాలని సూచించారు. తాలు, తరుగు సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. రవాణా సమస్య రాకుండా ట్రాక్టర్లను కూడా ఉపయోగించుకోవాలని కోరారు. పక్క రాష్ట్రాల్లో కొనుగోళ్లు లేనందున అక్కడి ధాన్యం రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ గోదాముల్లో దించే ధాన్యంతో మిల్లర్లకు ఎటువంటి సంబంధం ఉండకూడదని స్పష్టం చేశారు. అధికార యంత్రాంగం బాధ్యతతో వెంటనే రైతులకు చెల్లింపులు జరిగేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గంగుల కమలాకర్ తో పాటు సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మెన్ రవీందర్ సింగ్, కమిషనర్ అనిల్ కుమార్, జీఎంలు రాజారెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో 2.915 కిలోల బంగారం పట్టివేత

- దాని విలువ సుమారు రూ.1.81 కోట్లు

నవతెలంగాణ-శంషాబాద్

విదేశాల నుంచి భారీఎత్తున బంగారం తరలిస్తుండగా శంషాబాద్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో బుధవారం పట్టుబడింది. కస్టమ్స్ ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లాకు చెందిన వ్యక్తి దుబాయ్ నుంచి తెల్లవారుజామున 3 గంటల సమయంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చాడు. అతని కదలికలపై అనుమానం వచ్చిన అధికారులు తనిఖీ చేశారు. ఆ బ్యాగులో ఎమర్జెన్సీ లైటు కనిపించింది. దానిని పరిశీలించగా బంగారం బయటపడింది. ఎమర్జెన్సీ లైట్‌లోని బ్యాటరీ స్థలంలో బంగారాన్ని ఉంచి తీసుకొచ్చినట్టు గుర్తించారు. బంగారం విలువ రూ.1,81,60,450/- ఉంటుంది. 2.915 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంపాదకీయం

ఆణిముత్యాలు...

ప్రతిభ అన్నది ఏ ఒక్కరి సొత్తూ కాదు. పరికించి చూస్తే... నిశితంగా పరిశీలిస్తే ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక టాలెంట్ దాగుంటుంది. అలా ఒక్కొక్కరిలో దాగున్న ప్రతిభను వెలికితీసి... సానబడితే మట్టిలోంచి మాణిక్యాలు బయటకొస్తాయి. ఆ ఆణిముత్యాలు.. జాతిరత్నాలవుతాయి.

> ఈ విజేతల్లో అనేక మంది తొలి ప్రయత్నంలోనే విజయం సాధించలేదనే వాస్తవాన్ని గుర్తెరగాలి. వీరేగాదు... ఇప్పుడు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఉన్నతస్థాయి అధికారుల్లో పలువురు పది, ఇంటర్ తప్పిన వారు కూడా ఉన్నారనే విషయాన్ని గమనించాలి. ఆ తర్వాత వారు తమ బలహీనతలను అధిగమించి, బలాలను అంచనా వేసుకుని తమను తాము మలుచుకున్న తీరును, తద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించిన వైనాన్ని స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలి.

మంగళవారం విడుదలైన సివిల్స్ ఫలితాల్లో అలాంటి ఆణిముత్యాలే అద్భుతాలు సృష్టించాయి. ఇందులో 46 తెలుగు తేజాలు కూడా వికసించాయి... వందలోపు ర్యాంకుల్లో పదింటిని సాధించి... 'శభాష్...'అనిపించాయి. తద్వారా సరైన లక్ష్యం, కృషి ఉంటే దేన్నయినా సాధించవచ్చని ఆయా విజేతలు ప్రపంచానికి చాటి చెప్పారు. తద్వారా నేటి యువతరానికి ఆదర్శంగా నిలిచారు.

ఈ టాపర్లలో మూడో ర్యాంకు సాధించిన నూకల ఉమా హారతి తెలంగాణ బిడ్డ. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన ఈ అమ్మాయి తన వైఫల్యాల నుంచి బయటపడి విజేతగా నిలిచిన తీరుకు మనం జేజేలు పలకాల్సిందే. 2017 నుంచి సివిల్స్ ప్రయత్నాలు మొదలెట్టిన ఈమె... 2019 నుంచి వరసగా సంబంధిత పరీక్షలను రాయటం... విఫలమవటం... నిరాశా నిస్పృహలకు లోనుకావటమనేది కొనసాగుతూ వచ్చింది. అయినా వైఫల్యాలకు వెరవకుండా, లోపాలు, లోటుపాట్లను సరిదిద్దుకుని ముందుకు సాగారు. పట్టువదలని విక్రమార్కుడిలా కఠోర శ్రమ చేసి... ఐదోసారి గమ్యాన్ని ముద్దాడారు.. లక్ష్యాన్ని చేరుకున్నారు. ఇది ఉమా హారతి విజయగాథ.



ఇక కుమురం భీం జిల్లాకు చెందిన డోంగ్రీ రేవయ్యది మరో కన్నీటి వ్యథ. బాల్యంలోనే తండ్రిని కోల్పోయినప్పటికీ అది ఆయన విద్యాతృష్ణను అడ్డుకోలేకపోయింది. మధ్యాహ్న భోజన కార్మికురాలైన ఆయన తల్లి... తద్వారా వచ్చే డబ్బులు కుటుంబ పోషణకు సరిపోకపోవటంతో కూలి పనులకు వెళ్లేది. చిన్నతనంలోనే ఇలాంటి ఎన్నో కష్టాలు... కన్నీళ్లను చవి చూసిన రేవయ్య... ఏనాడూ చదువు మీద మమకారాన్ని కోల్పోలేదు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుకున్న ఆయన... ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని, మద్రాసు ఐఐటీలో 737 ర్యాంకు సాధించారు. కానీ అక్కడికి వెళ్లటానికి సైతం డబ్బుల్లేని దైన్యస్థితి. అప్పుడు మానవత్వం ఉన్న కొంతమంది దాతలు ఆదుకోవటంతో ఆయన అక్కడ కెమికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి... తనేంటో, తన ప్రతిభేంటో చాటి చెప్పారు. ఓఎన్‌జీసీలో అత్యున్నత స్థాయి ఉద్యోగం వచ్చినా... తన జీవితాశయాన్ని నెరవేర్చుకోవటానికి సివిల్స్ వైపు అడుగులేశారు. గతేడాది రెండు మార్కుల తేడాతో తృటిలో అవకాశాన్ని కోల్పోయినా నిర్లిప్తతకు, నైరాశ్యానికి ఎక్కడా చోటివ్వలేదు. 'శ్రమ నీ ఆయుధమైతే.. విజయం నీ బానిస అవుతుంది...' అనే రీతిలో మరోసారి ప్రయత్నించి విజయకేతనం ఎగరేశారు రేవయ్య.

ఇది ఒక్క ఉమా హారతికి సంబంధించిన విషయమో... రేవయ్యకు చెందిన అంశమో కాదు... సివిల్స్‌లో విజయం సాధించిన అందరి విజేతల సంకల్పానికి నిదర్శనం. 'సముద్ర కెరటం నాకు ఆదర్శం... లేచి పడుతున్నందుకు కాదు... ఎన్నిసార్లు పడినా మళ్లీ లేస్తున్నందుకు...' అని ఓ కవి రాసుకున్నారు. ఇవి చూడటానికి ఐదారు పదాలే. కానీ వాటిలో జీవిత సత్యం దాగుంది. ఇటీవల ఇంటర్ ఫలితాలు వచ్చినప్పుడు దాదాపు పది మంది పిల్లలు... పరీక్ష తప్పామనే కారణంతో ఆత్మహత్యలు చేసుకుని కన్నోళ్లకు కడుపుకోతను మిగిల్చారు. విషాదమేమంటే... ఫలితాలు రాకముందే ఒక విద్యార్థి ఫెయిలవుతాననే భయంతో 'ఉసురు' తీసుకున్నాడు. ఫలితాలు వచ్చాక చూస్తే... అతడు మంచి మార్కులతో పాసయ్యాడు. అప్పుడు మార్కుల మెమోను పట్టుకుని అతడి కన్నతల్లి పెట్టిన కంటతడిని ఎవరూ ఆపలేకపోయారు... మరెవ్వరూ ఆమెను ఓదార్చలేకపోయారు.

ఇలాంటి ఆత్మనూన్యతా భావంతో ఉన్న పిల్లలు, విద్యార్థులు, యువకులందరూ నేటి సివిల్స్ ర్యాంకర్లను ఆదర్శంగా తీసుకోవాలి. ఈ విజేతల్లో అనేక మంది తొలి ప్రయత్నంలోనే విజయం సాధించలేదనే వాస్తవాన్ని గుర్తెరగాలి. వీరేగాదు... ఇప్పుడు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఉన్నతస్థాయి అధికారుల్లో పలువురు పది, ఇంటర్ తప్పిన వారు కూడా ఉన్నారనే విషయాన్ని గమనించాలి. ఆ తర్వాత వారు తమ బలహీనతలను అధిగమించి, బలాలను అంచనా వేసుకుని తమను తాము మలుచుకున్న తీరును, తద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించిన వైనాన్ని స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలి. అలా వారు విజయావకాశాలు ఒడిసి పట్టేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు తగిన తోడ్పాటునందించాలి. సభ్య సమాజం ఆ రకమైన వాతావరణాన్ని కల్పించాలి. ప్రభుత్వం తన బాధ్యతగా కోచింగ్ సెంటర్లు, స్టడీ సర్కిళ్లు, హాస్టళ్లను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించాలి. అందుకు తగినన్ని నిధులు కేటాయించాలి.

ప్రత్యేక మతం కోడ్‌తోనే ఆదివాసీల ఉనికి సాధ్యం


ఆత్రం తనుష్

కేంద్రంలోని మోడీ అనుసరిస్తున్న విధానాల వల్ల ఆదివాసీల ఉనికి నేడు ప్రశ్నార్థకంగా మారింది. అడవులను కార్పొరేట్లకు ధారాదత్తం చేయడం కోసం ఆది వాసీల గొంతు నొక్కుతున్నారు. ప్రకృతి, భూమి ఆధారంగా జీవించే వారి బతుకులను బుగ్గిపాలు చేస్తున్నారు. కులం, మతం పేరుతో ప్రజల్ని విభజించి పాలించే బీజేపీ కుట్రలు దేశమంతా చూస్తున్నాం. కానీ అడవిలో ఉండే క్రూర మృగాలైన వన్యప్రాణులతో నిత్యం సావాసం చేసే ఆదివాసీలు నేడు పాలకులను చూస్తే భయపడాల్సిన పరిస్థితి. దానికి కారణాలనేకం. ఏండ్లుగా ఆదివాసులకు ప్రత్యేక మతం ఉండాలనే డిమాండ్ వస్తున్న నేపథ్యంలో వారి జీవనంపై ఆధిపత్య ధోరణి, విషసంస్కృతి, మతఛాందసాలు అలుముకుంటున్నాయి. రోజురోజుకూ కనుమరుగ వుతున్న జాతిని కాపాడుకోవడమే ధ్యేయంగా పోరాటాలు అనివార్యమయ్యాయి. దేశ వ్యాప్తంగా 705 ఆదిమ తెగలు ఉన్నాయి. దాదాపు అన్ని ఆదిమ తెగలు తమకంటూ ప్రత్యేక సాంస్కృతిక, జీవన విధానం, ఆచార వ్యవహారాలను పాటిస్తాయి. ఇతర మతాలకు సంబంధించిన సాంస్కృతిక, సాంప్ర దాయపు విధులు ఆయా మతాలకు సంబంధించిన మతగ్రంథల ఆధారంగా ఉంటాయి. అంటే హిందువులకు పురాణాలు, ఉపనిషత్తులు, క్రైస్తవులకు బైబిల్, ముస్లింలకు ఖురాన్ ఆధారంగా తీసుకొని తమ సాంప్రదాయక కార్యక్రమాలు చేపడతారు. కానీ ఆదిమ తెగలలో ప్రతీ ఒక తెగకు ఆ తెగకు సంబంధించి సాంస్కృతిక సాంప్రదాయ, ఆచారా వ్యవహారాలు తమ ప్రకృతి పరిసరాలు ఆధారంగా పురాతనంలోనే రూపుదిద్దుకున్నాయి. ఆదిమ తెగలలో కులాన్ని లేదా వర్గాలను పాటించరు.

> వేగవంతమైన సామాజిక మార్పుల వల్ల ఆదిమ తెగలు తమ ఉనికిని కోల్పోయే పరిస్థితి లేకపోలేదు. ఆదిమ తెగల జీవన విధానం, వారి ప్రత్యేక సాంస్కృతికను కోల్పోతున్నారు. ప్రత్యేకించి పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఆదిమ తెగలకు సంబంధించిన ప్రజలు ఆదివాసీ యేతర ఆధిపత్య సాంస్కృతిని వారు అలవర్చుకుంటున్నారు. దీంతో వారి గుర్తింపును, ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉంది. ఎక్కడ నివాసం ఉన్నా తమ గుర్తింపును, ఉనికిని కాపాడుకో వడానికి తమ సాంస్కృతిని సంరక్షించుకోవాలన్నా, వారికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలన్నా ఆదిమ తెగలకు జనాభ లెక్కల్లో ప్రత్యేక మతం గుర్తింపును ఇవ్వడమే అంతిమ పరిష్కారం.

దేశంలో 2011వ సంవత్సరం జనాభా లెక్కల ప్రకారం ఆదిమ తెగల జనాభా 10కోట్లా 40లక్షలు (అంటే దేశ జనాభాలో ఆదిమ తెగల జనాభ 8.6శాతం). ఆదిమ తెగల వారు ఏ మతానికి సంబంధం లేకుండా, తమ ప్రత్యేక ఆచారాలను పాటిస్తారు. వీరిని ప్రకృతి ఆరాధకులుగా నిర్ధారించవచ్చు. కాలానికి అనుగుణంగా సమాజంలో వచ్చిన అనేక మార్పులు ఆదిమ తెగల ఉనికిని, అస్తిత్వాన్ని కనుమరుగు చేస్తున్నాయి. పట్టణ ప్రాంతాలు లేదా మైదాన ప్రాంతాలకు బతుకుతెరువు, ఉపాధి ఉద్యోగాల రీత్య వచ్చిన ఆదివాసీలు స్థానికంగా ఉండే ఆదివాసీ యేతర ఆధిపత్య సంస్కృతి, ఆచార వ్యవహారాలను అలవరుచుకోవడంతో వారి ఆదిమ తెగలకు సంబంధించిన ఆచారాలు వారి తరువాతి తరాలకు అందజేయడంలో విఫలమై వారి ఉనికిని కోల్పోయే పరిస్థితికి వచ్చారు. ఒక సమూహాన్ని ఆదిమ తెగగా లేదా షెడ్యుల్డ్ తెగగా గుర్తించాలంటే ఇప్పటి వరకు వచ్చిన కమిషన్లు ఆ సమూహం ప్రత్యేక సాంస్కృతిక పైనే ప్రాథమిక ఆధారంగా తీసుకోవాలని సూచిస్తున్నాయి. 1965వ సంవత్సరంలో లోకూర్ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం ఒక సమూహాన్ని షెడ్యూల్డ్ తెగగా గుర్తించాలంటే ఐదు లక్షణాలను ప్రామాణికంగా తీసుకోవాలని సూచించింది. 1.ఆ సమూహంలో ప్రాథమిక దశలోని జీవన విధానం అంటే అటవి ఉత్పత్తుల సేకరణ, వేట, ప్రకృతి ఫలాలపై ఎక్కువగా ఆధారపడడం మొదలైనవి. 2. భిన్నమైన (ప్రత్యేక) సాంస్కృతి :ఆ సమూహంలో ఇతర ఏ మతానికి సంబంధం లేకుండా ప్రత్యేక సాంస్కృతిక, భాషా, ఆచార వ్యవహారాలు, పూజా పద్ధతులు ఉండడం. 3. ఇతరులతో కలవడానికి సిగ్గుపడటం లేదా భయపడటం: తమ తెగకు చెందిన వారు కాకుండా లేదా బయటి వ్యక్తులతో మాట్లాడటానికి మరియు పరిచయాలు పెంచు కోవడానికి భయపడటం లేదా సిగ్గుపడటం. 4. భౌగోళిక నిర్బంధం: భౌగోళికంగా తమ సరిహద్దులను ఏర్పర్చు కొని బయటి వ్యక్తులు తమ సరిహద్దులు దాటి లోపలికి రానియకుండా, లేదా తాము ఆ సరిహద్దులు దాటకుండా ఉండే భౌగోళిక నిర్బంధమైన లక్షణం. 5. వెనుకబాటుతనం: ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో ఆ సమూహం సాధారణ సమాజం కంటే వెనుకబడటం. ఈ ఐదు లక్షణాలను ప్రామాణికంగా తీసుకొని ఒక సమూహాన్ని షెడ్యూల్డ్ తెగల జాబితాలో చేర్చాలని లోకూర్ కమిటీ సూచించింది.



ఆదివాసీలకు ప్రత్యేక మతం ఎందుకు అవసరం?

స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిషు ప్రభుత్వం ఆదిమ తెగలను ఆనిమిష్ట్ (Animist)గా పరిగణించింది. ఆనిమిష్ట్ అంటే జీవాత్మను నమ్మడం. సాధారణంగా చెప్పాలంటే ప్రతీ జీవి, ప్రతీ వస్తువు, ప్రతీ ప్రాంతం, అడవి, కొండా, చెట్టూ పుట్టా అన్నిట్లో జీవం ఉందని భావనతో దైవంగా కొలిచేవారు. స్వాతంత్ర్య అనంతరం 1951వ సంవత్సరం మొట్టమొదటి జనగణనలో ఆదిమ తెగలను 'ట్రైబ్' (Tribe)గా గుర్తించేందుకు 9వ కాలంని ఏర్పాటు చేసింది. ఆ తరువాత 1961వ సంవత్సరం జనగణనలో 'ట్రైబ్' అనే కాలంని తీసివేసి "ఇతరులు"లో కలిపేయడంతో ఆదిమ తెగల జనగణన స్పష్టంగా తెలుసుకునేందుకు వీలులేకుండా పోయింది. నేటి ఆర్థిక రాజకీయ పరిస్థితుల్లో ముఖ్యంగా దేశంలోని మెజారిటీగా ఉన్న హిందువులు, క్రైస్తవులు తమ సంఖ్యను ఎక్కువగా చూపించేందుకు విఫల ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. ఈ క్రమంలో ఆదివాసీలు కొందరు హిందువులుగా, ఇంకొందరు క్రైస్తవులుగా, ఇతరాత్ర మతాలలో తమ గుర్తిపును నమోదు చేసుకోవడం వల్ల ఆదివాసీల జనాభా విభాజితమై ఉంది. దీనితో ఆదిమ తెగల జనాభా స్పష్టంగా తెలిసేందుకు అవకాశం లేదు. ఆదిమ తెగలకు ప్రత్యేక మతంగా జనగణనలో నమోదు చేసినప్పునట్లైతే అన్ని 705 ఆదిమ తెగల జనాభా సంఖ్య అనేది స్పష్టంగా తెలుసుకోవచ్చు. తద్వారా ప్రభుత్వాలకు ఆయా ఆదిమ తెగల ఆర్థిక సామాజిక పరిస్థితులను స్పష్టమైన అవగాహనతో ప్రభుత్వ పథకాలు, ప్రత్యేక నిధులతో వారిని అభివృద్ధి చేసేందుకు ఆస్కారం ఉంది. అలాగే రాజ్యాంగంలోని ఆర్టికల్ -244 అంశంలోని 5వ, 6వ షెడ్యూల్ సూచించిన దాని ప్రకారం ఆదిమ తెగల సాంస్కృతిక భూభాగాలు వారి ప్రత్యేక ఆచారా వ్యవహారాలతో పాటు అడవిని, ప్రకృతిని ప్రభుత్వం రక్షించవచ్చు.

ప్రత్యేక మతంగా గుర్తించకపోతే జరిగే నష్టాలు

ఆదివాసీలకు ప్రత్యేక మతంగా గుర్తించకపోతే జనగణనలో వారి గుర్తింపుని ఇతర మతాలలో నమోదు చేసుకుంటారు. వారి ప్రత్యేక సంస్కృతి, వారి తెగ భాషను కోల్పోతారు. వారి ఉనికి, ప్రత్యేక గుర్తింపు ఉండదు. వారు ఫలానా ఆదివాసీ తెగకు సంబంధించిన వారు అని ధృవీకరణ చేసుకునేందుకు ఎటువంటి ఆధారాలు ఉండకపోవడం వల్ల వారు రిజర్వేషన్ ఫలాలను కోల్పోయే అవకాశం ఉంది. ఆదిమ తెగల జనాభా ఇతర మతాలలో విభాజితమై ప్రభుత్వాలు ఆదిమ తెగలకు అందించే ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలపై స్పష్టమైన అవగాహన ఏర్పడకపోవడం లాంటి సమస్యలు ఎదురవుతాయి.

జరిగే లాభాలు: ఆదివాసీలకు ప్రత్యేక మత గుర్తింపు ఇస్తే వారు జనగణనలో వారికి సంబంధించిన తెగలోనే వారి గుర్తింపుని నమోదు చేసే అవకాశం ఉంది. వారి ప్రత్యేక సాంస్కృతి, ప్రాచీన ఆచారాలను తరువాతి తరాలకు అందిస్తు వాటిని పరిరక్షించవచ్చు. వారి తెగ భాషను వారి సాధారణ జీవనంలో వినియోగించడం వల్ల వారి ప్రాచీన తెగల భాషను కాపాడుకోవచ్చు.వారు తమ ఉనికిని, ప్రత్యేక గుర్తింపును తరతరాలకు కాపాడుకోవచ్చు. వారికి తమ ప్రత్యేక గుర్తింపు ఉండటం వల్ల వారు ఫలాన ఆదిమ తెగకు సంబంధించిన వారిగా ధృవీకరించి, రిజర్వేషన్ ఫలాలు అందించవచ్చు. ఆదిమ తెగల జనభా సంఖ్య ప్రత్యేక మతంలో ఉండటం వల్ల ప్రభుత్వాలు చేపట్టే ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలపై స్పష్టమైన అవగాహనతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చు.

ఆదివాసీలకు ప్రత్యేక మత గుర్తింపు సాధ్యమేనా?

దేశంలోని దాదాపు అన్నీ తెగలకు ఏ మత గ్రంథం ఆధారంగా లేకుండా తమదైన ప్రత్యేక సాంస్కృతి, ప్రత్యేక ఆచారాలతో ప్రకృతి ఆరాధన ఆధారంగా మతం గుర్తింపును ఇవ్వవచ్చు. జనాభా రీత్యా చూసినప్పుడు దేశంలో 8.6శాతంగా ఉంది. దీని కంటే ఇతర మైనారిటీ మతాల జనాభ సంఖ్య తక్కువ, సిక్కులు 1.7శాతం, బౌద్ధులు 0.7శాతం జైనులు 0.4శాతాలకు ప్రత్యేక మత గుర్తింపు ఉన్నది. అలా చూసినప్పుడు 8.6శాతంగా ఉన్న ఆదివాసీల జనాభాకు ప్రత్యేక మత గుర్తింపు ఇవ్వాల్సిందే. 2011లో నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఆదిమ తెగలను ప్రత్యేక మతంగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపింది. కానీ కేంద్రం దానిపైన దృష్టి పెట్టకపోవడం శోచనీయం. 2022లో జార్ఖండ్ ప్రభుత్వం అక్కడి సంతాల్ ఆదిమ తెగకు "సర్నా" మతం కోడ్ జనగణనలో కేటాయించాలని శాసనసభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పార్లమెంట్లో చర్చకు పెట్టాలని పంపింది. కానీ ఇప్పటి వరకు దానిపైన ఎటువంటి స్పందన లేక పోవడం ఆదివాసీల అభివృద్ధిపైన బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనంగా భావించవచ్చు. అదేవిధంగా మధ్యప్రదేశ్‌లోని గోండులు, 'గోండీ ధర్మ' కోయలు, "కోయా పున్నెం' గుర్తింపుకోసం ఉద్యమాలు చేస్తుండడం ఈ మధ్య కాలంలో గమనించవచ్చు.

> ఆదివాసీలకు ప్రత్యేక మత గుర్తింపు ఇస్తే వారు జనగణనలో వారికి సంబంధించిన తెగలోనే వారి గుర్తింపుని నమోదు చేసే అవకాశం ఉంది. వారి ప్రత్యేక సాంస్కృతి, ప్రాచీన ఆచారాలను తరువాతి తరాలకు అందిస్తు వాటిని పరిరక్షించవచ్చు. వారి తెగ భాషను వారి సాధారణ జీవనంలో వినియోగించడం వల్ల వారి ప్రాచీన తెగల భాషను కాపాడుకోవచ్చు.వారు తమ ఉనికిని, ప్రత్యేక గుర్తింపును తరతరాలకు కాపాడుకోవచ్చు. వారికి తమ ప్రత్యేక గుర్తింపు ఉండటం వల్ల వారు ఫలాన ఆదిమ తెగకు సంబంధించిన వారిగా ధృవీకరించి, రిజర్వేషన్ ఫలాలు అందించవచ్చు. ఆదిమ తెగల జనభా సంఖ్య ప్రత్యేక మతంలో ఉండటం వల్ల ప్రభుత్వాలు చేపట్టే ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలపై స్పష్టమైన అవగాహనతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చు.

వేగవంతమైన సామాజిక మార్పుల వల్ల ఆదిమ తెగలు తమ ఉనికిని కోల్పోయే పరిస్థితి లేకపోలేదు. ఆదిమ తెగల జీవన విధానం, వారి ప్రత్యేక సాంస్కృతికను కోల్పోతున్నారు. ప్రత్యేకించి పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఆదిమ తెగలకు సంబంధించిన ప్రజలు ఆదివాసీ యేతర ఆధిపత్య సాంస్కృతిని వారు అలవర్చుకుంటున్నారు. దీంతో వారి గుర్తింపును, ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉంది. ఎక్కడ నివాసం ఉన్నా తమ గుర్తింపును, ఉనికిని కాపాడుకో వడానికి తమ సాంస్కృతిని సంరక్షించుకోవాలన్నా, వారికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలన్నా ఆదిమ తెగలకు జనాభ లెక్కల్లో ప్రత్యేక మతం గుర్తింపును ఇవ్వడమే అంతిమ పరిష్కారం.

సెల్: 9490469720



'ఉద్యోగ' క్యాలెండర్ ప్రకటించాలి


వి. దిలిప్
8464030808

'మోచేతికి బెల్లం పెట్టి నాకమన్నట్టు' అనేది తెలంగాణలో ఇచ్చే ఉద్దేశం, ఆశలను తీర్చే ఉద్దేశం లేనప్పుడు చేసే పనులను తెలుపడానికి విరివిగా వాడే సామెత. గిప్పుడు తెలంగాణ నిరుద్యోగుల పట్లా తెలంగాణ ప్రభుత్వం తీరు గూడా గిట్లనే ఉన్నది. మొత్తంగా తెలంగాణ ఉద్యమంలో యువత ముందువరుసలో నిలబడి కొట్లాడింది తమ ఉద్యోగాలు తమకు దక్కుతాయని. కొత్త ఉద్యోగాల సృష్టి జరిగి తమ కలలు నెరవేరుతాయని. వందల మంది యువత ప్రాణాలను అర్పించింది. బలిదానాలు భవిష్యత్తు యువత జీవితాల్లో వెలుగులు నింపాలని ఆశతోనే. కానీ వారి బలి దానాల విలువలేకుండా పోయింది. నిరుద్యోగ యువత ఆశలు నీరుగారి పోతూనే ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం వచ్చినప్పటి నుండి ఏ ఒక్క నాడు నిరుద్యోగుల గురించి, నూతన ఉద్యోగాల కల్పన గురించి ఆలోచించిన పాపాన పోలేదు. పైగా 'కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడింద'న్న చందంగా ఉన్న ఉద్యోగాలను ఊడబీకడం కాదు సుమా విఆర్‌వోలను తొలగించి ఆ వ్యవస్థనే లేకుండా చేసింది. మొత్తం తెలంగాణలో ప్రభుత్వం శ్రద్ధతో నింపిన ఉద్యోగాలు ఏవైనా ఉంటే అవి కేవలం పోలీస్ ఉద్యోగాలు మాత్రమే. వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే టిఆర్‌టి పేరుతో వందల్లో నామ్‌కే వాస్తు నింపి చేతులు దులుపుకున్నది. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత పేద విద్యార్థుల మెరుగైన విద్యకోసం అని కేసీఆర్ మానస పుత్రిక అయిన కేజీ టూ పీజీ విద్యను అందించడం కోసమని 500పై చీలుకు నూతన గురుకులాలను స్థాపించడం స్వాగతించాల్సిన విషయం. కానీ ఇన్ని గురుకులాల్లో పూర్తి స్థాయిలో ఇప్పటి వరకు బోధన, బోధనేతర ఇతర అన్ని రకాలా సిబ్బందినీ నియమించలేదు. ఇది ఆక్షేపనీయమే కాక పేద ప్రజల విద్య పట్లా ప్రభుత్వాల ఉదాసీనతకు తార్కాణం.

ప్రభుత్వమే ఉద్యోగాల కల్పన,నియామకాల పట్లా నిర్లక్ష్యంగా ఉన్నదనడానికి టిఎస్‌పిఎస్ పేపర్లలీక్ ఒక పెద్ద ఉదాహరణ. ఆ ఒక్క ఘటన స్వరాష్ట్రంలో ఉన్నత కొలువులో ఉండాలని ఆశించిన ఎంతో మంది నిరుద్యోగుల మానసిక స్థైర్యాన్ని, స్వరాష్ట్రం సాధన పట్లా వారి నమ్మకాన్ని ఎంత పోగొట్టింది అనేది ఈ పాలకులకు ఏమి పట్టడం లేదు. పాలకుల పాపానికి ప్రతిసారీ తెలంగాణ నిరుద్యోగ యువతే భంగపాటుకు గురవుతున్నది. ఏ ఏడు కాయేడు ప్రత్యేక ఉద్యోగ క్యాలెండర్ తీసి దాని ప్రకారం ఉద్యోగాలు నింపాల్సింది పోయి అసలు ఎప్పుడూ ఎట్లా నిర్వహిస్తాయో తెలియని అయోమయ స్థితికి తెలంగాణ ప్రభుత్వమే తీసుకుపోయింది. కనీసం ఉద్యోగ అర్హతకు సంబంధించిన పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించని స్థితిలో ఉన్నది ఇప్పుడు. ఏడాదికి రెండు సార్లు నిర్వహించాలన్న టెట్‌నీ నిర్వహించడం లేదు. ఏడాదికొకసారి నిర్వహించాలన్న సెట్‌నీ సరిగా నిర్వహించక పోవడం వల్ల వేలాది ఉపాధ్యాయ, అధ్యాపక అభ్యర్థులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. నలుగురు కలిసిన చోట నిరుద్యోగ యువత మన మెడమీద మనమే కత్తి పెట్టుకున్నమార ప్రాణాలకు తెగించి కొట్లాడి తెలంగాణ తెచ్చుకుని అని నిరాశతో అనుకుంటున్నారు. రాష్ట్రం వచ్చి పదేండ్లు దగ్గరికి వస్తున్న ఇప్పటివరకు ఒకసారి కూడా ఉన్నత విద్యా శాఖలో డిగ్రీ కళాశాల అధ్యాపక కొలువులు నింపలేదు. మూడేండ్లుగా సెట్ నిర్వహించలేదు. ఇప్పుడు గురుకుల డిగ్రీ కళాశాలలో అధ్యాపక కొలువుల నియామక నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ కొత్తగా సెట్ అర్హత సాధించి అధ్యాపక కొలువు సాధించాలని కలలు కంటున్న వారికి మాత్రం అది చేదు గులికే అవుతున్నది.

ప్రభుత్వం సెట్ పరీక్షను ఆలస్యంగా పెట్టడమే కాకుండా నియామక నోటిఫికేషన్ కంటే ముందుగా అర్హత సాధించిన వారు మాత్రమే అర్హులు అని తెలుపడం ద్వారా ఇటీవల ప్రభుత్వం 29సబ్జెక్టుల్లో నిర్వహించిన సెట్ పరీక్షల్లో అర్హత సాధించిన 2857మంది అప్లై చేసుకునే గడువు ఉన్నా ప్రభుత్వ నిబంధనలతో అనర్హులుగా మారుతున్నారు. 'అంగట్ల అన్ని ఉన్న అల్లుని నోట్లే శని ఉన్నది' అనే మాదిరిగా ఉన్నది నూతన సెట్ అర్హత సాధించిన అభ్యర్థుల పరిస్థితి. ప్రభుత్వం సక్రమంగా సెట్, అర్హత పరీక్షలను సక్రమంగా నిర్వహిస్తే నిరుద్యోగులు, ఆశావహ అభ్యర్థులు ఇంత ఆందోళన పడకపోదురు. ప్రభుత్వాల తప్పిదాలకు నిరుద్యోగ యువతను బలిచేయకుడదు. ఇప్పటికే అర్హత సాధించిన అభ్యర్థులందరికీ అప్లై చేసుకునే అవకాశం కల్పించాలి. ఇట్లా అవకాశం కల్పించడం ద్వారా కొత్త వారిని సెట్ చేస్తే ప్రభుత్వం ఎంతో కొంత తనపైన గల నిరుద్యోగుల అసంతృప్తులను ఎంతో కొత్త తగ్గించు కోగలదు. ఏ ఆశలతో తెలంగాణ కోసం యువత కొట్లాడింద్రో ఆ ఆశలను నెరవేర్చడానికి సక్రమమైన ప్రణాళికతో ఉద్యోగ నియామకాల క్యాలెండర్ ప్రకటించాలి. ఔట్ సోర్సింగ్, ఒప్పంద ప్రాతిపదిక నియామకాల స్థానే శాశ్వత ఉద్యోగాల నియామకం జరిపినప్పుడు మాత్రమే బంగారు తెలంగాణ నిర్మాణం అవుతుంది. బలిదానం చేసుకున్న విద్యార్థి, యువత బలిదానాల ప్రయోజనం నెరవేరినట్టు అవుతుంది.


ప్రజాస్వామ్యం రాజ్యాంగబద్ధమైనప్పుడే సత్ఫలితాలు


జి. తిరుపతయ్య
9951300016

"డెమోక్రసీ ఇస్ ది గవర్నమెంట్ ఆఫ్ ద పీపుల్, ఫర్ ద పీపుల్ అండ్ బై ద పీపుల్" అని అబ్రహం లింకన్ ఇచ్చిన నిర్వచనాన్ని అర్థం చేసుకోవడం కొంత కఠినంగానే అనిపించినా, రకరకాల పరిపాలన విధానాలలో జవాబు దారితనానికి ప్రతీకగా నిలిచేది ప్రజాస్వామ్యం మాత్రమే. ప్రజాస్వామ్యంలో అత్యంత ప్రభావవంతమైనది ఓటు. ఎన్ని ఎత్తులు వేసినా ఓటు తూటాకు అందరూ బద్ధులై ఉండవలసిందే. కర్నాటక రాష్ట్ర శాసనసభ ఫలితాలకు ముందు ఒక భయానక, దిగ్భ్రాంతి కలిగించే వాతావరణం కనిపించింది. ఇప్పుడది పటాపంచలై స్వేచ్ఛా వాయువు లేవో వీస్తున్నంత స్వాంతన చేకూరింది. రాళ్ళల్లో నిప్పు ఎలా వచ్చిందో తెలుసా... అంటూ మా నానమ్మ నాకు చిన్నప్పుడు ఒక కథ చెప్పింది. అదేమంటే... ఒకానొకనాడు వానదేవుడు అగ్నిదేవుడు (నీరు, నిప్పు) "నేను గొప్ప... నేను గొప్ప" అంటూ పోటీ పెట్టుకున్నారట. నిప్పు ఒక్కసారిగా తన ప్రతాపాన్నంతా చూపిస్తూ దావానంలా వ్యాపించి సర్వాన్ని దహించి వేస్తున్నదట, అప్పుడు నీరు... తరంగములై ఉరకలేస్తూ వెంటాడి వేటాడి నిప్పుపై విరుచుకు పడిందట, నీటి ధాటికి తట్టుకోలేని నిప్పు, రాళ్ళల్లో తనని తాను దాచుకున్నదట. ఇది కొంచెం అతిశయోక్తిగా అనిపించినా కర్నాటక ఫలితాల అనంతరం సద్దుమణిగిన కాకి గోలను చూస్తే గుర్తుకు వచ్చింది.

ఒకవైపు బజరంగభలి నినాదాలు... మరోవైపు కేరళ స్టోరీ అంటూ విద్వేషాలు... ఇంకోవైపు లింగాయతులు మఠాధిపతులు... మరింకోవైపు మత ప్రాతిపదిక రిజర్వేషన్లు... అంతకుముందు హలాల్ మాంసం, హిజాబ్... అంతకుముందే గౌరీ లంకేష్, కల్బుర్గి హత్యలు... ఎన్ని రకాల అస్తిత్వ వాదనలో ఎన్ని రకాల విభజన ప్రసంగాలో... ఇలాంటి వాదనలకు సునాయాసంగా సాధారణ మనుషులందరూ ప్రభావితం అవడం మామూలు విషయం. రాజ్యాంగబద్ధమైన లౌకిక ప్రజాస్వామ్యం కాకుండా ఒక మతతత్వ వాదనతో కూడిన పరిపాలన జరిగే దేశమైతే పైన పేర్కొన్న అస్తిత్వ వాదాల నుండి బయటపడటం అంత సులభం కాకపోయి ఉండేది. మత పెద్దలు సాంప్రదాయ వాదులు ఓటర్లను పూర్తిగా ప్రభావితం చేసి ఉండేవారు. స్వాతంత్రోద్యమ పెద్దలు అందించిన మహాగ్రంథం 'రాజ్యాంగం' సర్వసత్తాక గణతంత్ర దేశంగా అభివర్ధించిన కారణంగా నేడు లౌకిక ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం విరాజిల్లుతున్నది. అందులో భాగంగానే రాజ్యాధికారం కోసం జరిగే ఎన్నికలలో ప్రజలే అంతిమ నిర్ణేతలుగా నిలుస్తున్నారు. ఇక్కడ భారతీయ జనతా పార్టీ ఓడిపోయి కాంగ్రెస్ పార్టీ గెలిచినందుకు సంబరపడుతూ చెప్పడం లేదు. సామాజిక సమస్యకు శాస్త్రీయ పరిష్కారాన్ని ఇవ్వవలసిన రాజకీయాలు, అసంబద్ధ ఆధ్యాత్మిక, అపరిపక్వ మత అవగాహనలతో ప్రజలను ఒక గూటిలో దూర్చాలన్న దురుద్దేశాల నుండి జనం బయటపడినందుకు మాత్రమే కొన్ని అంశాలను వక్కాణించడం జరుగుతుంది. నేడు కర్నాటకలో కొలువుదీరిన కాంగ్రెస్ తప్పుడు పరిపాలన చేసినా, పాలించడం మరిచి విభజించడాకి పూనుకున్నా, వారిని గద్దెదించి బీజేపీకో లేదా మరొకరికో అధికారాన్ని అప్పగించే అవకాశం ఈ ప్రజాస్వామ్య విధానంలో ఉన్నది. అందుకు తప్పకుండా అందరం సంబర పడవలసినదే. అందుకే, బహుళత్వాన్ని కోరుకునే మనుషులకు, కర్నాటక ఫలితాలు మండుతూ ఓట్టిపోయిన ఎడారిలో మట్టి నుంచి ఉబికిన వయాసిస్ లాంటివి.

ఎన్నికలు జరిగేది అధికారం కోసం, ఆ అధికారం ప్రజలను పాలించడం కోసం, ఆ పాలనలో రాజకీయ సామాజిక అంశాల మెరుగుదలపై విధానాలు ఉండాలి. ఇవి కాకుండా 50సంవత్సరాల క్రితం మీ రాష్ట్రానికి చెందిన ఒక మిలిటరీ కమాండర్‌ను ఫలానా నాయకుడు అవమానపరిచాడు, మీ రాష్ట్రానికి దక్కవలసిన గౌరవాన్ని ఫలానా పార్టీ చేజార్చింది... అంటూ



చారిత్రక వాస్తవాలను తప్పుడుగా వల్లిస్తూ ఓట్లను రాబట్టుకునే ప్రయత్నం అతి జుగుప్సాకరమైనది. బలవంతపు మతమార్పిడులు, ఉగ్రవాద కార్యక్రమాల వైపు అతి బలవంతపు ప్రోత్సాహం దేశంలో జరుగుతున్నట్లు కేవలం ఒక సినిమా ద్వారా దేశ అత్యున్నత పాలకులు తెలుసుకోవడం, దాన్ని ఎన్నికల ప్రసంగాలలో మాత్రమే ఉటంకించడం బాధ్యతారాహిత్యం కాదా? ఇప్పటికైనా సదరు అంశాలు నిజమైతే తక్షణ చర్యలకు ఉపక్రమించాలి. అక్రమ చొరబాట్లకు ఆనవాళ్లుగా పేర్కొనే రోహింగ్యాల అంశం కూడా ఎన్నికల ప్రచారానికి అస్త్రంగా మారకూడదు. ఇలాంటివన్నీ సాధారణ ప్రజలు నిశితంగా గమనిస్తారు కాబట్టే 26కిలోమీటర్ల రోడ్డు షోలు నాలుగు గంటల పాటు నిర్వహించి, భజరంగబలి నినాదాలు ఇచ్చినప్పటికీ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లతో కొందరి భవిష్యత్తును నిర్ణయించారు. అయితే ఈ కర్నాటక ఫలితాలతో అస్తిత్వవాదానికి పూర్తిగా తెరపడింది అన్న భ్రమలు కూడా లేవు, ఉండకూడదు కూడా. మతం, జాతి అనే అస్తిత్వవాదాలు కూడు గూడు గుడ్డ సమకూర్చడం లో ఏ విధమైన పాత్ర పోషించనప్పటికీ, తమను తాము ఆత్మాహుతి దళంగా మార్చుకునే మూఢత్వపు శక్తిని మనిషికి ఇస్తాయి. ఈ అస్తిత్వవాదాలకు భక్తి తోడైనప్పుడు ఇక పట్టవశంగానంత ప్రమాదం. 'ఒకరి అవసరాలకు మరొకరు' అన్న ప్రాపంచిక దృక్పథమే కాదు 'ఎవ్వరికీ కూడా మరొకరిని ఎల్లకాలమూ అణిచిపెట్టడం సాధ్యం కాలేదు' అన్న చారిత్రక సత్యాన్ని గ్రహించినప్పుడే బహుళత్వాన్ని గుర్తించ గలుగుతాం, దాని స్థాపనకు పాటుపడ గలుగుతాం.

నేడు లౌకికవాదం పై దుష్ప్రచారం బాగా జరుగుతుంది. లౌకికవాదం అంటే ఇతర మతాలకు ముఖ్యంగా మైనారిటీ మతాలకు ప్రాధాన్యతను ఇవ్వడం అని చెపుతుంటారు. ఇది తప్పు. లౌకికవాదం అంటే రాజ్యానికి మతం లేదు. రాజ్యం లేదా పరిపాలన మత సంబంధిత విషయాలలో కల్పించుకోకూడదు అదేవిధంగా మతం కూడా పరిపాలన సంబంధిత అంశాలలో జోక్యం చేసుకోకూడదు. రాజ్యం ప్రజల అభిష్టాలకు అనుగుణంగా చట్టాలకు లోబడి సౌకర్యాలను కల్పించాలి. ఇలా కాకుండా మతపరమైన

> నేడు లౌకికవాదం పై దుష్ప్రచారం బాగా జరుగుతుంది. లౌకికవాదం అంటే ఇతర మతాలకు ముఖ్యంగా మైనారిటీ మతాలకు ప్రాధాన్యతను ఇవ్వడం అని చెపుతుంటారు. ఇది తప్పు. లౌకికవాదం అంటే రాజ్యానికి మతం లేదు. రాజ్యం లేదా పరిపాలన మత సంబంధిత విషయాలలో కల్పించుకోకూడదు అదేవిధంగా మతం కూడా పరిపాలన సంబంధిత అంశాలలో జోక్యం చేసుకోకూడదు. రాజ్యం ప్రజల అభిష్టాలకు అనుగుణంగా చట్టాలకు లోబడి సౌకర్యాలను కల్పించాలి. ఇలా కాకుండా మతపరమైన రాజ్యాలు ఏర్పడితే, పరిపాలనలో ఎన్నికైన నాయకులకు కాకుండా మత పెద్దలకు మఠాధిపతులకు అధికారం సొంతం అవుతుంది.

రాజ్యాలు ఏర్పడితే, పరిపాలనలో ఎన్నికైన నాయకులకు కాకుండా మత పెద్దలకు మఠాధిపతులకు అధికారం సొంతం అవుతుంది. అలాంటప్పుడు చట్టాలకు లోబడి కాకుండా మత సాంప్రదాయాలకు లోబడి పాలన చేయవలసి వస్తుంది. మత సాంప్రదాయాల్లో ఉన్న ప్రధానమైన లోపం మనుషులందరూ సమానం అనే ధోరణి లేకపోవడం. అనగా మనుషులను వివిధ స్థాయిల్లో విభజించి ఒకరికి మరొకరు జవాబుదారిగానో లేదా సహాయకారిగానో ఉండే విధానాలు ఉన్నవి. ఇవి కుల వ్యవస్థ రూపంలో హిందూమతంలో పెద్ద సవాలుగా ఉన్నవి. ఇతర మతాలలో కూడా లింగ సమానత్వం వర్ణ సమానత్వం ఇప్పటికి కొరవడినవి. అంచేత గురజాడ చెప్పినట్టు "మతములన్నియు మాసిపోవును, జ్ఞాన మొక్కటే (మానవత్వమే) నిలిచి వెలుగును" అనేది ఎప్పటికైనా నిజం కావాలి.

వేసవి కాలం అంటే మామిడి కాయలు, పండ్ల సీజన్.. మామిడితో రకరకాల ప్రయోగాలు చేయని వారుండరు. మామిడి రుచికి ఫిదా కాని వారుండరు. వీటితో అనేక వంటకాలను తయారు చేసి ఆస్వాదించవచ్చు. పచ్చళ్ళు, పప్పు, సాంబర్, జ్యూస్ ఇలా చెప్పుకుంటూ పోతే చాలా వెరైటీలే ఉన్నాయి. ప్రాంతాన్ని బట్టి మామిడికాయలతో చేసే వంటకాలు మారుతుంటాయి.

కమ్మని మామిడి రుచులు

సౌత్ ఇండియన్ స్పెషల్ మామిడికాయ సాంబార్



కావాల్సిన పదార్థాలు : కందిపప్పు - కప్పు, మామిడికాయ - ఒకటి, చింతపండు : కొద్దిగా, సాంబార్ మసాలా పౌడర్ - రెండు టేబుల్ స్పూన్‌లు, ధనియాల పొడి - ఒక టేబుల్ స్పూన్, కారం - ఒక టేబుల్ స్పూన్, జీలకర్ర - టేబుల్ స్పూన్, ఆవాలు - టేబుల్ స్పూన్, ఎండు మిర్చి - మూడు, కరివేపాకు - రెండు రెమ్మలు, ఉల్లిగడ్డ - రెండు (సన్నగా తరిగి పెట్టుకోవాలి) దోసకాయ, సొరకాయ ముక్కలు : అర కప్పు (ఉడికించుకోవాలి) టమోటో: ఒకటి, కొత్తిమీర తరుగు - టేబుల్ స్పూన్, వెల్లుల్లి రెబ్బలు - 2-3, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - తగినంత

తయారు చేయు విధానం : మామిడికాయ తొక్క తీసి ముక్కలుగా కట్ చేసుకోవాలి. ప్రెషర్ కుక్కర్‌లో కందిపప్పు, టమోటో ముక్కలు, ఉల్లిగడ్డ ముక్కలు వేసి మెత్తగా ఉడికించుకోవాలి. కుక్కర్‌లో ఆవిరి తగ్గిన తర్వాత పప్పును మెత్తని పేస్ట్‌లా చేసి పక్కన పెట్టుకోవాలి. ఈ పప్పులోనే మిగిలిన ఉల్లిగడ్డ ముక్కలు, టమాటో, వెల్లుల్లి ముక్కలు వేసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు డీప్ బాటమ్ పాన్‌లో కొద్దిగా నూనె వేసి వేడయ్యాక అందులో పోపు గింజలు, కరివేపాకు, ఉల్లిగడ్డ, దోసకాయ, సొరకాయ, టమోటో, మామిడికాయ ముక్కలు కూడా వేసి రెండు నిముషాలు వేయించుకోవాలి. తర్వాత ఇందులో చింతపండు గుజ్జును వేసి రెండు నిముషాలు మరిగించాలి. రెండు నిముషాలు ఉడికిన తర్వాత ముందుగా ఉడికించి పెట్టుకొన్న పప్పును ఈ పోపు మిశ్రమంలో వేసి సరిపడా నీళ్ళు పోసి బాగా మిక్స్ చేసి తక్కువ మంట మీద మరో 5-10 నిముషాల పాటు ఉడికించుకోవాలి. చివరగా కొత్తిమీరతో గార్నిష్ చేసి స్టౌ ఆఫ్ చేయాలి. అంతే మామిడికాయ సాంబార్ రెడీ. వేడి వేడిగా అన్నంతో సర్వ్ చేస్తే చాలా టేస్టీగా ఉంటుంది.

తియ్యని మామిడి రవ్వ లడ్డు



కావాల్సిన పదార్థాలు : బొంబాయి రవ్వ - అర కిలో, మామిడిపండ్లు - రెండు, యాలకులు - రెండు, జీడిపప్పు, కిస్‌మిస్‌లు - గుప్పెడు, నెయ్యి - రెండు టేబుల్ స్పూన్లు, పచ్చి కొబ్బరి తురుము - రెండు కప్పులు, పంచదార - 200 గ్రాములు,

తయారు చేయు విధానం : ముందుగా బొంబాయి రవ్వను మాడకుండా సన్న మంట మీద కమ్మని వాసన వచ్చే వరకు వేయించి పెట్టుకోవాలి. జీడిపప్పు, కిస్‌మిస్‌లు నేతిలో వేయించి పక్కన పెట్టుకోవాలి. కొబ్బరి తురిమి పెట్టుకోవాలి. తర్వాత స్టౌ మీద పాన్ పెట్టి కొద్దిగా నీరు పోసి బొంబాయి రవ్వను బాగా మెత్తగా ఉడికించాలి. అందులోనే పంచదార పోసి మరి కాసేపు ఉడికించి కొద్దిగా నెయ్యి వేసి బాగా కలియబెట్టాలి, స్టౌ ఆఫ్ చేసి పచ్చికొబ్బరి తురుము కూడా వేసి జీడిపప్పు, కిస్‌మిస్‌లు నేతిలో వేయించి పక్కన పెట్టుకోవాలి. ఇందులో కలుపుకోవాలి. తర్వాత కొద్దిగా చల్లారాక మామిడిపండు రసం కూడా పోసి బాగా తిప్పాలి. యాలకుల పొడిని ఇందులో వేసి మిశ్రమం గట్టిపడ్డాక నిమ్మకాయ పరిమాణంలో ఉండల్లా చేసుకొని ప్లేటులో అమర్చుకోవాలి. అంతే కమ్మని రవ్వతో కలిసిన మామిడి రవ్వలడ్డూలు రెడీ.. ఆ రోజు తినడానికి ఇవి చాలా రుచిగా ఉంటాయి.


మామిడి తురుము పచ్చడి



కావాల్సిన పదార్థాలు : మామిడికాయలు - రెండు, కారం - రెండు టేబుల్ స్పూన్‌లు, ఆవపిండి - ఒక టేబుల్ స్పూన్, మెంతిపిండి - అర టేబుల్ స్పూన్‌లు, ఉప్పు - రుచికి తగినంత, నూనె - తగినంత, తాలింపుకు - శనగ పప్పు, మినప్పప్పు - రెండు టేబుల్ స్పూన్‌లు, ఆవాలు - ఒక టేబుల్ స్పూన్, ఎండుమిర్చి - నాలుగు, కరివేపాకు - రెండు రెమ్మలు, వెల్లుల్లి - ఆరు రెమ్మలు

తయారు చేయు విధానం : మామిడికాయలు చెక్కు తీసి తురుముకోవాలి. ఈ తురుములో కారం, ఉప్పు, ఆవపిండి, మెంతిపిండి అన్నీ వేసి బాగా కలపాలి. నూనె వేడి చేసి తాలింపు వేసి ఇందులో కలిపితే తురుము పచ్చడి రెడీ. ఈ ప్రాసెస్‌లో నీళ్ళు తగలకుండా చేసుకోవాలి.


సమ్మర్ స్పెషల్ మ్యాంగో ఫిర్నీ



కావాల్సిన పదార్థాలు : బియ్యం - రెండు కప్పులు, పాలు : ఒక కప్పు, మామిడి పండు గుజ్జు - ఒక కప్పు, బాదం - ఒక కప్పు, పిస్తా పప్పు - ఒక కప్పు, యాలకులు పొడి: చిటికెడు, పంచదార - ఒక కప్పు

తయారు చేయు విధానం : బియ్యాన్ని కడిగి నానబెట్టుకోవాలి. కొద్దిసేపు నాననిచ్చిర నీళ్ళు లేకుండా వడకట్టి, కాసేపు ఆరబెట్టాలి. తడి పూర్తిగా ఆరిన తర్వాత మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి. తర్వాత స్టౌమీద మందపాటి పాన్ పెట్టి అందులో పాలు పోసి బాగా కాగనివ్వాలి. పాలు మరిగేటప్పుడు పంచదార కూడా వేసి బాగా కలపాలి. వేరొక స్టవ్ మీద గిన్నె పెట్టి కొద్దిగా నీళ్ళు పోసి అందులో బియ్యం పిండిని పోసి కలుపుతూ ఉడకనివ్వాలి. బియ్యంపిండి ఉడకుతూ చిక్కబడే సమయంలో మామిడి పండు గుజ్జును, మరిగించిన పాలను అందులో వేసి బాగా మిక్స్ చేయాలి. ఈ మిశ్రమం ఇంకాస్త చిక్కబడ్డాక అందులో యాలకల పొడి వేయాలి. చల్లారక ఈ మిశ్రమాన్ని మరో పాత్రలోకి తీసుకుని బాదం పప్పు, పిస్తా పప్పుతో అలంకరించి సర్వ్ చేయాలి. అంతే సమ్మర్ స్పెషల్ మ్యాంగో ఫిర్నీ రెడీ.

ఆంధ్ర స్పెషల్ మామిడికాయ పప్పు



కావాల్సిన పదార్థాలు :

పప్పు తయారు చేసేందుకు... పచ్చిమిర్చి - రెండు (పొడవుగా కోసుకోవాలి), కంది పప్పు - కప్పు, పసుపు పొడి - అర టీ స్పూన్, ఉప్పు - రుచికి సరిపడా

మామిడికాయలు వండడానికి... మామిడికాయ - ఒకటి (తొక్క తీసి ముక్కలుగా చేసుకోవాలి), పసుపు పొడి - పావు టీస్పూన్, మిరియాల పొడి - ఒక టేబుల్ స్పూన్, నీరు - అర కప్పు, ఉప్పు - రుచికి సరిపడా,

పోపు కోసం... నెయ్యి - ఒక టేబుల్ స్పూన్, ఆవాలు - అర టీ స్పూన్, వెల్లుల్లి - రెండు రెబ్బలు, ఎండుమిర్చి - రెండు, కరివేపాకు - కొద్దిగా, కొత్తిమీర - కొద్దిగా

తయారు చేయు విధానం : ముందుగా కుక్కర్‌లో కడిగిన పప్పు, రెండు కప్పుల నీళ్లు, ఉప్పు, పసుపు, పచ్చిమిర్చి వేసి స్టౌ మీద పెట్టి కుక్కర్ మూతపెట్టి నాలుగు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. కుక్కర్‌లో ప్రెజర్ దానంతట అది పోయే వరకు అలా ఉంచాలి. తర్వాత పప్పును మెత్తగా చిదిమేసి పక్కన పెట్టుకోవాలి.

మామిడికాయ ఉడకబెట్టేందుకు కుక్కర్‌లో మామిడి కాయ ముక్కలు, కాస్త ఉప్పు, పసుపు, కారం, అర కప్పు నీళ్లు పోసి స్టౌ మీద పెట్టి పది నిముషాలు ఉడికించుకోవాలి. కుక్కర్‌లో అయితే ఒక విజిల్ వచ్చిన తర్వాత దించాలి.

తాలింపు కోసం స్టౌ మీద ఫ్రైయింగ్ పాన్ పెట్టి అందులో నెయ్యి పోసి వేడయ్యాక ఆవాలు, జీలకర్ర వేసి తాలింపు వేయాలి. తర్వాత ఎండు మిర్చి, వెల్లుల్లి వేసి కొద్దిగా రంగు మారే వరకు వేయించి, కరివేపాకు వేసి వేయించి, ఉడకబెట్టిన మామిడికాయ, మెత్తగా రుద్ది పెట్టుకున్న పప్పు వేసి, అవసరమైనంత నీరు పోసి, రుచికి సరిపడా ఉప్పు వేసి, 3-4 నిమిషాలు బాగా మరిగించి, కొత్తిమీర చల్లితే, రుచికరమైన ఆంధ్రా పచ్చి మామిడి పప్పు రెడీ.

ప్రసవానంతరం...

ఎండల తీవ్రత బాగా పెరిగింది. ఇంట్లో ఉండే వారు సైతం వేడి తీవ్రతను భరించలేకపోతున్నారు. ఈ తీవ్రత కొత్తగా ప్రసవం అయిన వారి మీద ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో వారు ఎక్కువగా అలిసిపోతారు. కాస్త అసౌకర్యంగానూ ఉంటారు. అందువల్ల ఎక్కువ జాగ్రత్తలు పాటించాలి. లేకుంటే వారితో పాటు పుట్టిన బిడ్డలు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కొన్ని చిట్కాలు పాటించడం ద్వారా ఆరోగ్యంగా, ఎనర్జిటిక్‌గా ఉండొచ్చు. ఆ చిట్కాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం.



- బాలింతలు ఎల్లప్పుడూ శిశువు కోసమే కాకుండా తమ కోసం కూడా కొంత సమయాన్ని వెచ్చించాలి. తగినంత విశ్రాంతి తీసుకోవడం చాలా అవసరం. వాకింగ్ చేయడం, తేలికపాటి వార్మప్స్ వల్ల శరీరాన్ని యాక్టివ్‌గా ఉంచుకోవచ్చు.
- మానసిక, శారీరకంగా ఆరోగ్యంగా ఉండటానికి స్వచ్ఛమైన గాలిని ఆస్వాదించాలి. ఎప్పుడూ ఇంటిపట్టునే ఉండకుండా సమయం దొరికనప్పుడు బయటకు వెళ్లి ప్రకృతిలో కాసేపు గడపడానికి ప్రయత్నించాలి. బాల్కనీలో, పెరట్లో, దగ్గరే ఉన్న గార్డెన్‌లో నడవాలి. తెల్లవారుజామున లేదంటే సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత బయటకు వెళ్లాలి.
- వేసవికాలంలో పుష్కలంగా నీరు తాగాలి. కాలంతో సంబంధం లేకుండా హైడ్రేటెడ్‌గా ఉండటం చాలా అవసరం. దాహం వేయకపోయినా కొద్ది కొద్దిగా నీరు తాగుతుండాలి. కెఫిన్, కూల్స్ డ్రింక్స్ అస్సలే తాగొద్దు. వీటి వల్ల మరింత వేగంగా డీహైడ్రేషన్‌కు గురవుతారు. అలాగే ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారపదార్థాలు తినడం మానేయాలి.
- ఆరోగ్యంగా ఉండటానికి సమతుల్య ఆహారం చాలా కీలకం. సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. తాజా పండ్లు, కూరగాయలు పుష్కలంగా ఉండేలా డైట్ ప్రిపేర్ చేసుకోవాలి. ప్రాసెస్డ్ ఫుడ్స్, షుగర్ ఫుడ్స్, కార్బొనేటెడ్ వాటర్ లాంటివి తీసుకోవద్దు.
- ఇతర తల్లులతో మాట్లాడటం వల్ల వారి నుంచి చాలా టిప్స్ తెలుసుకోవచ్చు. ఒకరి అనుభవాలను ఒకరితో పంచుకోవచ్చు. శిశువు ఆరోగ్యంతో పాటు తల్లి ఆరోగ్యంపై ఉండే అనుమానాలు చాలా వరకు నివృత్తి అవుతాయి. దాని వల్ల లేనిపోని విషయాలపై ఆందోళన పడాల్సిన అవసరం ఉండదు.

మీకు అండగా ఉంటాం..

పార్లమెంట్ ముట్టడికి సంఘీభావం

- మల్లయోధులకు మహిళా మహాపంచాయతీ మద్దతు

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

నూతన పార్లమెంట్ ప్రారంభోత్సవం రోజున (ఈనెల 28న) రెజ్లర్లు తలపెట్టిన మహిళ మహా పంచాయతీకి మద్దతు కూడగడుతున్నారు. అందుకు వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. అక్కడి ప్రజలతో మాట్లాడి తమ పోరాటంలో భాగస్వామ్యం కావాలని కోరుతున్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అగ్రశ్రేణి రెజ్లర్లు చేస్తున్న ఆందోళన బుధవారం కూడా కొనసాగింది. ఈ ఆందోళన 31 రోజులు పూర్తి చేసుకుంది. మరోవైపు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో, ప్రపంచంలో వివిధ దేశాల్లో రెజ్లర్లకు మద్దతు ఆందోళనలు జరుగుతున్నాయి. మే 28న ఉదయం 11 గంటల నుంచి కొత్త పార్లమెంట్ వద్ద కిసాన్ మహాపంచాయత్ నిర్వహించనున్నామని రెజ్లర్లు తెలిపారు.

మహాపంచాయత్ కోసం, ప్రజల మద్దతును క్రీడాకారులు సమీకరిస్తున్నారు. ఈ మహాపంచా యత్‌లో దేశప్రజలు, ముఖ్యంగా మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని న్యాయం చేయాలని క్రీడాకారులు పిలుపునిచ్చారు. ఒలింపిక్ విజేత సాక్షి మాలిక్ బుధవారం హిసార్, ఫతేహాబాద్ చేరుకున్నారు. మే 28న కొత్త పార్లమెంటు ముందు జరగనున్న మహిళా మహాపంచాయత్ నిర్వహణకు సాక్షి మాలిక్ మద్దతు కూడగడుతున్నారు. గురువారం ఖత్కర్ టోల్ జింద్‌లో జరిగిన మహాపంచాయత్‌లో రెజ్లర్ వినేష్ ఫోగట్, బజరంగ్ పునియాలు పాల్గొనున్నారు.

నిష్పక్షపాతంగా విచారణ చేయడం లేదు : సాక్షి మాలిక్

సాక్షి మాలిక్ మాట్లాడుతూ.. ఇప్పటికే 40 సీరియస్ కేసులు నమోదై, హత్య చేసినట్టు బహిరంగంగా ఒప్పుకున్న నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగి స్తోందన్నారు. ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం మొత్తం చట్టాన్ని తుంగలో తొక్కుతోందని విమర్శించారు. బ్రిజ్ భూషణ్ సింగ్ సాధారణ వ్యక్తి అయితే, ఆయన ఈపాటికి కటకటాల వెనక్కి వెళ్లేవాడని అన్నారు. కానీ అధికార పార్టీకి చెందిన ఎంపీ కావడం వల్లే ఆయనకు ఫ్రీ హ్యాండ్ ఇస్తున్నారని విమర్శించారు. నిందితుడు బహిరంగంగా మీడియాలో ఇంటర్వ్యూలు ఇస్తూ దేశ పుత్రికల పరువు తీస్తున్నాడని, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. ఢిల్లీ పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేయడం లేదని, అరెస్టు చేయడం లేదని విమర్శించారు. ఈ పోరాటం ఏ ఒక్క కూతురిది కాదని, దేశంలోని ప్రతి కూతురి పోరాటంగా మారిందని అన్నారు. గురువారం రెజ్లర్ల ఆందోళనకు జాట్ మహాసభ రాజస్థాన్, సర్వ కర్మచారి సంఘ్ ఆల్ ఇండియా ఫెడరేషన్, నగర్ పాలికా సంఘ్ హర్యానా, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ యూనియన్ (సీఐటీయూ), రాష్ట్రీయ లోక్ దల్ చురు రాజస్థాన్, పీఎస్ఎస్ఈ సైంటిఫిక్ ప్రెసిడెంట్ పంజాబ్, ఎఐజిఈఎఫ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఢిల్లీ, మోహిత్ శర్మ పశ్చిమ బెంగాల్, ఫార్మర్స్ ఆర్గనైజేషన్ కమిటీ, ఆల్ ఇండియా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య గుర్మీత్ సింగ్ ఖల్సా బ్లైండ్ పర్సన్ అసోసియేషన్, నాల్గవ రాష్ట్ర ఉద్యోగుల సమాఖ్య ఉత్తరప్రదేశ్, రైతు సంఘం, షహీద్ ఉధమ్ సింగ్ లైబ్రరీ కపుర్తలా పంజాబ్, గోపాల్ దత్ జోషి ప్రధాన్ చండీగఢ్ ఏఐఎస్జీఈఎఫ్, పిఎస్ఎస్ఎఫ్ ఆల్ ఇండియా, ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఎయిమ్స్, ఏఐయూటీయూసీ, ఏఐడీ, ఎస్ యూసీఐ మిలిటరీ వెల్ఫేర్ అసోసియేషన్, విద్యార్థి యువజన్ సభ మౌ, ఉత్తరప్రదేశ్, ఆశా వర్కర్స్ అసోసియేషన్ ఢిల్లీ, యూత్ స్టూడెంట్ లీడర్, సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్ట్) పలు సంఘాలు, పార్టీలు మద్దతు తెలిపారు.

గుడిసెల కూల్చివేత.. ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

మూడు నెలల కిందట సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకున్నారు. అప్పటి నుంచి అధికార యంత్రాంగం ఐదుసార్లు వాటిని తొలగించినప్పటికీ మళ్లీ పేదలు గుడిసెలు వేసుకున్నారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామునే ఆర్డీఓ కొమురయ్య, డీఎస్పీ రమణబాబు, సీఐ రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి ఆధ్వర్యంలో భారీగా పోలీసు బలగాన్ని తీసుకొని గుడిసెల ప్రాంతానికి వచ్చారు. విషయం తెలుసుకున్న పేదలు కూడా పెద్దఎత్తున తరలివచ్చి అధికారులను అడ్డుకున్నారు. ప్రొక్లైనర్‌ను, డోజర్ కదలకుండా మహిళలు అడ్డంగా కూర్చు న్నారు. అయినా పోలీసుల సహకారంతో అధికారులు గుడిసెలను కూల్చివేస్తుండగా అడ్డుపోయిన అయ్యగారిపెల్లి గ్రామానికి చెందిన జున్ను నరసమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. కంచర్లగూడెం శ్రీను సొమ్మసిల్లి పడిపోయాడు.

సీపీఐ(ఎం) మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుర్దపు సోమయ్య, పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం, ఎమగాని వెంకన్న, తోట శ్రీను, బూరుగుల లక్ష్మణ్, బానోతు శ్రీరామ్, గుడిసె వాసులు అధికార యంత్రాంగంతో వాగ్వాదానికి దిగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వందలాదిగా వచ్చిన పోలీసులు గుడిసెవాసులను లాక్కెళ్లి డీసీఎంలో ఎక్కించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాయకులు ఆకుల రాజు, అలువాల వీరయ్య, సమ్మెట రాజమౌళి, దెడ్డెల రాంమూర్తితో పాటు పేదలను అరెస్టు చేశారు. అనంతరం నాయకులు సోమయ్య ఆధ్వర్యంలో డీఎస్పీ, ఆర్డీవోలతో చర్చలు నిర్వహించారు. గుడిసెలను తొలగించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఆర్డీవో కొమురయ్య మాట్లాడుతూ.. పూర్తి ఆధారాలతో దరఖాస్తు చేసుకుంటే.. ఇండ్ల స్థలాలు ఇస్తామని చెప్పారు. కానీ, ప్రభుత్వ భూములను ఆక్రమించడం సరికాదన్నారు. మూడు నెలలుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్నామని, ఎమ్మార్వో కార్యాలయంలో ఎన్నోసార్లు దరఖాస్తు ఇచ్చినా కనీసం పరిశీలించ లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో పోలీసు, అధికార యంత్రాంగం వెనుదిరిగారు.



బాయ్‌కాట్...

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని మోడీ ప్రారంభించడాన్ని ప్రతిపక్షాలు తప్పుపడుతున్నాయి. రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతికి, పార్లమెంటుకు విడదీయరాని సంబంధం ఉంది. పార్లమెంటులో రాష్ట్రపతి ఒక భాగం. అందుకే నూతన భవనాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించాలని ప్రతిపక్షాలు పట్టుబడుతున్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఆ పార్టీ నేతలు మనీష్ తివారీ, శశి థరూర్‌లు ఇదే డిమాండ్ వినిపించారు. అయితే కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగానికి తప్పుడు భాష్యం చెబుతోందని కేంద్ర మంత్రి హర్‌దీప్ పూరి విమర్శించారు. అయితే దీనిపై తివారీ ఘాటుగానే స్పందించారు. పూరి వేరే రాజ్యాంగాన్ని చదువుతున్నారంటూ ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఆయన రాజ్యాంగంలోని 79వ అధికరణను ప్రస్తావించారు. దేశానికి పార్లమెంట్ ఉండాలని, అందులో రాష్ట్రపతి, ఉభయసభలు భాగస్వాములని ఆ అధికరణ చెబుతోందని గుర్తు చేశారు. రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతికి కార్యనిర్వాహక, శాసనపరమైన, న్యాయప రమైన, అత్యవసర, సైనిక అధికారాలు ఉంటాయి. శాసనప రమైన అధికారాలలో ఉభయ సభలు.... (ఎగువసభ రాజ్యసభ, దిగువసభ లోక్‌సభ) కూడా ఉంటాయి. రాజ్యాంగంలోని 74(1) అధికరణ ఏం చెబుతోందంటే... 'ప్రధాని నాయకత్వంలో మంత్రిమండలి పనిచేస్తూ రాష్ట్రపతికి సహాయకారిగా ఉంటూ సలహాలు ఇవ్వాలి. ఆ సలహాల మేరకు రాష్ట్రపతి నడుచుకోవాలి. అయితే ఆ సలహాలను మరోసారి పరిశీలించాలని మంత్రి మండలిని రాష్ట్రపతి కోరవచ్చు. మంత్రిమండలి దానిని పాటించవచ్చు. పాటించకపోవచ్చు. పున:పరిశీలన తర్వాత మంత్రి మండలి ఇచ్చే సలహా ప్రకారం రాష్ట్రపతి నడుచుకోవాల్సి ఉంటుంది'. ఇక 87వ అధికరణ ప్రకారం పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు ప్రతిసారీ రాష్ట్రపతి ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించాల్సి ఉంటుంది. పార్లమెంట్ ఆమోదం పొందిన బిల్లులకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేయకపోతే అవి చట్టరూపం దాల్చవు. ఈ విధంగా భారత రాజ్యాంగం పార్లమెంట్ పనితీరులో రాష్ట్రపతికి ప్రముఖ పాత్ర ఇచ్చింది.



నియంతృత్వ ఆర్డినెన్స్‌ని వెనక్కి తీసుకోవాలి

- మోడీ నిరంకుశ పాలనను అంతం చేయాలి
- ఢిల్లీలో వామపక్షాల ఆందోళన

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజలు చేత ఎన్నికైన ఢిల్లీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నియంతృత్వ ఆర్డినెన్స్‌ని వెనక్కి తీసుకోవాలని సీపీఐ(ఎం) ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి కెఎం తివారీ డిమాండ్ చేశారు. ఢిల్లీలోని నేషనల్ క్యాపిటల్ టెరిటరీ (ఎన్సీటీ) ప్రభుత్వం దేశ రాజధానిలో పరిపాలనా సేవలు, శాసన, కార్యనిర్వాహక అధికారాలను కలిగి ఉందని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా ఇచ్చిన తీర్పును రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ బుధవారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ(ఎంఎల్), ఆర్ఎస్పీ, ఫార్వర్డ్ బ్లాక్, సీజీపీఐ ఢిల్లీ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. మహిళలు సహా వందలాది మంది ప్రజలు ఆందోళనలో పాల్గొన్నారు. హోం మంత్రిత్వ శాఖ వైపు కవాతు చేయకుండా నిరోధించడానికి ఢిల్లీ పోలీసులు అన్ని వైపుల నుంచి బారికేడ్లు వేశారు. నిరసనకారులను ఉద్దేశించి కెఎం తివారీ మాట్లాడుతూ పదే పదే ఎన్నికల పరాజయాలు ఎదురైనప్పటికీ లెఫ్టినెంట్ గవర్నర్ తో ఢిల్లీని పాలించే మోడీ ప్రభుత్వం తాజా చర్యను ఖండించారు. ఈ నిరంకుశ, నియంతృత్వ పాలనను అంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దేశ సహకార సమాఖ్య నిర్మాణం'పై ఆర్ఎస్ఎస్, బీజేపీ చర్యలు, విరుద్ధమైన ప్రవర్తనను కూడా బహిర్గతం చేశారు. వామపక్షాలన్నీ ఈ ఆర్డినెన్స్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయని అన్నారు. ఈ ఆర్డినెన్స్ ఢిల్లీ ప్రజల హక్కులపై దాడి చేయడమేనని సీపీఐ ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ దినేష్ వర్షణ్యే అన్నారు. ఢిల్లీలో పరోక్ష పూర్తి పాలనను లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతించమని, ఢిల్లీలో ఎన్నికైన ముఖ్యమంత్రిని చీఫ్ సెక్రెటరీ, బ్యూరోక్రాట్ ఎలా అధిగమిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ ఆర్డినెన్స్ రాజ్యాంగ సమాఖ్య లక్షణానికి విరుద్ధమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శులు రవి రాయ్ (సీపీఐ ఎంఎల్), ఆర్ఎస్ డాగర్ (ఆర్ఎస్పీ), ధర్మేంద్ర కుమార్ వర్మ (ఏఐఎఫ్‌బీ), బిర్జు నాయక్ (సీజీపీఐ), సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు ఆశాశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్బీ సంస్థకు టెండర్ ఎలా ఇస్తారు..?

(మొదటిపేజీ తరువాయి)

30 రోజుల్లోగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే చెల్లించాల్సిన 10 శాతం చెల్లించకుండా ఇంకా సమయం కోరుతున్నది.. ఒప్పందాన్ని ఉల్లంఘించిన సంస్థపై చర్యలు తీసుకోకుండా దానికి అనుకూలంగా ఉండేలా అధికారులపై కేటీఆర్ ఒత్తిడి తీసుకువస్తున్నారు " అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కేసీఆర్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. నిబంధనల మేరకు 10 శాతం నిధులు కూడా చెల్లించలేని ఐఆర్బీ సంస్థకు టెండర్ ఎలా ఇస్తారు..? అని ప్రశ్నించారు. తక్షణమే ఈ టెండర్లను రద్దు చేయాలి అని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం రేవంత్ రెడ్డి సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజల సంపద అయిన ఓఆర్ఆర్‌ను ముంబయికి చెందిన ఐఆర్బీ డెవలప్‌మెంట్ సంస్థకు కేసీఆర్, పురపాలిక శాఖ మంత్రి కేటీఆర్, మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, అప్పటి సీఎస్ సోమేశ్ కుమార్ పర్యవేక్షణలో తెగనమ్మారని ఆరోపించారు. టెండర్ ప్రక్రియ మొదలు పెట్టినప్పటి నుంచి టెండర్‌కు సంబంధించిన లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ ఇచ్చేంత వరకు జరిగిన దోపిడీని, దీని వెనుకాల ఉన్న పెద్దల ఆలోచనను పదే పదే కాంగ్రెస్ పార్టీ ప్రజలకు వివరిస్తూ వచ్చిందని గుర్తుచేశారు.

"ఏప్రిల్ 27న హెచ్ఎండీఏ ఐఆర్బీ సంస్థకు లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ ఇవ్వడం జరిగింది. దీని ప్రకారం మే 26లోపు ఐఆర్బీ సంస్థ 738 కోట్లను చెల్లించాలి. లక్ష కోట్ల రూపాయల విలువైన ఓఆర్ఆర్ ప్రాజెక్టును రూ.7 వేల కోట్లకే దక్కించుకున్నా.. కేటీఆర్, ఐఆర్బీ, సోమేశ్ కుమార్, అర్వింద్ కుమార్ ధనదాహం తీరలేదు. ఒప్పందాన్ని ఉల్లంఘించి చెల్లించాల్సిన 10 శాతం చెల్లించకుండా ఇంకా సమయం కావాలని ఐఆర్బీ సంస్థ అడుగుతున్నది. మా దగ్గర నిధులు లేవు. ఇంకో 120 రోజుల సమయం కావాలని ఐఆర్బీ సంస్థ హెచ్ఎండీఏకు ఉత్తరం రాసింది. అయినా ఒప్పందాన్ని ఉల్లంఘించిన సంస్థకు అనుకూలంగా ఉండేలా అధికారులపై కేటీఆర్ ఒత్తిడి తెస్తున్నారు.... " అని రేవంత్ రెడ్డి ఆరోపించారు.

"సంస్థ ఫైనాన్షియల్ స్టేటస్, ఆస్తుల విలువను చూసిన తర్వాతే ఐఆర్బీ సంస్థకు టెండర్ కట్టబెట్టామని కేటీఆర్, కేసీఆర్ గొప్పగా చెప్పుకున్నారు. ఇప్పుడు హడావుడిగా వాయిదాల పద్ధతిలో చెల్లించేలా ఐఆర్బీ సంస్థకు వెసులుబాటు ఇచ్చేలా అధికారులపై కేటీఆర్ ఒత్తిడి తెస్తున్నారు అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇటీవలి కాలంలో వివిధ నిర్ణయాలు విమర్శలపాలు కావటంతో అర్వింద్ కుమార్ సంతకాలు పెట్టడానికి సంశయిస్తుంటే..ఐఏఎస్ అధికారి సంతోష్ స్థానంలో హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్‌గా పని చేసి రిటైర్ అయిన బీఎల్ఎన్ రెడ్డిని హెచ్‌జీసీఎల్ (హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్) ఎండీగా హడావుడిగా తీసుకొచ్చి అవసరమైన సంతకాలు చేయించారు. గతంలో ఇదే అధికారి తెల్లాపూర్లో రూ.10 వేల కోట్ల విలువ చేసే 400 ఎకరాల భూమిని ఒక ప్రయివేటు సంస్థకు నింబంధనలకు విరుద్ధంగా కేటాయింటారు. అప్పటి నుంచి కేటీఆర్, బీఎల్ఎన్ రెడ్డి మధ్య బంధం బలపడింది. ఐఏఎస్ అధికారి సంతోష్‌ను బదిలీ చేసినప్పుడు..టీఎస్పీఎస్సీలో పరీక్షల నిర్వహణకు మంచి అధికారి ఉండాలి...అని బదిలీ చేశామని చెప్పారు. మరీ మంచి అధికారి హెజీసీఎల్‌కు అవసరం లేదా అని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఐఏఎస్ అధికారి నిర్వహించాల్సిన బాధ్యతలను ఎప్పుడో పదేండ్ల క్రితం పదవీ విరమణ తీసుకున్న బీఎల్ఎన్ రెడ్డికి ఎందుకు అప్పజెప్పారు.... " అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

బండి సంజయ్ మౌనమెందుకు?...

భారీ స్థాయిలో దారిదోపిడీ జరుగుతున్నా బండి సంజయ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఎందుకు ఫిర్యాదు చేయరు? బండి సంజయ్ ఓఆర్ఆర్ అవినీతిపై ఎందుకు మాట్లాడటం లేదు? బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఉన్న అవగాహన ఏమిటి? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఓఆర్ఆర్ టెండర్ ముసుగులో జరుగుతున్న దోపిడీని ప్రజాక్షేత్రంలో, చట్టపరమై చర్యల ద్వారా కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటుందని రేవంత్ రెడ్డి తెలిపారు.

నవతెలంగాణ

సీఎం కేసీఆర్ అధ్యక్షతన నేడు కలెక్టర్ల సదస్సు

- రాష్ట్ర అవతరణ వేడుకలు, హరితహారం, పోడు పట్టాల పంపిణీపై సమీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన గురువారం కలెక్టర్ల సదస్సు జరగనున్నది. ఉదయం 11 గంటలకు డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో జరిగే సదస్సుకు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు హాజరు కానున్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ, దశాబ్ది ఉత్సవాలు, హరితహారం అమలు, పోడు పట్టాల పంపిణీ, ఇండ్ల పట్టాల పంపిణీ, ఇతర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సీఎం సమీక్షించనున్నారు. కలెక్టర్ల సదస్సుకు మంత్రులు, అన్ని శాఖల కార్యదర్శులతో పాటు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ వినోద్‌కుమార్ హాజరు కానున్నారు.

ఇంజినీరింగ్ ప్రిన్సిపాళ్ల విద్యార్హతలపై విచారణ చేపట్టాలి : డీవైఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంజినీరింగ్ కాలేజీల్లో పనిచేస్తున్న ప్రిన్సిపాళ్ల విద్యార్హతలపై విచారణ చేపట్టాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని జేఎన్టీయూహెచ్ పరిధిలోని ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా సరైన విద్యార్హత లేని వ్యక్తులను యాజమాన్యాలు ప్రిన్సిపాళ్లు గా నియమిస్తున్నాయని తెలిపారు. ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీలపై సమగ్ర విచారణ జరిపించి సంబంధిత కళాశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏటా ఇంజినీరింగ్ కళాశాలల్లో ర్యాటిఫికేషన్ పేరుతో అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ, యాజమాన్యాల పైరవీలకు తలొగ్గి అనుమతులిస్తున్నారని తెలిపారు. ఫలితంగా నాణ్యతా ప్రమాణాలు గాలికి వదిలేస్తున్నారని పేర్కొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం, యాజమాన్యాల బాధ్యతా రాహిత్యం మూలంగా విద్యార్థులకు నాణ్యమైన చదువులు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వందలాది ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో తనిఖీల సందర్భంగా ర్యాటిఫికేషన్ కోసం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తే వాటిల్లో కేవలం పది మంది లోపు మాత్రమే అర్హతలు ఉన్నట్టు గుర్తిస్తున్నారని తెలిపారు. ఏఐసీటీఈ నిబంధన ప్రకారం 15 ఏండ్ల బోధనానుభవంతో పాటు పీహెచ్‌డీ కలిగి ఉంటేనే ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పని చేసేందుకు అర్హులని పేర్కొన్నారు. రాష్ట్రంలో పేరుమోపిన ఇంజినీరింగ్ కళాశాలలన్నీ ఏఐసీటీఈ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ రూ.లక్షల ఫీజులు వసూలు చేస్తూ నాణ్యతా ప్రమాణాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.

నేడు ఎంసెట్ ఫలితాలు

- 9.30 గంటలకు విడుదల చేయనున్న మంత్రి సబిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంసెట్ రాతపరీక్షల ఫలితాలు గురువారం ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూలో విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేయనున్నారు. ఈ మేరకు ఎంసెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయకుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్ వి వెంకటరమణ, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ కట్టా నర్సింహారెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈనెల 10,11 తేదీల్లో ఎంసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం, 12 నుంచి 14వ తేదీ వరకు ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహించిన విషయం తెలిసిందే. ఎంసెట్‌కు 3,20,683 మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తే, వారిలో 3,01,789 (94.11 శాతం) మంది అభ్యర్థులు పరీక్షలకు హాజర య్యారు. 18,894 మంది గైర్హాజరయ్యారు.

సివిల్స్ 3వ ర్యాంకర్ ఉమకు శుభాకాంక్షలు

- ఎంపీ వద్దిరాజు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో మూడో ర్యాంకు సాధించిన ఉమాభారతికి మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మున్నూరుకాపు బిడ్డ కావడం ఎంతో సంతోషదాయకమని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె ప్రజలకు అత్యుత్తమ సేవలందిస్తూ ప్రభుత్వానికి, తన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పుట్టినగడ్డకు గొప్ప పేరు ప్రఖ్యాతులు తీసుకు రావాలని ఆయన ఆకాంక్షించారు.ఉమను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నతంగా ఎదగాలని విద్యార్థులు, యువతకు సూచించారు. ఉమ ఇంత గొప్ప విజయాన్ని అందుకునేందుకు స్ఫూర్తినిచ్చిన, ప్రోత్సహించిన ఆమె తండ్రి, నారాయణపేట ఎస్పీ నూకల వెంకటేశ్వర్లు, తల్లి శ్రీదేవి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు ఆయన అభినందనలు తెలిపారు.

భూమిపై హక్కుల్ని సివిల్ కోర్టులే తేల్చాలి

- హైకోర్టు తీర్పు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారాం గ్రామంలోని సర్వే నెం.307లోని కోట్ల రూపాయల విలువైన 18 ఎకరాల భూమి హక్కుల వివాదం సివిల్ కోర్టు తేల్చాలని హైకోర్టు తీర్పు చెప్పింది. విచారణాధికారం పేరుతో సివిల్ కోర్టు చేయాల్సిన పనిని హైకోర్టు చేయలేదని చెప్పింది. ఆ భూమి ప్రయివేటు వ్యక్తులదేనని 2013లో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీలతో కూడిన డివిజన్ బెంచ్ రద్దు చేస్తూ ఇటీవల తీర్పు చెప్పింది. విచక్షణాధికారం పేరుతో హక్కులను కాపాడాలని, హక్కులను సృష్టించకూడదదని చెప్పింది. 18 ఎకరాలపై హక్కులు ఎవరివో సివిల్ కోర్టు తేల్చాలని చెప్పింది. ప్రభుత్వ-ప్రయివేటు వ్యక్తుల భూహద్దులు గుర్తించకుండా సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును చెల్లదని తేల్చింది. ఆ గ్రామంలోని సర్వే నెం 307లోని 18 ఎకరాలు ప్రయివేటు వ్యక్తులవే నంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును రద్దు చేసింది.

గాజుల రామారానికి చెందిన నర్సింహారెడ్డి, సీతారామరెడ్డి ఇతరులకు ఎందిన 441 ఎకరాల్లో 318లను ప్రభుత్వం ల్యాండ్ సీలింగ్ యాక్ట్ కింద స్వాధీనం చేసుకుంది. ఆ భూమిని 2007లో ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు లీజుకిచ్చింది. ఆ భూమిలో 18 ఎకరాలను తాము కొన్నామని 2011లో పద్మనాభరావు వేసిన కేసులో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును ప్రభుత్వం అప్పీల్ చేసిన పిటిషన్‌లో సానుకూల తీర్పు చెప్పింది.

డీయూ ప్రతిపాదన వివాదాస్పదం

(మొదటిపేజీ తరువాయి)

తత్వశాస్త్రంపై యూజీ కోర్సును తొలగించకూడదనీ, దానిని భావి తరాలకు అందేలా చూడాల్సిన బాధ్యత విద్యా సంస్థలపై ఉన్నదని తెలిపారు. అయితే, ఈ విషయంలో తుది నిర్ణయాన్ని మాత్రం ఇంకా తీసుకోలేదని స్టాండింగ్ కమిటీ సభ్యుడొకరు వెల్లడించారు. అకడమిక్ కౌన్సిల్‌కే ఆ నిర్ణయాన్ని తీసుకునే అధికారం ఉంటుందని చెప్పారు.

జార్ఖండ్‌లో రాష్ట్రపతి

(మొదటిపేజీ తరువాయి)

మహిళా సదస్సులో పాల్గొంటారు. నుమ్‌కుమ్‌లో జరిగే రాంచీ ఐఐఐటీ రెండవ స్నాతకోత్సవ కార్యక్రమానికి కూడా హాజరవుతారు. ముర్ము గౌరవార్థం రాజ్‌భవన్‌లో జార్ఖండ్ ప్రభుత్వం ఏర్పాటు చేసే పౌర సన్మాన కార్యక్రమంలోనూ పాల్గొంటారు.

మినిమం వేజ్‌బోర్డ్ చైర్మెన్‌గా పీ నారాయణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహాసంఘం (మినిమం వేజెస్ అడ్వయిజరీ బోర్డ్) చైర్మెన్‌గా పీ నారాయణ నియమితులయ్యారు. ఆయన్ని చైర్మెన్‌గా నియమిస్తూ ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వైభవంగా దశాబ్ది ఉత్సవాలు

ఏర్పాట్లపై సీఎస్ శాంతికుమారి సమీక్ష



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమాల్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారుల్ని ఆదేశించారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను జాగ్రత్తగా పూర్తిచేయాలని, నిర్వహణలో ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని చెప్పారు. బుధవారంనాడామె డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలంయంలో దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. డీజీపీ అంజనీ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అర్వింద్‌కుమార్, సునీల్‌శర్మ, జీఏడీ కార్యదర్శి శేషాద్రి, హైదరాబాద్ నగర పోలీస్ కమీషనర్ సీవీ ఆనంద్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర సచివాలయ ఆవరణలో మొదటిసారిగా ఈ ఉత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు.

దీనికి ప్రజాప్రతినిధులు, సచివాలయ, జీహెచ్ఎంసీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నందున సచివాలయంలోకి వారి ప్రవేశం, వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లను జాగ్రత్తగా పర్యవేక్షించాలని చెప్పారు. సెర్మోనియల్ పరేడ్ నిర్వహణ, జాతీయ పతాకావిష్కరణ ఏర్పాట్లు చేయాలన్నారు. షామియానాలు, సీటింగ్ ఏర్పాట్ల బాధ్యతల్ని రోడ్లు, భవనాల శాఖ అధికారులు చేపట్టాలని ఆదేశించారు. సచివాలయం, రాజ్‌భవన్, శాసనసభతో పాటు ఇతర ప్రభుత్వ భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని చెప్పారు. జీహెచ్ఎంసీ సమన్వయంతో గన్‌పార్క్ లోని అమరవీరుల స్థూపానికి ఫ్లోరల్ డెకరేషన్ చేపట్టాలన్నారు. సమావేశ ప్రాంగణంలో ఎల్ఈడీ స్క్రీన్‌ల ఏర్పాటు, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ఏర్పాట్లు చేయాలని సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్‌ను ఆదేశించారు. నగరంలోని చార్మినార్, క్లాక్ టవర్ తదితర ప్రముఖ భవనాలను ఉత్సవాలు జరిగే 21 రోజులపాటు విధ్యుత్ దీపాలతో అలంకరించాలని మున్సిపల్ శాఖ అధికారులను ఆదేశించారు. మంచినీరు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు చెప్పారు. ఈ ఏర్పాట్లను పర్యవేక్షించడానికి సంబంధిత శాఖలు నోడల్ అధికారులను నియమించుకోవాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, కార్యదర్శులు రాహుల్ బొజ్జా, శ్రీనివాసరాజు, సందీప్‌కుమార్ సుల్తానియా, ఎస్ఏఎం రిజ్వీ, అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ జైన్, జైళ్ల శాఖ డీజీ స్వాతి లక్రా, జలమండలి ఎమ్‌డీ దానకిషోర్, జీహెచ్ఎంసీ కమీషనర్ లోకేష్ కుమార్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ అశోక్ రెడ్డి, ఈఎన్సీ గణపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూన్ 1న బాసర త్రిపుల్ ఐటీ ప్రవేశాలకు నోటిఫికేషన్

5 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

- సమర్పణకు తుది గడువు 19 : ఆర్జీయూకేటీ బాసర వీసీ వెంకటరమణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం (ఆర్జీయూకేటీ) బాసర త్రిపుల్‌ఐటీలో 2023-24 విద్యాసంవత్సరంలో ఆరేండ్ల సమీకృత బీటెక్ కోర్సులో ప్రవేశాల కోసం వచ్చేనెల ఒకటో తేదీన నోటిఫికేషన్ విడుదల కానుంది. బుధవారం హైదరాబాద్‌లో ఆర్జీయూకేటీ ఉపకులపతి (వీసీ) వి వెంకటరమణ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ వచ్చేనెల ఐదో తేదీ నుంచి ప్రారంభమవుతుందని వివరించారు. వాటి సమర్పణకు తుదిగడువు అదేనెల 19 వరకు ఉందని చెప్పారు. పోస్టు ద్వారా దరఖాస్తుల సమర్పణకు తుది గడువు ఈనెల 19 వరకు ఉందన్నారు. వికలాంగులు, సీఏపీ, ఎన్‌సీసీ, క్రీడాకారులకు దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు జూన్ 24 వరకు ఉందని అన్నారు. ప్రొవిజినల్ సీట్ల ఎంపిక జాబితాను అదేనెల 26న ప్రకటిస్తామని వివరించారు. జులై ఒకటో తేదీన మొదటి విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు ఫీజు ఓసీ, బీసీలకు రూ.500, ఎస్సీ, ఎస్టీలకు రూ.450, ఇతర రాష్ట్రాలు, అంతర్జాతీయ విద్యార్థులకు రూ.1,500, ఎన్ఆర్ఐ విద్యార్థులకు వంద డాలర్లు చెల్లించాలని చెప్పారు. ఆర్టికల్ 371-డీ ప్రకారం 85 శాతం సీట్లు తెలంగాణ స్థానిక విద్యార్థులకు, 15 శాతం సీట్లు అన్ రిజర్వుడు (ఏపీ, తెలంగాణ) విద్యార్థులకు మెరిట్ ఆధారంగా కేటాయిస్తామని వివరించారు. పదో తరగతి గ్రేడ్ పాయింట్ యావరేజ్ (జీపీఏ), ప్రతి సబ్జెక్టులోనూ అభ్యర్థి పొందిన గ్రేడ్ ప్రతిభల ఆధారంగా, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి ప్రవేశాలను చేపడతామని అన్నారు. గురుకులాలయేతర, ప్రభుత్వ పాఠశాలల నుంచి వచ్చిన దరఖాస్తులకు జీపీఏకు అదనంగా 0.4 డిప్రైవేషన్ స్కోరును కలుపుతామని వివరించారు. వచ్చే ఏడాది 1,650 సీట్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ ఏడాది జూన్ ఒకటి నాటికి 18 ఏండ్లు నిండని వారే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని స్పష్టం చేశారు. ఎస్సీ,ఎస్టీలకు మూడేండ్లు మినహాయింపు ఉంటుందని వివరించారు. ఈ ఏడాది ఎస్టీ రిజర్వేషన్ పెరిగినందున వారు ఎక్కువ మంది ప్రవేశాలు పొందే అవకాశముందన్నారు. త్రిపుల్‌ఐటీ బాసర ప్రాంగణంలో హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పారు. సందేహాలను విద్యార్థు లు నివృత్తి చేసుకోవచ్చని అన్నారు. ఇతర వివరాలకు www.rgukt.ac.in, www. admissions. rgukt.ac.in వెబ్‌సైట్లను సంప్రదించాలని సూచించారు.

అక్షయపాత్రకు భోజనం టెండర్!

త్రిపుల్‌ఐటీ బాసర ప్రాంగణంలో ఇంటిగ్రేటెడ్ మోడ్రన్ కిచెన్ నిర్మిస్తామని వెంకటరమణ చెప్పారు. జూన్ ఒకటో తేదీన టెండర్లు తెరుస్తామని అన్నారు. తొమ్మిది వేల మందికి ఒకేసారి భోజనం అందిస్తామని వివరించారు. భోజనం అందించే టెండర్‌ను అక్షయపాత్రకు ఇవ్వాలనే ఉద్దేశంతో సంప్రదించామని చెప్పారు. ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. నాన్‌వెజ్ కోసం స్థానిక మహిళా సంఘాల వారు శనివారం వచ్చి ఆదివారం నాన్‌వెజ్ వండి విద్యార్థులకు అందించేలా ప్రణాళిక రూపొందించామని అన్నారు. అమెరికాలో ఎన్ఆర్ఐలతో శనివారం రాత్రి ఎనిమిది నుంచి 11 గంటల వరకు తరగతులు తీసుకుంటారని వివరించారు. ఈ ఏడాది అకడమిక్ అంశాలపై దృష్టిసారిస్తామని చెప్పారు. లెట్ షేర్ పేరుతో అమ్మాయిలు ఈమెయిల్ ద్వారా మానసిక, ఆరోగ్య, ఇతర సమస్యలను చెప్తే వారికి వైద్యుల ద్వారా కౌన్సిలింగ్ అందిస్తామని అన్నారు. విద్యార్థులందరికీ హెల్త్‌కార్డులు తయారవుతున్నాయని వివరించారు. నిర్మల్ జిల్లాలో ఉన్నందున ఎన్ హబ్ (ఇంకుబేటర్ సెంటర్) పెడుతున్నామని చెప్పారు. నిజామాబాద్ ఐటీ టవర్‌లో త్రిపుల్‌ఐటీ బాసర ప్రాంగణానికి అవకాశం కల్పించారని అన్నారు. 65 శాతం కంటే ఎక్కువగా అమ్మాయిలు ఉన్నందున వారికి అకామిడేషన్‌పై దృష్టిసారిస్తామని చెప్పారు. వారికోసం వాక్ టు వాక్ ఐటీ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

అచ్యుతరామయ్య సేవలు స్ఫూర్తిదాయకం

- సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



సీపీఐ(ఎం) పార్టీకి, రైతుసంఘానికి, పార్టీ ఆడిట్ కమిటీకి 70 ఏండ్లుగా సేవలందిస్తున్న అన్నె అచ్యుత రామయ్య సేవలు స్ఫూర్తిదాయకమని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో అచ్యుత రామయ్య అభినందన సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను రాఘవులు, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా రాఘవులు, తమ్మినేని, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి మాట్లాడుతూ అచ్యుత రామయ్య 70 ఏండ్లుగా సీపీఐ(ఎం) పార్టీకి చేసిన సేవలు మరువలేనివని చెప్పారు. ఆయన 98వ ఏట కూడా ఉత్సాహంగా పార్టీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చి ఆడిటింగ్ బాధ్యతను నిర్వహించడం పార్టీ శ్రేణులకు మార్గదర్శకమని అన్నారు. ఆయన తన వయస్సు రీత్యా బాధ్యతల నుంచి తప్పుకుంటున్నారు కానీ పార్టీ నుంచి కాదని చెప్పారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, చెరుపల్లి సీతారాములు, బి వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, కార్యాలయ సిబ్బంది, ఆడిట్ కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

మా భూముల జోలికొస్తే దేనికైనా సిద్ధమే

అసైన్డ్ భూ బాధితుల హెచ్చరిక

- అండగా ఉంటాం : అఖిల పక్ష సమావేశంలో కోదండరాం, సర్వే

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'మా తాత ముత్తాతల నుంచి సాగు చేసుకుంటున్నాం. అవే మాకు జీవనాధారం. లేఅవుట్‌ల పేరుతో ప్రభుత్వం అసైన్డ్ భూములను గుంజుకుంటున్నది. మా భూముల జోలికొస్తే దేనికైనా సిద్ధమే' అని భూ బాధితులు హెచ్చరిస్తున్నారు. బాధితులకు అండగా ఉంటామని అఖిలపక్షపార్టీల నేతలు భరోసా ఇచ్చారు. 'ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వాలు కేటాయించిన అసైన్డ్ భూములను అక్రమంగా గుంజుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టడానికి' అంశంపై తెలంగాణ భూ రక్షణ సమితి(టీబీఆర్ఎస్) ఆధ్వర్యంలో బుధవారం సోమాజీగుడ ప్రెస్‌క్లబ్‌లో బుగ్గ మైసయ్య అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ భూమి ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని, వెట్టి నుంచి విముక్తి చేసిందని అన్నారు. భూమినే నమ్ముకుని బతుకుతున్న రైతును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దగా చేస్తున్నదని విమర్శించారు. రైతుల భూములను కబ్జాదారులు అక్రమిస్తే ప్రభుత్వానికి ఫిర్యాదు చేసేవారని, కానీ నేడు ప్రభుత్వమే కబ్జా చేస్తున్నదని ఎద్దేవా చేశారు. రైతుల దగ్గర భూమి తగ్గిపోతున్నదని, ఫామ్‌హౌస్‌లు పెరుగుతున్నాయని తెలిపారు. పరిశ్రమల పేరుతో అసైన్డ్ భూములను ప్రభుత్వం గుంజుకుంటున్నదని చెప్పారు.

లేఅవుట్లు, రీజినల్ రింగ్ రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ పేరుతో అసైన్డ్ భూములను తీసుకుంటున్న ప్రభుత్వానికి పరిహారం ఇవ్వడానికి చేతులురావడం లేదని విమర్శించారు. జూన్ 2 నుంచి కేసీఆర్ భజన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని, అందులో ఒక రోజు సంక్షేమ దినంగా పాటించాలని పిలుపునిచ్చారని గుర్తుచేశారు. ఆ సంక్షేమ దినం రోజునే భూ బాధితులంతా నిరసన దినంగా పాటించాలని, తమ మద్దతు కూడా ఉంటుందని పిలుపునిచ్చారు. కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ మాట్లాడుతూ కేసీఆర్ దళిత ద్రోహి అని అన్నారు. పేదల భూములను లాక్కొని పెద్దలకు మేలు చేయడానికే ధరణి తీసుకొచ్చారని విమర్శించారు. పేదలకు సంబంధించిన అసైన్డ్ భూముల్లో లేఅవుట్లు చేస్తున్న ప్రభుత్వం పెద్దల భూముల్లో చేసే దమ్ముందా? అని ప్రశ్నించారు. అసైన్డ్ భూములను లాక్కోవడానికి అప్పటి సీఎం వైఎస్ఆర్ ప్రయత్నిస్తే తాము అడ్డుకున్నామని చెప్పారు. కోనేరు రంగారావు సిఫార్సులను అమలుచేయకుండా అడ్డుకున్నారని విమర్శించారు.

తన వల్లే తెలంగాణ వచ్చిందని, పార్లమెంట్‌లో తెలంగాణ గురించి మాట్లాడింది తానేనని చెప్పారు. తెలంగాణ రావడానికి తాను, మీరాకుమార్, సుశీల్‌కుమార్ షిండేనే కారణమని, వీరంతా మాదిగ బిడ్డలని గుర్తుచేశారు.

తెలంగాణ భూ రక్షణ సమితి అధ్యక్షులు బుగ్గ మైసయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 6లక్షల ఎకరాల భూదాన్ భూముల్లో వినోబావే లక్ష ఎకరాలు పేదలకు పంచారని, మరో 5లక్షల భూములు కేసీఆర్ చేతిలో ఉన్నాయని తెలిపారు. చట్టం ప్రకారం 12ఏండ్లపాటు సాగుచేస్తే అసైన్డ్ భూములు పట్టా భూములుగా మారుతాయని, అయినా రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా గుంజుకుంటుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భూ రక్షణ సమితి చైర్మెన్ రాపోలు రాములు, సలహాదారులు చింతా స్వామి, భూ బాధితులు తదితరులు పాల్గొన్నారు.

నిక్కీ హెలీని కలిసిన కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఐక్యరాజ్యసమితి మాజీ అంబాసిడర్ నిక్కీ హెలీని మంత్రి కేటీఆర్ కలిశారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన ఇండియా, అమెరికా మధ్య వ్యూహాత్మక సంబంధాల గురించి ఆమెతో చర్చించారు. హైదరాబాద్, తెలంగాణ సంబంధాలపై మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. నిక్కీ హెలీతో దిగిన ఫోటోలను తన ట్విట్టర్‌లో కేటీఆర్ పోస్టు చేశారు. ఆర్థిక వ్యవస్థ, ఎన్నికలు, రాజకీయాల గురించి ఆమెతో విస్తత స్థాయిలో అభిప్రాయాలను పంచుకున్నట్టు ఆయన తెలిపారు. ఈసారి అమెరికా అధ్యక్ష ఎన్నికల రేసులో పోటీపడుతన్న నేపథ్యంలో నిక్కీకి మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

గుడిసెవాసులపై కలెక్టర్ తీరు కక్షపూరితం

- పోలీసు దాడులు సరికాదు : ఎస్.వీరయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహబూబాబాద్‌లో గుడిసెవాసులపై పోలీసులు మరోసారి దాడి చేయడం దారుణమని తెలంగాణ రాష్ట్ర ప్రజా సంఘాల పోరాట వేదిక కన్వీనర్ ఎస్.వీరయ్య పేర్కొన్నారు. గుడిసెవాసులపై కలెక్టరు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మళ్లీ 30 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేయడాన్ని తప్పుబట్టారు. 'గుడిసెల కేంద్రం దగ్గర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇప్పటికైనా కలెక్టర్ తన ధోరణి మానుకోవాలి. అరవై శాతం గిరిజన, దళిత జనాభా ఉన్న జిల్లాకు కలెక్టర్‌గా ఉన్న అధికారి ఇలా వ్యవహరించటం తగదు. కలెక్టర్ పేదల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. 170 ఎకరాల ప్రభుత్వ భూమిమీద కన్నేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇతర కబ్జాకోర్ల కోసం పేదలను వెంటాడుతున్నారు. గుడిసెవాసుల్లో ఎక్కువగా గిరిజనులు, దళితులు, వెనుకబడిన సామాజిక తరగతుల వారే ఉన్నారు. వారిపై అణచివేత ధోరణి సరిగాదు. తక్షణమే ఇండ్ల స్థలాల కోసం పేదల నుంచి దరఖాస్తులు తీసుకోవాలి. అర్హులైన పేదలకు స్థలం కేటాయించాలి' అని పేర్కొన్నారు. గుడిసెల నుంచి పేదలను తొలగించేలా దాడులు కొనసాగిస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. నాగయ్య అక్కడి పేదలను పరామర్శించారనీ, మంత్రి సత్యవతి రాథోడ్‌కు పరిస్థితిని వివరించారని తెలిపారు. గుడిసెవాసులు వెనక్కి తగ్గకుండా పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు.

అప్పు చెల్లించాలన్నందుకు హత్య

- శరీర భాగాలను నరికి ఫ్రిజ్‌లో దాచిన నిందితుడు
- దుర్వాసన రాకుండా స్ప్రేలు, కెమికల్స్ వినియోగం
- ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో నష్టపోయిన నిందితుడు



నవతెలంగాణ-సిటీబ్యూరో/ సంతోష్‌నగర్

అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలన్న మహిళను హత్య చేసి.. శరీర భాగాలను ముక్కలు ముక్కలుగా నరికాడు దుండగుడు.. తల నరికి, శరీరభాగాలను ముక్కలు చేసి ఇంట్లోని ఫ్రిజ్‌లో దాచి పెట్టాడు. మొండెం లేని తల లభ్యమైన కేసును పోలీసులు ఛేదించారు. ఆరు రోజుల కింద హైదరాబాద్ మలక్‌పేట మూసీ పరివాహక ప్రాంతమైన తీగలగూడ వద్ద ప్లాస్టిక్ కవర్‌లో మహిళ తల లభించిన విషయం తెలిసిందే. ఈ కేసును పోలీసులు ఛేదించారు. బుధవారం మలక్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో సౌత్, ఈస్ట్‌జోన్ డీసీపీ రూపేశ్ వివరాలు వెల్లడించారు.

మొండెం లేని మహిళ తల లభించిన తర్వాత మృతురాలి ఆచూకీ కోసం ఎనిమిది పోలీసు బృందాలను రంగంలోకి దించారు. మహిళ తలతో పోస్టర్లను ముద్రించిన పోలీసులు.. మలక్‌పేట, సైదాబాద్, చాదర్‌ఘాట్, పాతబస్తీతోపాటు పలుచోట్ల చూపిస్తూ ఆరా తీశారు. రాష్ట్ర వ్యాప్తంగా 750 పోలీస్‌స్టేషన్లలో నమోదైన మిస్సింగ్ కేసులను పరిశీలించారు. తల లభ్యమైన పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులకు చైతన్యపురికి చెందిన చంద్రమోహన్‌పై అనుమానం వచ్చింది. అతనిపై ప్రత్యేక నిఘా ఉంచారు. ప్రాథమిక నిర్ధారణకు వచ్చాక అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం వెలుగు చూసింది.

ఎర్రం అనురాధ(55) ఓ ఆస్పత్రిలో నర్సుగా పనిచేసేది. పదేండ్ల కిందట చంద్రమోహన్ తండ్రికి ఆమె పనిచేస్తున్న ఆస్పత్రిలో సర్జరీ జరిగింది. అప్పటి నుంచి ఇద్దరికి పరిచయం ఏర్పడింది. చంద్రమోహన్ ఇంట్లోనే గ్రౌండ్ ఫ్లోర్‌లో అనురాధకు గదిని అద్దెకు ఇచ్చాడు. రెండేండ్లుగా ఆమె అక్కడే నివాసముంటోంది. ఆమెతో సన్నిహితంగా ఉండి దాదాపు రూ.7లక్షలు అప్పుగా తీసుకున్నాడు.

ఇదిలావుండగా, ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో దాదాపు రూ.18లక్షల వరకు నష్టపోయిన చంద్రమోహన్ అప్పుల పాలయ్యాడు. తీసుకున్న డబ్బులు చెల్లించాలని అనురాధ నిలదీయడంతో ఆమెపై కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా హత్య చేయాలని నిర్ణయించుకున్న అతను ఈనెల 12న మధ్యాహ్నం ఆమెతో గొడవ పడ్డారు. ఈ క్రమంలో దారుణంగా హత్య చేశాడు. ఆ తర్వాత కత్తి, రెండు స్టోన్ కట్టర్స్‌తో శరీర భాగాలను ముక్కలుగా చేశాడు. శరీర భాగాల్లోని కొన్నింటిని బకెట్‌లో, కాళ్లను ఫ్రిజ్‌లో దాచిపెట్టాడు. ఇంట్లో వాసనరాకుండా మృతురాలి శరీర భాగాలపై కెమికల్స్, ఫినైల్, డెట్టాల్, ఆగర్‌బత్తీలు, కర్పూరం, స్ప్రేలు చల్లాడు. శరీర భాగాలను మాయం చేసేందుకు సామాజిక మాధ్యమాల్లో కొన్ని వీడియోలు చూశాడు. 15న తలను బ్లాక్ కలర్ పాలిథిన్ కవర్‌లో పెట్టి ఆటోలో తీసుకొచ్చి మలక్‌పేట మూసీ పరివాహక ప్రాంతంలో పడేశాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు మృతురాలి సెల్‌ఫోన్‌తో తెలిసిన వారికి మెసేజ్‌లు చేసేవాడు. అయితే, తీగలగూడ వద్ద ప్లాస్టిక్ కవర్‌లో మొండెం లేని మహిళ తల గుర్తించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు.. మృతురాలి శరీర భాగాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ సమావేశంలో ఏసీపీ జీ.శ్యాంసుందర్, మలక్‌పేట్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్, డీఐ ఎల్.బాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీసుల్లో మహిళా సమ్మాన్ సర్టిఫికెట్లు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మహిళల చిన్న మొత్తాల పొదుపులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్స్' రాష్ట్రంలోని అన్ని పోస్టాఫీసుల్లో అందుబాటులో ఉన్నాయని ఇండియాపోస్ట్ హైదరాబాద్ సిటీ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఏ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు బుధవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ పథకంలో మహిళలు తమ కోసం లేదా మైనర్ బాలికల తరఫున ఖాతాను తెరవవచ్చని తెలిపారు. కనిష్టంగా వెయ్యిరూపాయలు, గరిష్టంగా రెండు లక్షల వరకు డిపాజిట్ చేయొచ్చు. ఖాతా మెచ్యూరిటీ వ్యవధి రెండేండ్లు, గరిష్ఠ పరిమితికి లోబడి ఒక్కరు ఎన్ని ఖాతాలైనా మూడు నెలల తర్వాత తెరవవచ్చు. ఈ పథకం కింద డిపాజిట్లకు వర్తించే వడ్డీ రేటు సంవత్సరానికి 7.5 శాతం ఉంటుంది. ప్రతి మూడునెలలకు ఒకసారి వడ్డీని లెక్కించి ఖాతాలో జమచేస్తారు. ఖాతా తెరిచిన తేదీ నుంచి ఏడాది గడువు ముగిసిన తర్వాత, ఆ సొమ్ములో గరిష్టంగా 40 శాతం వరకు ఉపసంహరించుకోవచ్చు. ఇతర వివరాలకు సమీపంలోని పోస్టాఫీసుల్లో సంప్రదించాలని ఆయన కోరారు.

పార్లమెంట్ భవనంలో చారిత్రక రాజదండం

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 28న ప్రారంభించే పార్లమెంట్ నూతన భవనంలో బంగారపు చారిత్రక రాజదండం కూడా మనకు కన్పిస్తుంది. దీనిని స్పీకర్ స్థానం సమీపంలో ఏర్పాటు చేస్తారు. బ్రిటిష్ వారి నుండి అధికార మార్పిడికి సంకేతంగా ఈ రాజదండాన్ని నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు 1947 ఆగస్ట్ 14వ తేదీ అర్థరాత్రి సమయంలో చివరి వైస్రాయ్ లార్డ్ మౌంట్ బాటన్ అందజేశారు. దీని చారిత్రక ప్రాధాన్యతను గుర్తించిన ప్రధాని మోడీ దానిని నూతన పార్లమెంట్ భవనంలో ఉంచుతారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా బుధవారం తెలిపారు. దీని ప్రాధాన్యత చాలా మంది భారతీయులకు తెలియదని ఆయన చెప్పారు. చోళుల కాలంలో ఇలాంటి రాజదండాలు వాడేవారని వివరించారు. ఇది అధికారానికి చిహ్నమని, అధికారం ఒకరి నుండి మరొకరికి మారేటప్పుడు దీనిని అందజేసేవారని తెలిపారు. ఈ రాజదండం ప్రస్తుతం అలహాబాద్ మ్యూజియంలో ఉంది.

రాజదండం కథా కమామిషు

భారత స్వాతంత్ర్యానికి గుర్తుగా ఏదైనా చిహ్నాన్ని ఏర్పాటు చేయాలని నెహ్రూకు మౌంట్ బాటన్ సూచించారు. దీనిపై అప్పటి చిట్టచివరి గవర్నర్ జనరల్ సీ రాజగోపాలాచారిని నెహ్రూ సంప్రదించగా రాజదండం గురించి చెప్పారు. రాజదండాన్ని స్వీకరించాలన్న సూచనకు నెహ్రూ, మౌంట్ బాటన్ అంగీకరించారు. రాజదండం తయారీ కోసం రాజగోపాలాచారి మద్రాస్ వెళ్లి మఠాధిపతులను సంప్రదించారు.

అప్పుడు ఉమ్మిడి బంగారు చెట్టి అనే ఆభరణాల తయారీదారు దీనిని ఐదు అడుగుల పొడవుతో తయారు చేశారు. దాని పైభాగంలో న్యాయానికి ప్రతీకగా నందిని చెక్కారు. అనంతరం రాజదండాన్ని మఠాధిపతులు గంగాజలంతో శుద్ధి చేసి ఊరేగింపుగా నెహ్రూ వద్దకు తీసికెళ్లారు. 1947 ఆగస్ట్ 14వ తేదీ అర్థరాత్రి దానిని డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఇతర నేతల సమక్షంలో నెహ్రూ స్వీకరించారు.

ఇలా ఇచ్చి..అలా గుంజుకున్నరు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు అందని పరిహారం

- ఏండ్లు గడుస్తున్నా ఎదురుచూపులే
- పెరుగుతున్న దాడులు
- పట్టించుకోని పాలకులు
- అటకెక్కిన హైపవర్ కమిటీ

ఎస్సీ ఎస్టీ లైంగిక దాడి బాధితులకు చెల్లించాల్సిన పరిహారాన్ని ప్రభుత్వం అలా చూపించి..ఇలా తిరిగి తీసుకుంది. వారికి చెందాల్సిన రూ.10 కోట్ల నిధులను దారి మళ్ళించింది. బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరిలో రూ.5 కోట్లను మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం మరో రూ. 5 కోట్లను జమచేసి మొత్తం పది కోట్లకు బడ్జెట్ రిలిజ్ అర్డర్ ఇచ్చింది. అయితే ఆ డబ్బును కలెక్టర్ల ఖాతాలకు పంపిన గంట వ్యవధిలో తిరిగి ప్రభుత్వ ఖాతాలోకి మళ్లించింది. దీంతో బాధితులకు అందాల్సిన పరిహారం ఆలస్యమవుతున్నది.అది ఎప్పుడొస్తదా అని ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్నారు. చెప్పులరిగేలాగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అదిగో..అదిగో అంటూ అధికారులు బాధితులను మభ్యపెడుతున్నారు తప్పితే, వారికి పరిహారం అందించటంలేదు. తక్షణ సహాయం, నష్టపరిహారం, పునరావాసం భిక్ష కాదు.. అది బాధితుల చట్టబద్ధమైన హక్కు అని మరిచి పోతున్నారు.

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎస్సీ,ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదైన ఏడు రోజుల్లో మొదటి దశ నష్టపరిహారం చెల్లించాలి. చార్జీషీటు వేసిన తర్వాత రెండో దశను పూర్తి చేయాలి. నిందితులకు శిక్ష పడిన తర్వాత చివరి దశ నష్టపరిహరం చెల్లించి పునరవాసం కల్పించాలి. కానీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వేలాది కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5 వేల మంది బాధితులకు నష్టపరిహారం అందాల్సి ఉంది. మొదటి, రెండో, మూడో దశల్లో చెల్లించాల్సిన నష్టపరిహారం బాధితులకు సక్రమంగా అందటం లేదు. వారికి పునరావాసం కల్పించాలని చట్టం చెబుతున్నా..ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోవటం లేదు. చట్ట నిబంధనలను సర్కార్ ఖాతరు చేయటంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పెరుగుతున్న దాడులు..

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. తొమ్మిదేండ్ల కాలంలో అవి 836 శాతం పెరిగాయి. రాష్ట్రం వచ్చిన కొత్తలో 287 అట్రాసిటీ కేసులు నమోదైతే.. 2020-21 నాటికి వాటి సంఖ్య 2,689కి పెరిగింది. తెలంగాణ అవిర్భావం తర్వాత ఒకే ఏడాదిలో అన్ని కేసులు నమోదు కావడంపై దళిత సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. నమోదైన కేసులే ఇన్ని ఉంటే..ఇక స్టేషన్ వరకు రాని కేసులెన్నో..పెద్ద మనుషుల ఒప్పందాలతో పరిష్కారమైన కేసులు ఇంకెన్నో.. మరో పక్క కేసులు పెట్టడానికి బాధితులు స్టేషన్‌కు వెళ్లిన సమయంలో పోలీసు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల జాతీయ ఎస్సీ కమిషన్ రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా బాధితులు ఆ కమిషన్ ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఫ్రెండ్లీ పోలీసులమంటూనే బాధితుల పట్ల ఇలా వ్యవహరించటమేంటని సామాజిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

ఇది వేధింపుల లెక్క

సంవత్సరం	ఎస్సీ	ఎస్టీ	మొత్తం
2014-15	204	83	287
2015-16	620	167	787
2016-17	794	213	1,007
2017-18	937	306	1243
2018-19	875	277	1152
2019-20	908	276	1184
2020-21	1768	921	2689
2021-22	-	-	-
2022-23	-	-	-
మొత్తం	6106	2243	8818

(2021,2022-23 సంవత్సరాల కేసులు వెల్లడి కానందున ఇక్కడ పొందుపర్చలేదు.)



ఒక్క ఎస్సీలపైనే 6,106 దాడులు

రాష్ట్రంలో ఇప్పటి దాకా 8,818 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. అందులో ఎస్సీలపైనే 6,106 దాడులున్నాయి. ఎస్టీలకు సంబంధించి 2,243 కేసులు నమోదయ్యాయి. 2014లో 204 మంది దళితులపై దాడులు జరగ్గా, 2020-21 నాటికి వాటి సంఖ్య 1,768కు పెరిగింది. వీటిలో మహిళపై లైంగిక వేధింపుల కేసులు కూడా ఉన్నాయి. ఇవి నమోదైన కేసులే. ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా రాజీ చేసుకున్న కేసులు ఇంకా చాలానే ఉన్నాయి.

పరిహారమూ ఇవ్వలే..

మామూలుగా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైతే.. రిలీఫ్ అండ్ రిహాబిలిటేషన్ కింద బాధితులకు అందే పరిహారంలో మైనర్ అయితే 25 శాతం, మేజర్ అయితే 50 శాతాన్ని ముందే అందించాల్సి ఉంటుంది. అది కూడా వారంలోగా ఇవ్వాలి. మిగతా మొత్తం చార్జిషీట్ నమోదయ్యాక ఇవ్వాలి. కానీ ఒక్క కేసులోనూ సమయానికి పరిహారం అందలేదు. లైంగిక దాడి, హత్య వంటి కేసుల్లో అదనపు పరిహారం కింద కుటుంబానికి మూడునెలలకు సరిపోయే రేషన్ ఇవ్వాలి. మూడు నెలల్లోపు అర్హతను బట్టి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇల్లు, గ్రామాల్లో అయితే మూడెకరాల భూమి ఇవ్వాలి. దీంతోపాటు ఇంట్లో పెద్ద మనిషి ఉంటే పింఛను కూడా ఇవ్వాలి. కానీ.. ఒక్క కేసులోనూ ఈ పరిహారం ఇవ్వకపోవటం గమనార్హం.

ఆలస్యంతో అవస్థలు..

సంబంధిత వ్యవస్థల నిర్లక్ష్యం మూలంగా కేసుల పరిష్కారంలో తీవ్ర ఆలస్యం జరుగుతున్నది. కేసుల నమోదును జిల్లాల్లో అయితే డీఎస్పీ, పట్టణాల్లో అయితే ఏసీపీని దర్యాప్తు అధికారిగా నియమించాలి. నెలలోపు దర్యాప్తు పూర్తి చేసి... రెండు నెలల్లోగా కోర్టులో చార్జిషీటు వేయాలి. తర్వాత 60 రోజుల్లోని కోర్టులో విచారణ జరగాలి. కానీ, ఇవేవీ సమయానికి జరగటం లేదని బాధితులు చెబుతున్నారు. 33 జిల్లాలకు 10 స్పెషల్ కోర్టులున్నాయి.

ఇందులో ఎస్సీ, ఎస్టీ కేసుల కంటే ఇతర కేసులే ఎక్కువగా విచారణకు వస్తున్నాయి. హత్య జరిగితే 6 నెలల్లోపే కేసును పూర్తి చేయాల్సి ఉన్నా ఆరేడేండ్లయినా కేసులు పూర్తి కావట్లేదు. 4,100 కేసుల విచారణలు ఇంకా ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉండటాన్ని బట్టి పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

హైపవర్ కమిటీ ఊసే లేదు

ఎస్సీ, ఎస్టీలపై వేధింపులు, దాడులకు సంబంధించి చట్టబద్ధంగా సీఎం అధ్యక్షతన హైపవర్ కమిటీ ఏర్పాటు చేయాలి. ఈ కమిటీ ఏడాదికి రెండు సార్లు సమావేశం కావాలి. దీనిలో అట్రాసిటీ చట్టం అమలు, బాధితులకు పరిహారం, దర్యాప్తు వంటి విషయాలపై చర్చించాలి. ఇంత ముఖ్యమైన ఈ కమిటీ ఏర్పాటు ఊసే లేదు. ఆ కమిటీని ఎందుకు ఏర్పాటు చేయలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ ఏర్పాటు కాలేదు. నాలుగేండ్లుగా రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు చైర్మెన్, పాలకమండలి సభ్యుల నియామకం జరగలేదు. జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలు ఉన్నప్పటికీ మూడు నెలలకోసారి జరగాల్సిన సమీక్షా సమావేశాలు జరగటం లేదు.

దళితులంటే నిర్లక్ష్యమెక్కువ..



తరతరాలనుంచి దళితులంటే అంటరాని వారుగా సమాజం చూస్తున్నది. అగ్రకులాలు ఆధునిక సమాజంలోనూ..ఈ వైఖరి కలిగి ఉన్నారు. అందుకే పెత్తందార్లు ఎస్సీ, ఎస్టీలపై నిత్యం ఎక్కడో ఒక చోట దాడులు చేస్తూనే ఉన్నారు. కుల అహంకార దాడులు చట్ట ప్రకారం నేరం. అయినా నిత్యకృత్యంగా జరుగుతూనే ఉన్నాయి. చట్టాలు, కోర్టులు ఏమీ చేయలేవన్న ధైర్యం పెత్తందార్లలో ఉన్నది. తమకు అనుకూలంగా ఆ చట్టాలను మలుచుకోవచ్చని భావిస్తున్నారు. వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తే..కొంతలో కొంతైనా ఈ నేరాలు తగ్గుతాయి. కానీ..అమలులో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనపడుతోంది.

శంకర్ జాతీయ కార్యదర్శి దళిత బహుజన ఫ్రంట్

చట్టాలున్నా.. అమలులో నిర్లక్ష్యం



దళితులపై పెత్తందారుల దాడులు, దౌర్జన్యాలు, మహిళలపై లైంగిక వేధింపులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. వీటిని అరికట్టేందుకు చట్టాలున్నా..వాటిని అమలు చేయటంలో నిర్లక్ష్యం కొనసాగుతున్నది. ముఖ్యంగా కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక విచ్చల విడి దాడులు పెరుగుతున్నాయి. మనుధర్మాన్ని పాటించాల్సిందేనని చెబుతున్నారు. పరోక్షంగా, ప్రత్యక్షంగా సనాతన ధర్మాలను ముందుకు తెస్తున్నారు. రాబోయే రోజుల్లో మరింత ప్రమాదకర పరిస్థితులు ఉత్పన్నమయ్యే స్థితి ఉన్నది. రాజ్యాంగ రక్షణకు సంఘటితంగా ఉద్యమించాల్సిందే.

టి స్కైలాబ్ బాబు కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

బాధితులకు నష్టపరిహారంలో నిర్లక్ష్యం తగదు..



ఎస్సీ, ఎస్టీ బాధితులకు పరిహారాన్ని అందించటంలో ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నది. కేసులు నమోదు చేసుదే తక్కువ. నమోదైన కేసులకు పరిహారం చట్టబద్ధంగా చెల్లించటానికి తాత్సారం ఎందుకు? హైదరాబాద్‌లో నమోదైన కేసులకు రెండు కోట్లు అవసరమైతే.. రూ.40 లక్షలు, సిరిసిల్లా జిల్లాకు రూ.40లక్షలు అవసరమైతే కేవలం రూ. 9లక్షలు మాత్రమే విడుదల చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంటుంది. చట్ట ప్రకారం సమయానుకూలంగా నష్టపరిహారం అందించాలి.

బత్తుల రాంప్రసాద్ ఎంఎస్ఎస్ అధ్యక్షులు

---

11 లక్షల ఎకరాలకు పోడు పట్టాలివ్వాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. మూడు, నాలుగు లక్షల ఎకరాలకు పట్టాలిస్తారంటూ ప్రచారం జరుగుతున్నదని, అదే నిజమైతే దాన్ని సరిచేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల పీఆర్సీ, డీఏల మంజూరు, ఇతర సమస్యలు, కార్మికులకు కనీస వేతనాల జీవో సవరణ, పంచాయతీ కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయాలపై సీఎం కేసీఆర్‌ను కలిసి సమస్యల పరిష్కారానికి ప్రయత్నించాలంటూ తమ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గం నిర్ణయించిందన్నారు.

బీజేపీ పెరుగుదలకు బ్రేక్

కర్నాటక ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహం కనిపిస్తున్నదని తమ్మినేని చెప్పారు. ఆర్నెళ్ల కిందే రాష్ట్రంలో బీజేపీ పెరుగుదల ఆగిపోయిందన్నారు. ఆ పార్టీ నాయకుల్లో అంతర్గత కుమ్ములాటలు బయటపడుతున్నాయని అన్నారు. కర్నాటక ఫలితాల ప్రభావం కాంగ్రెస్‌లో తాత్కాలికమే తప్ప రాబోయే ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో ఉండకపోవచ్చని అన్నారు. అయితే బీఆర్ఎస్ చెప్తున్నట్టుగా వందకుపైగా సీట్లు సాధించే అవకాశం లేదన్నారు. 70 నుంచి 80 సీట్లతో అధికారంలోకి రావొచ్చని చెప్పారు.

ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కమ్యూనిస్టుల తోడ్పాటు ఉంటే మరిన్ని ఎక్కువ సీట్లు సాధించే అవకాశం ఉంటుందన్నారు. కేంద్రం విధానాలపై వామపక్షాలను కలుపుకుని ప్రజా ఉద్యమాలను నిర్మించడంలో బీఆర్ఎస్ చొరవ చూపడం లేదని, ఈ లోపాన్ని సరిచేసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో అపరిష్కృత సమస్యలపై వచ్చేనెలలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఇండ్లు, ఇండ్లస్థలాలు, పోడు భూములకు పట్టాలు, కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, ధరణి, రైతుల ఇబ్బందులు, పంట నష్టపరిహారం అందజేత వంటి సమస్యలపై ఆందోళనా పోరాటాలను నిర్వహిస్తామని వివరించారు. 111 జీవోను మరింత పారదర్శకంగా అన్ని పార్టీలతో చర్చించి ముందుకు సాగాలని కోరారు.

రాజకీయ లబ్ధికోసమే రూ.2 వేల నోట్ల రద్దు

రూ.రెండు వేల నోట్ల రద్దు అనవసర చర్య అని తమ్మినేని విమర్శించారు. రాజకీయ లబ్ధి పొందడం కోసమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. దీనివల్ల నల్లధనం నియంత్రణ, దేశ ఆర్థిక వ్యవస్థ బాగుపడేది ఏమీ లేదని చెప్పారు. గతంలో రూ.500, రూ.1000 నోట్లు రద్దు చేసినప్పుడే అది రుజువైందని వివరించారు. ఇప్పుడు రూ.రెండు వేల నోట్లు రద్దు చేయడం వల్ల వచ్చే ప్రయోజనం శూన్యమని విమర్శించారు.

లెఫ్టినెంట్ గవర్నర్లు, గవర్నర్ల వ్యవస్థ పనికిరానివని అన్నారు. ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలపై ఆంక్షలు సరైనవి కావని చెప్పారు. ప్రభుత్వాలకే పూర్తి అధికారాలుండాలని స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు తీర్పును సీపీఐ(ఎం) బలపరుస్తున్నదని అన్నారు. ప్రతిపక్షాల ఐక్యతకు సంబంధించి రకరకాల ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రాల స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా అన్ని శక్తులూ ఏకం కావాలని చెప్పారు. ఎన్నికల తర్వాత బీజేపీయేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం సరైన మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవి రాఘవులుతోపాటు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాల్గొన్నారు.

'ఉపాధి'కి ఉరివేసేందుకు మోడీ కుట్ర

ఏటా నిధుల కేటాయింపులో కోత

- అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



నవతెలంగాణ-మునగాల

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి ఉపాధికి ఉరేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర పన్నుతుందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని గణపవరం, తిమ్మారెడ్డిగూడెం గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాలను ఆయన సందర్శించారు. కూలీలతో మాట్లాడారు యూపీఏ ప్రభుత్వం హయాంలో పోరాడి సాధించుకున్న చట్టాన్ని మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చాక అనేక మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. బడ్జెట్‌లో నిధులను కుదించి ఈ పథకాన్ని క్రమంగా కూలీలకు దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా కేంద్ర బడ్జెట్‌లో 2 లక్షల 50 వేల కోట్లు కేటాయించాల్సింది పోయి ఈ ఏడాది రూ.65 వేల కోట్లు మాత్రమే కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. వామపక్షాల వల్ల సాధించుకున్న ఈ చట్టాన్ని నీరుగారిచ్చేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా ఉపాధి చట్ట రక్షణ కోసం జరిగే ఉద్యమంలో వ్యవసాయ కూలీలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగటంతో పని దినాలు పడిపోతున్నాయని, ఫలితంగా వ్యవసాయ కూలీలు వలసలు పోతున్నారని తెలిపారు. వ్యవసాయ కూలీలకు పనులు కల్పించేందుకు సంవత్సరానికి ఉపాధి హామీలో 200 రోజులు పని దినాలు.. రోజుకు 600 రూపాయల కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ పర్యటనలో ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు వేలిది పద్మావతి, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి చందా చంద్రయ్య, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు సోమపంగు జానయ్య, జిల్లా సహాయ కార్యదర్శి పటాన్ మైబెల్లి, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నందిగామ సైదులు తదితరులు ఉన్నారు.

విత్తన భాండాగారంగా తెలంగాణ

ఈ ప్రాంతం విత్తనోత్పత్తికి అనుకూలం

- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి
- రాజేంద్రనగర్‌లో "విత్తన మేళా -2023" ప్రారంభం



నవతెలంగాణ-రాజేంద్రనగర్

తెలంగాణను ప్రపంచానికే విత్తన భాండాగారంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఇప్పటికీ రాష్ట్రం కొన్ని రకాల విత్తనాల్ని దిగుమతి చేసుకుంటున్నదని, భవిష్యత్తులో దీన్ని అధిగమించాలని అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన "విత్తన మేళా-2023"ను మంత్రి ప్రారంభించారు. కొంత మంది రైతులకు విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి తెలంగాణ ప్రభుత్వం రైతాంగ సంక్షేమం కోసం అనేక కార్యక్రమాల్ని అమలు చేస్తుందని తెలిపారు. సాగునీటి సౌకర్యం పెరిగిందన్నారు. తెలంగాణ ప్రాంతం విత్తనోత్పత్తికి చాలా అనుకూలమైందని చెప్పారు. రైతాంగం ఈ విషయంపై దృష్టి పెట్టాలన్నారు. తెలంగాణలో తయారయ్యే విత్తనాలకి ఇతర ప్రాంతాల్లో విపరీతమైన ఆదరణ ఉందన్నారు. భవిష్యత్‌లో తెలంగాణ ప్రపంచానికంతటికీ విత్తనాలు సరఫరా చేసే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి భూసారాన్ని పరిరక్షించాలని సూచించారు. ఈ విషయాలపై శాస్త్రవేత్తలు రైతులకి నిరంతరం అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా పశుపోషణకి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆహారశుద్ధి పరిశ్రమలకు అధిక ప్రాధాన్యమిస్తూ ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టిందని చెప్పారు. వివిధ వంగడాలపై విశ్వవిద్యాలయం రూపొందించిన కరపత్రాలను మంత్రి ఆవిష్కరించారు. ప్రదర్శనల్ని తిలకించి విత్తనాలు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తన సంస్థ కార్పొరేషన్ చైర్మెన్ కొండ బాల కోటేశ్వరరావు, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ కె.హనుమంతు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధీర్ కుమార్, పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎం.వెంకటరమణ, విస్తరణ సంచాలకులు డాక్టర్ సుధారాణి, విత్తన సంచాలకులు డాక్టర్ పి.జగన్‌మోహన్ రావు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. విత్తన మేళాకు రైతులు తరలి వచ్చారు.



ఔరంగాబాద్‌లో రోడ్డు ప్రమాదం

- సిద్ధిపేటకు చెందిన నలుగురు అన్నదమ్ములు మృతి
- బతుకుదెరువు కోసం వెళ్తుండగా ఘటన

నవతెలంగాణ-అక్కన్నపేట

మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చౌటపల్లికి చెందిన నలుగురు మృతిచెందారు. మృతులందరూ ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు ఎరుకుల కృష్ణ, సంజీవ్, సురేష్, వాసుగా పోలీసులు గుర్తించారు. అన్నదమ్ములు నలుగురూ కొన్నేండ్ల కిందట బతుకుదెరువు కోసం గుజరాత్‌లోని సూరత్‌కు వెళ్లారు. ఐదురోజుల కిందట వీరి స్వగ్రామమైన చౌటపల్లిలో బంధువు ఎరుకల కనుకయ్య మృతిచెందారు. అతడి అంత్యక్రియల కోసం ఈ నలుగురూ కుటుంబ సభ్యులతో కలిసి చౌటపల్లికి వచ్చారు. కుటుంబ సభ్యులను చౌటపల్లిలోనే ఉంచి అన్నదమ్ములు తిరిగి సూరత్‌కు మంగళవారం కారులో బయల్దేరారు. అదే రోజు రాత్రి మహారాష్ట్రలోని ఔరంగాబాద్ వద్ద కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో కారులో ఉన్న నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు.

రాష్ట్రపతిని అవమానించిన ఆర్ఎస్ఎస్, బీజేపీ : బెల్లయ్యనాయక్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కొత్త పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపది ముర్మును ఆహ్వానించకుండా ఆర్ఎస్ఎస్, బీజేపీ అవమానించాయని టీపీసీసీ ఆదివాసీ కాంగ్రెస్ చైర్మెన్ బెల్లయ్య నాయక్ విమర్శించారు.గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ద్రౌపది ముర్ము చేతనే పార్లమెంటు భవనాన్ని ప్రారంభింపజేయాలని డిమాండ్‌తో 25న జిల్లా కేంద్రాల్లో, 26న మండల కేంద్రాల్లో మీడియా సమావేశాలు, 27న రాష్ట్రవ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాల వద్ద, 28న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఇంకెప్పుడు కొంటారు..?

(మొదటిపేజీ తరువాయి)

మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై సాలుర సొసైటీ సెక్రటరీ బస్వంతరావును వివరణ కోరగా, రంగు మారిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారుల నుంచి తమకు స్పష్టమైన ఆదేశాలు రాలేదని చెప్పారు. అందువల్లే ఆ ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదన్నారు. ఈపాటికే సాలుర కొనుగోలు కేంద్రంలో 4 వేల బస్తాలకు పైగా మొలకెత్తిన ధాన్యం ఉందని తెలిపారు.

ఐదు కిలోల తరుగు తీయడంపై ఆగ్రహం

తరుగు పేరుతో క్వింటా ధాన్యానికి ఐదు కిలోలు తగ్గించడాన్ని నిరసిస్తూ రైతులు యాదాద్రిభువనగిరి జిల్లా అనాజిపురం స్టేజి వద్ద ధర్నా నిర్వహించారు.పలువురు రైతులు మాట్లాడుతూ.. పరీక్షించిన తర్వాత సర్టిఫైడ్ చేసిన ధాన్యాన్ని మిల్లర్లు తరుగు పేరుతో ఐదు కిలోలు తగ్గించడం సరైనది కాదన్నారు. మిల్లర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. సర్పంచ్ ఎదునూరి ప్రేమలతా మల్లేశం మాట్లాడుతూ.. వ్యవసాయ అధికారులు వెంటనే స్పందించి రైతులను మోసం చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. పోలీసులు, మిల్లర్ సంఘటనా స్థలానికి వచ్చి రైతులతో మాట్లాడారు. తరుగు తీయబోమని చెప్పడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మైలారం వెంకటేష్, ఎదునూరి వెంకటేశం, గోగు శ్రీనివాస్, పిట్టల వెంకటేశం, చంద్రయ్య, మహిళా రైతులు పాల్గొన్నారు.

ధాన్యానికి నిప్పు పెట్టి రాస్తారోకో

మహబూబాబాద్ జిల్లా ఈదులపూసపెల్లి గ్రామంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆగ్రహించిన రైతులు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గ్రామ శివారులో రహదారిపై పంటకు నిప్పు పెట్టి.. రాస్తారోకో చేశారు. సీఐ రమేష్ బాబు తన సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి రైతులను సముదాయించారు. అధికారులు వస్తే తప్ప రాస్తారోకో విరమించేది లేదని రైతుల మొండికేశారు. దీంతో పీఏసీఎస్ అధికారులు వచ్చి.. నేటి నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వారం రోజులుగా కొనుగోలు కేంద్రానికి లారీలు రావడం లేదని, మిల్లుల్లో ధాన్యం అన్‌లోడ్ కాక ఎక్కడి లారీలు అక్కడే నిలిచిపోతున్నాయని వాపోయారు. దాంతో పీఏసీఎస్ కొనుగోలు కేంద్ర నిర్వాహకులు రావుల వెంకటరెడ్డి ధాన్యం కొనుగోలు చేసేది లేదని చేతులెత్తేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

పట్టు రైతుల సమస్యలు పరిష్కరించాలి

కనీస ధర కట్టించాలి

- ప్రోత్సాహకం, సబ్సిడీ అందివ్వాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్
- తిరుమలగిరి పట్టుగూళ్ల డైరెక్టర్ కార్యాలయం ముందు ధర్నా



నవతెలంగాణ-కంటోన్మెంట్

పట్టు రైతుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ డిమాండ్ చేశారు. తెలంగాణ పట్టు రైతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ తిరుమలగిరిలోని రాష్ట్ర పట్టుగూళ్ళ డైరెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా శోభన్ మాట్లాడుతూ.. పట్టు రైతులకు తిరుమలగిరి పట్టు మార్కెట్‌లో చాలా కాలంగా అన్యాయం జరుగుతోందన్నారు. మధ్యవర్తులు, అధికారులు సరైన ధర ఇవ్వకుండా రైతులకు నష్టం చేకూర్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి రైతులకు ప్రోత్సాహం, షెడ్ సబ్సిడీ, పని యంత్రాలు అందించాలని కోరారు. పట్టు రైతులకు మార్కెట్‌లో తగిన సదుపాయాలు కల్పించాలని, కనీస ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. పట్టు రైతుల పట్ల మార్కెట్ అధికారులు వ్యవహరించే తీరు పూర్తిగా మారాలని కోరారు. పట్టుగూళ్లకు ఆంధ్ర, కర్నాటక మార్కెట్లతో సమానంగా తిరుమలగిరి, జనగామ మార్కెట్‌లలో ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే, పట్టుగూళ్ళ అమ్మిన రోజే రైతు ఖాతాలో డబ్బులు జమ చేయాలని, జల్లిగూళ్ల నుంచి పట్టుగూళ్ల ధరలు 1/3 రేటు, డబుల్ గూళ్లకు 1/2 ధర ఇవ్వాలని అన్నారు. 2018 నుంచి రైతులకు రావాల్సిన ప్రోత్సాహక కమిషన్ రూ.75ను వెంటనే విడుదల చేయాలన్నారు. మినీట్రాక్టర్, ఇతర పట్టు వ్యవసాయ యంత్ర పరికరాలు, పట్టుపురుగుల రోగనిరోధకాలను 80 శాతం సబ్సిడీతో రైతులకు అందించాలని కోరారు. తెలంగాణ సెరికల్చర్ విభాగంలో ఉద్యోగ విరమణ పొందుతున్న శాస్త్రవేత్తలు, ఉద్యోగుల స్థానంలో కొత్త వారిని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. అలాగే, రాష్ట్రంలో చాకి సెంటర్‌లను పెంచడం, పట్టుగూళ్ల డ్రయినేజీని వెంటనే ప్రారంభించాలని కోరారు. అనంతరం సహాయ కమిషనర్ సుధాకర్, మార్కెట్ అధికారి ఎం.శివకుమార్‌ను కలిసి వినతపత్రం అందజేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎస్.శ్రీధర్ రెడ్డి, మెరిండ్ల శ్రీనివాస్, పట్టు రైతులు ప్రవీణ్‌రెడ్డి, సక్రు అక్కిరం, అభిమన్య రెడ్డి, మండల రాజు, రఫిక్,రవీందర్, దేవిలల్, వినోద్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 8
ఎల్బీనగర్
గురువారం 25 మే 2023

మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్‌గా కిరణ్ కుమార్



నవతెలంగాణ - మీర్‌పేట్

మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మద్ది మహేందర్ రెడ్డి ఘట్కేసర్‌కు బదిలీపై వెళ్లారు. పహాడిషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కె. కిరణ్ కుమార్ మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బదిలీ అయిన మద్ది మహేందర్ రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతోనే ఎలాంటి ఇబ్బందులు లేకుండా పని చేశానని.. సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తర్వాత నూతన బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఎవరికీ ఎలాంటి ఇబ్బందులున్నా పోలీసులు అందుబాటులో ఉంటారని తెలిపారు. నిరంతరం ప్రజల సేవలో మేముంటామని హామీఇచ్చారు.

పడుకున్న చిన్నారిపై ఎక్కిన కారు.. అక్కడికక్కడే మృతి



నవతెలంగాణ-హయత్‌నగర్

పడుకున్న చిన్నారిపైకి కారు ఎక్కడంతో బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషాద ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక బీదర్ కు చెందిన కవిత దంపతులు బతుకు దెరువు కోసం నగరానికి వలస వచ్చి బీఎన్ రెడ్డి నగర్ లో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. దంపతులు రోజు మాదిరిగానే హయత్ నగర్‌లోని లెక్చరర్స్ కాలనీ లో ఉన్న బాలాజీ అపార్ట్మెంట్ వద్ద నూతన భవనానికి స్లాబ్ వేసే పనికి వెళ్లారు. ఆ సమయంలో వారి కూతరు లక్ష్మీ(3)ని పక్కనున్న అపార్ట్మెంట్ సెల్లర్‌లో అక్కడే ఉన్న వాచ్ మెన్ కు చెప్పి నిదుర బుచ్చి దంపతులు పనిలో నిమగ్నమయ్యారు. కొంత సేపటికి అందులో నుంచి ఒక వ్యక్తి తన కారును బయటికి తీస్తున్న క్రమంలో బాలికను గమనించలేదు. కారు వెనుక టైర్ ను బాలిక పై నుంచి వెళ్లింది. దాంతో బాలిక అక్కడికక్కడే మృతి చెందగా.. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



- మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ - మీర్ పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 31, 32, 36వ డివిజన్లలో జరుగుతున్న ఎస్ఎన్డీపీ పనులను బుధవారం మేయర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురికితో కలుషితం అవుతున్న చెరువులను కబ్జాకు గురికాకుండా వాటిని సుందరీకరణ చేస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలం రాకముందే చెరువుల సుందరీకరణ పనులు, ఎస్ఎన్డీపీ నాలా పనులు పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు లోపించకూడదని హెచ్చరించారు. మంత్రాల చెరువు పక్కన వీది వ్యాపారుల కోసం నిర్మాణం చేస్తున్న షెడ్డును తొందరలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 31వ డివిజన్‌లో అంతర్గత రోడ్ల (సీసీ,బీటీ) నిర్మాణానికి రూ 1.50లక్షలు మంజూరు చేసినందుకు మంత్రి సబితా ఇంద్రారెడ్డికి స్థానిక కార్పొరేటర్ విజయ లక్ష్మీ రాజ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ సిద్దాల లావణ్య, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్, డీఈ గోపీనాథ్, కార్పొరేటర్లు విజయ లక్ష్మీ రాజ్ కుమార్, వేముల నర్సింహా, కో ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎన్డీపీ నిధులతో వరద కాల్వల పనులు చేపట్టాం

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

వర్షా కాలంలో వరద నీటితో ఇబ్బందులు పడుతున్న వివిధ కాలనీల ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎస్ఎన్డీపీ నిధులతో వరద కాల్వల నిర్మాణ పనులను చేపట్టినట్లు విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొంతమోని కుంట నుండి నబిల్ కాలనీ, డ్రీమ్ సిటీ, గ్రీన్ సిటీ పరిసర ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న ఎస్ఎన్డీపీ నాలా పనులను బుధవారం మంత్రి సబితా ఇంద్రారెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సహకారంతో ఇప్పటికే రూ.12వందల కోట్ల నిధులతో వరద కాల్వల నిర్మాణ పనులను చేపట్టడం జరిగిందన్నారు.

రెండేళ్ల కిందట భారీ వర్షాలకారణంగా వరద నీరు, డ్రైనేజీల నీరు వివిధ కాలనీలలో ప్రవహించడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారనే విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరు చేయటం జరిగిందని గుర్తుచేశారు. ఆ నిధులతో నాలా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలోని సున్నం చెరువు నుండి వరద నీటి నాలా నిర్మాణ పనుల కోసం రూ. 60 కోట్ల నిధులకు ప్రతి పాదనలు చేసినట్లు తెలిపారు. అందులో రూ.8 కోట్ల రూపాయల నిధులతో పనులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్, జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా బిన్ సాది, కమిషనర్ వసంత, డీఈఈ వెంకన్న, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ డీఈఈలు అశోక్ రెడ్డి, జ్యోతి, అధికారులు బాలాపూర్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు గుండోజి రఘునందన్ చారి, అరవింద్ గౌడ్, సురేష్ గౌడ్, అశ్విన్ రెడ్డి సుమంత్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ఎస్కే ఖలీల్ పాషా, జల్‌పల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లు శంషోద్దీన్, కో ఆప్షన్ సభ్యులు బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, జల్‌పల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎగ్బాల్ బిన్ ఖలీఫా, సోషల్ మీడియా కన్వీనర్ సాంబశివ, వివిధ కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ, బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల పరిధి మీర్ పేట్ గ్రామంలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 46,61లో ఉన్న భూ సమస్యను పరిష్కరించాలని అంబేద్కర్ యువజన సంఘం కోరింది. ఈ విషయంపై బుధవారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బాలాపూర్ మండల కార్యాలయంలో తహశీల్దార్ జనార్ధన్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీర్ పేట్‌లోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 46,61లో ఎంతో కాలంగా ఎస్సీలు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమిలో పార్క్ కోసం 2 ఎకరాల భూమిని కేటాయిస్తామని 8 ఎకరాలు కేటాయించారని తెలిపారు. పార్క్ కోసం 8 ఎకరాలు కాకుండా 2 ఎకరాలు కేటాయించి...మిగతాది ఎస్సీ కులస్తులకు ఇంటి స్థలాలను కేటాయించాలని కోరారు. దీంతో పేదలైన ఎస్సీలకు న్యాయం జరుగుతుందన్నారు. అంతేకాదు ఈ చెరువు భూమిని సర్వే చేయించి అన్యాక్రాంతం కాకుండా దళిత పేద ప్రజలకు దక్కే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు దాసరి బాబు, సీఐటీయూ బాలాపూర్ మండల కన్వీనర్ పెంటయ్య, నాయకులు వెంకన్న, నర్సింహా, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డ వివాహానికి
అండగా ఉప్పల ఫౌండేషన్



నవతెలంగాణ -నాగోల్

పేదింటి ఆడబిడ్డ వివాహానికి ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ , ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాసగుప్త సహాయ సహకారాలు అందించి అండగా నిలిచారు. నగరంలోని పురాణపూల్‌కు చెందిన నిరుపేద ఆడబిడ్డ వైష్ణవి వివాహానికి సాయం చేయాలని కోరుతూ ఆమె కుటుంబ సభ్యులు బుధవారం నాగోల్‌లోని శ్రీనివాస గుప్తా నివాసంలో ఆయనను కలిసి కోరారు. స్పందించిన శ్రీనివాస గుప్తా మంగళసూత్రం, మెట్టెలు, గాజులు, చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెళ్లికూతురు తల్లీదండ్రులు, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానందం గుప్త, వి అంజిరెడ్డి, టి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు
సామ రంగారెడ్డిని అరెస్టు చేయాలి

- సంపూర్ణ థియేటర్ వాటాదారుడు సామ జంగారెడ్డి



నవతెలంగాణ-వనస్థలిపురం

రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ పార్టీ అధ్యక్షుడు సామ రంగారెడ్డిని అరెస్టు చేయాలని సంపూర్ణ థియేటర్ వాటాదారుడు సామ జంగారెడ్డి డిమాండ్ చేశారు. వనస్థలిపురం సంపూర్ణ థియేటర్‌లో తాను 15 శాతం వాటా దారుణ్ణి అని, పది ఏళ్లుగా లావాదేవీలు చూపించకపోవడంతో ఏషియన్ ఆఫీస్‌కు వెళితే అసలు నిజాలు బయట పడ్డాయని వాటాదారుడు సామ జంగారెడ్డి తెలిపారు. బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టు ఆదేశాల మేరకు రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ పార్టీ అధ్యక్షుడు సామ రంగారెడ్డిపై వనస్థలిపురం పోలీస్ స్టేషన్లో 120బి, 406, 420, 427, 504, 506 ఐపిసి,156(3) సెక్షన్ కింద కేసు నమోదు అయిందని వివరించారు. తర్వాత ఆ ఎఫ్ఐఆర్ కాపీని విలేకరులకు అందజేశారు. పోలీసులు ఈ నెల 4న కేసు నమోదు చేసినా.. ఇప్పటి వరకు అరెస్టు చేయకపోవడానికి కారణాలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఏషియన్ మేనేజింగ్ పార్ట్నర్ సామ రంగారెడ్డి సంపూర్ణ థియేటర్ పై వారానికి రెండు లక్షలా ఇరవై వేలు వస్తున్నా..వాటాదారులకు మాత్రం లక్ష ఇరవై వేలు వస్తున్నాయని చెప్పి మోసం చేశాడని ఆరోపించారు. ఈ థియేటర్‌లో 960 సీట్లు ఉండగా ఎంసీఎల్ లెక్కలు చూపకుండా, పార్కింగ్, క్యాంటీన్ డబ్బుల్లో సగ భాగం లెక్కల్లో చూపకుండా మోసానికి పాల్పడుతున్నాడని థియేటర్ వాటాదారుడు సామ జంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు.

థియేటర్‌కు చెందిన రహదారిని ఆక్రమించి అగర్వాల్ స్వీట్ హోమ్‌కు అద్దెకు ఇచ్చి అడ్వాన్స్‌గా ఐదు లక్షలు, ప్రతి నెల 40 వేలు కిరాయి వసూలు చేస్తూ లెక్కలు చూపించడం లేదని మండిపడ్డారు. సామ రంగారెడ్డి చేస్తున్న మోసాలపై గతంలో వనస్థలిపురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేస్తే.. పోలీసులు సివిల్ కేసుగా పరిగణించి కోర్టుని ఆశ్రయించాలని చెప్పడంతో కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. దీంతో కోర్టు ఆదేశాల మేరకు 4వ తేదీన సామ రంగారెడ్డిపై పలు సెక్షన్లతో పోలీసులు కేసు నమోదు చేశారని గుర్తుచేశారు. కానీ ఇంతవరకూ సామ రంగారెడ్డిని ఎందుకు అరెస్ట్ చేయలేదని పోలీసులను ప్రశ్నించారు.

ఎల్బీనగర్ నియోజకవర్గం పార్కులకు నిలయం

- కార్పొరేటర్ బానోత్ సుజాతా నాయక్



నవతెలంగాణ - హస్తినాపురం

ఎల్బీనగర్ నియోజకవర్గం పార్కులకు నిలయం అని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోత్ సుజాతా నాయక్ అన్నారు. డివిజన్‌లోని దత్త నగర్ కాలనీలో బుధవారం కార్పొరేటర్ పర్యటించారు. పార్క్ అభివృద్ధి అవసరాల కోసం నూతనంగా వేస్తున్న వాటర్ బోర్‌ను కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. ఎల్బీనగర్ డివిజన్ పరిధిలోని పలు డివిజన్‌లలో పార్కుల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి తన ముందు చూపుతో ఎంతో అభివృద్ధి చేశారని అన్నారు. దత్త నగర్‌కాలనీలో ఏర్పాటు చేయబోయే పార్క్ అభివృద్ధికి ఎమ్మెల్యే సహకారంతో హైదరాబాద్ మెట్రో డెవలప్మెంట్ అథారిటీ వారు రూ. 85 లక్షలు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. కార్పొరేటర్‌తో హైదరాబాద్ మెట్రో డెవలప్మెంట్ అథారిటీ అసిస్టెంట్ ఇంజనీర్ జీవన్ రెడ్డి, దత్తానగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు గోపాల్, అభిషేక్, కనకదుర్గ, ఎల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పద్మిని, ఆదిలక్ష్మి, రోహిత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రతీ శివారు ప్రాంతానికి నీరందిస్తాం

- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



నవతెలంగాణ-ఎల్బీనగర్

ప్రతి శివారు ప్రాంతానికి తాగు నీటిని అందిస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బుధవారం ఎల్బీనగర్ వాటర్ వర్క్స్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి కాలంలో వాటర్ పొల్యూషన్ ఎక్కడ జరుగుతుందో తెలుసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రజల అవసరాల దృష్ట్యా వారికి ఇబ్బందులు లేకుండా చిన్న, చిన్న వాటర్ లైన్స్ ఎక్కడ అవసరమో తెలుసుకొని అక్కడ పైప్స్ వేయాలని సూచించారు.

కొన్ని చోట్ల యూజీడీ లైన్స్ పక్కనే వాటర్ లైన్స్ ఉండడం వలన నీరు కలుషితమవుతుందని తెలిపారు. కావున ఆ ప్రాంతాలను గుర్తించి..దేనికిదానికి సెపరేట్ చేయాలని కోరారు. అలాగే పక్క ప్రణాళికలు సిద్ధం చేసి ఒక నివేదిక తయారు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఒక్క ఇంటికీ మంచినీరు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. యూజీడీ వ్యవస్థ సరిగ్గా లేని కాలనీల్లో కూడా నూతన డ్రైన్స్ పైప్ లైన్ నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. అలాగే గత వరదల్లో కొన్ని కాలనీల యందు యూజీడీ వ్యవస్థ దెబ్బతిన్న నేపథ్యంలో మళ్లీ డ్రైనేజీ వ్యవస్థను పునర్నిర్మాణం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ సర్కిల్ 10బి వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ వినోద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల కమీషన్‌గా 'దళిత బంధు'

- ప్రశ్నించే వారిపై దాడులకు పాల్పడడం హేయమైన చర్య
- అడ్వకేట్ యుగంధర్‌ను పరామర్శించిన వైఎస్ షర్మిల



నవతెలంగాణ-బోడుప్పల్


దళిత బంధు పథకం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల కమీషన్ బంధుగా మారిందని వైఎస్ఆర్టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే గాధరి కిషోర్ కుమార్ అనుచరుల దాడిలో గాయపడి బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అభయ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న అడ్వకేట్ యుగంధర్ ను బుధవారం ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా షర్మిల దాడి ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ..తెలంగాణలో ప్రజాస్వామ్యం అనేది లేకుండా పోయిందని, అధికార పార్టీ నేతల తప్పిదాలను ఎవరైనా ప్రశ్నిస్తే భౌతిక దాడులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే గాధరి కిషోర్ కుమార్ దళిత బంధు పథకంలో జీఎస్టీ పేరిటా లక్షలాది రూపాయలను కమీషన్ పొందారని, అదే విధంగా ఇసుక మాఫియాతో చేతులు కలిపి కోట్లాది రూపాయలు కూడపెట్టిన అంశంపై సామాజిక బాధ్యత కలిగిన పౌరునిగా, అడ్వకేట్ గా ఎమ్మెల్యే అక్రమాలపై ఆధారాలతో సహా ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేయడంతో సహించలేని ఎమ్మెల్యే అతని అనుచరులతో విచక్షణ రహితంగా దాడిచేసి గాయపరిచారని ఆరోపించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఇంత వరకూ ఎలాంటి చర్యలు తీసు కోకపోవడం చూస్తుంటే...పోలీసులు ఎవరి పక్షాన పని చేస్తున్నారో అర్థం అవుతుందని అన్నారు. ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అక్రమాలపై దర్యాప్తు జరిపి అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సంస్కార హీనుడు రేవంత్ రెడ్డి...

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సంస్కారహీనుడని షర్మిల మండిపడ్డారు. ఆంధ్ర ప్రాంతంలో రాజకీయం చేసుకోవాలని తనకు సూచనలు ఇచ్చే రేవంత్ రెడ్డి.. ముందు సోనియా గాంధీ ఎక్కడ నుండి వచ్చిందో చెప్పాలని నిలదీశారు. భారత దేశంలో ఎవరైనా ఎక్కడైనా ప్రజల తరపున పోరాటం చేయవచ్చు అనే కనీస ఇంగితజ్ఞానం లేదా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డితో పాటు ఇతర పార్టీల నేతలకు వైఎస్ఆర్టీపీ అంటే భయం పట్టుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్టీపీ నేతలు పిట్లం కృష్ణా రెడ్డి, సత్య తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- కార్పొరేటర్ బన్నాల గీత



నవతెలంగాణ-ఉప్పల్

డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని, నిధులు మంజూరైనటువంటి పనులకు టెండర్లు పిలవాలని చిలకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ కోరారు. ఈ మేరకు బుధవారం జోనల్ కమిషనర్ పంకజను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని ఈస్ట్ కళ్యాణపురి కమ్యూనిటీ హాల్ అదనపు అంతస్తులోని పెండింగ్ పనులకు, సీతారామ కాలనీలో స్ట్రాంగ్ వాటర్ లైన్ వేసినటువంటి ప్రాంతాల్లో సీసీ రోడ్ల కోసం, కుమ్మరి సంఘం స్మశాన వాటికలో మౌలిక సదుపాయాల కోసం, ఇటీవల ప్రభుత్వం రాఘవేంద్ర నగర్ కమ్యూనిటీ హాల్ కోసం మంజూరు చేసిన 250 గజాల స్థలానికి ప్రహరి గోడ నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరారు. టెండర్లను కోడ్ చేసి పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించేలా ఆదేశాలు జారీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, బాన్నాల నారాయణరెడ్డి, ఎండీ మహమూద్, ఎండీ షఫీ, ఎండీ గౌస్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల తరపున నిలబడతాను

- బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి



నవతెలంగాణ-సంతోష్‌నగర్

ఇండ్ల స్థలాల మంజూరు విషయంలో ఎల్బీనగర్ వర్కింగ్ జర్నలిస్టుల తరపున నిలబడతానని రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. బుధవారం ఎల్బీనగర్‌లో వర్కింగ్ జర్నలిస్టు జాక్ ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్ సమావేశంలో సామ రంగారెడ్డి మాట్లాడారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఇండ్ల పంపిణీ విషయంలో పోరాటం చేసేందుకు ముందు వరుసలో ఉంటానని హామీ ఇచ్చారు. సుదీర్ఘ కాలం తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సూచించడం భాగానే ఉంది కానీ.. ఆ విషయాన్ని నీరుగార్చే ప్రయత్నం అటు ప్రభుత్వం ఇటు స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిలు చేస్తున్నారని ఆరోపించారు. మరోపక్క స్థానిక ఎమ్మెల్యే చేస్తున్న భూ కబ్జాలకు అంతూ పంతూ లేకుండా పోయిందని ఘాటుగా విమర్శించారు.

జర్నలిస్టులకు ఇచ్చే ఇండ్ల స్థలాలను కూడా మాయం చేసే పనిలో పడ్డారని సుధీర్ రెడ్డిని దుయ్యబట్టారు. కేవలం 100 మంది జర్నలిస్టులకు న్యాయం జరగకపోతే ఇంకె వ్వరికీ న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. మానవత్వం లేని ఎమ్మెల్యేగా గుర్తింపు తెచ్చుకోవడంలో సుధీర్ రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయారని విమర్శించారు. ఇప్పటికే ప్రభుత్వం ఆయా నియోజక వర్గాలకు బాధ్యత అప్పగిస్తే..ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాత్రం అందుకు భిన్నంగా కాలయాపన చేస్తూ ముందుకు సాగడం సమంజసం కాదని అన్నారు. అటు డబుల్ బెడ్ రూమ్, ఇటు ఇండ్ల స్థలాల కేటాయింపులో జర్నలిస్టులకు న్యాయం జరగకపోవడం విచారకర మన్నారు. ప్రశ్నించే వారి పక్షాన నిలబడా ల్సింది పోయి అక్రమార్కుల పక్కన చేరి వక్ర మార్గాన డబ్బు వేటలో పడ్డారని విమర్శించారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్ ప్రజలు నీకు తిరగబడే రోజు రాబోతుందని హెచ్చరించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ప్రజల్ని కోరారు.

'రాష్ట్రస్థాయిలో నెంబర్ వన్‌గా నిలవాలి'



నవతెలంగాణ -ఘట్కేసర్

క్రీడల్లో ఘట్కేసర్ మండలం రాష్ట్రస్థాయిలో కూడా నెంబర్ వన్‌గా నిలవాలని సీఎం కప్ చైర్మన్, ఘట్కేసర్ మండల ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఘట్కేసర్ మండల్ ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం సీఎం కప్ జిల్లాస్థాయి టోర్నమెంట్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపొందిన వారిని సన్మానించుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నానని ఆనందరం వ్యక్తం చేశారు. ప్రతి గ్రామానికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తున్నానని తెలిపారు. చౌదరిగూడ గ్రామంలో క్రీడాకారులకు సంబంధించి వైయస్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో నాలుగు లక్షల రూపాయలతో సీసీ రోడ్ నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు. ప్రతి గ్రామానికి క్రీడా సామాగ్రి, బహుమతులను ఏదో విధంగా మా వంతు సహాయ సహకారాలు అందిస్తూనే ఉన్నామన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ నందకిషోర్, ఎంపీటీసీలు గట్ట గళ్ళ రవి, కుమ్మిడి శోభారాణి, పీటీలు తిరుమల్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, యుగంధర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను కన్నీళ్లు పెట్టించిన ప్రభుత్వాలు నాశనం



నవతెలంగాణ - ఘట్కేసర్

రైతులను కన్నీళ్లు పెట్టించిన ప్రభుత్వాలు నాశనమయ్యాయని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మండల పరిధిలో ఎదులాబాద్ వరిధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద బుధవారం మండల కాంగ్రెస్ శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులను ఇబ్బందులకు గురిచేసిన ప్రభుత్వాలు బాగుపడినట్లు చరిత్రలో లేదన్నారు. ఘట్కేసర్ మండలంలోని మూడు వరి ధాన్యం కొనుగోలు కేంద్రా లలో రైతులు అవస్థలు పడుతుంటే..ఈ ప్రాంత ఎమ్మెల్యే, మంత్రి మల్లారెడ్డిలు మాత్రం ఇటువైపు కన్నెత్తి చూడలేదని ఆరోపించారు. ఈ ప్రాంతంలో భూములు కొనాలంటే ముందుకు వచ్చే మంత్రి.. ధాన్య సేకరణలో ఆలస్యమైతే ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. తడిసిన ధాన్యం కొంటామని చెప్పిన ముఖ్యమంత్రి మాటకే దిక్కులేదని విమర్శించారు. రాష్ట్రంలో అవినీతి, రాక్షస పాలన కొనసాగుతుందన్నారు. తర్వాత ధాన్య సేకరణలో ఎందుకు ఆలస్యం అవుతుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మూడు రోజులలో ధాన్యం కొనుగోలు చేయకుంటే ఆమరణ నిరాహారదీక్షకు పూనుకుంటానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్రె రాజేష్, వైఎస్ ఎంపీపీ కర్రె జంగమ్మ, ఘణపురం సర్పంచ్ బద్దం గోపాల్రెడ్డి, ఎంపీటీసీ గట్టగల్ల రవి, సింగిల్‌విండో ఉదయ్కుమార్రెడ్డి, నాయకులు బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, అమరేందర్ రెడ్డి, రాజిరెడ్డి, ఓంప్రకాష్, మెట్టు రమేష్, జవ్వాజీ సత్తయ్య అనిల్, సురేష్నాయక్, పుర్రు బస్వయ్య, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ వర్క్స్ అధికారులతో కార్పొరేటర్ సమావేశం

నవతెలంగాణ-ఓయూ



శ్రీనివాస్‌నగర్‌లోని వాటర్ వర్క్స్ కార్యాలయంలో అధికారులతో బుధవారం సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. డివిజన్‌లో లో ప్రెజర్ వాటర్ ఫిర్యాదులు, ఓవర్ ఫ్లో ఫిర్యాదులు రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెండిగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం కృష్ణ, మేనేజర్ నవ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల్లేకుండా అన్ని చర్యలు చేపట్టిన ప్రభుత్వం

నవతెలంగాణ-బేగంపేట



గోషామహల్ నియోజకవర్గంలో సమస్యలు లేకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ నందకిషోర్ వ్యాస్ బిలాల్ అన్నారు. బుధవారం మంత్రి తలసాని శ్రీనివాస్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం నందకిషర్ మాట్లాడుతూ., గోషమాయిల్ నియోజకవర్గంలో సమస్యలను ఉన్నాయని, వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అలాగే మోడల్ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని మంత్రిని కోరగా అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి వెంటనే నిర్మాణానికి తనవంతు కషి చేస్తానని చెప్పారన్నారు. హనుమాన్ దుర్గా జై, రోహిత్ కుమార్ జై, అరవింద్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే పరీక్షలు చేయించుకోవాలి

- క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులను సద్వినియోగం చేసుకోవాలి
- నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

నవతెలంగాణ-సిటీబ్యూరో



పారిశుధ్య కార్మికులు క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులను సద్వినియోగం చేసుకోవాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. జీహెచ్ఎంసీలోని అన్ని జోన్లలో సర్కిళ్ల వారీగా పారిశుధ్య కార్మికులకు క్యాన్సర్ డిటెక్షన్ (గుర్తింపు)ను సీ.ఎస్.ఆర్ కింద కార్కినోస్ కార్పొరేట్ బాడీ భాగస్వామ్యంతో నిర్వహిస్తుందని తెలిపారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం.12 సీ.ఎం.టి.ఇ.ఎస్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు కార్కినోస్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీలోని ప్రతీ సర్కిల్‌లో ఆరు రోజుల పాటు క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులను మధ్యాహ్నం 12 గంటల నుంచి నిర్వహిస్తారని తెలిపారు. పారిశుధ్య కార్మికులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పారిశుధ్య కార్మికులు క్యాన్సర్ టెస్టుల కోసం ప్రయివేటు ఆస్పత్రుల వద్దకు వెళ్లకూడదని, ప్రభుత్వ ఆస్పత్రులుచ ఈ.ఎస్.ఐ ఆస్పత్రిలో టెస్టులు చేయించుకోవాలన్నారు. క్యాన్సర్ వైద్యం ఖరీదైనదని, ప్రయివేటు ఆస్పత్రుల్లో చేరి తమ డబ్బులు వధా చేసుకోకూడదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల కోసం ప్రత్యేకంగా బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసిందని.. అందులో 40 రకాల టెస్టులను ఉచితంగా చేస్తున్నారని, అదే ప్రయివేటులో అయితే అత్యంత ఖరీదైనదన్నారు. బంజారాహిల్స్ ఎన్.బీ.టీ.నగర్, ఎన్.బీ నగర్‌లో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్కినోస్ ద్వారా డయాగ్నోస్ చేయబడిన అనంతరం బయాప్సి ఆధారంగా సంబంధిత ఆస్పత్రిలో రెఫర్ చేసి వైద్యం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్యాన్సర్ వ్యాధికి అన్ని రకాల మందులు వచ్చాయని, ఎవరూ కూడా ఆందోళన చెందవద్దని చెప్పారు. పారిశుధ్య కార్మికులు ఉదయం 5:45 గంటలకు రోడ్ల ఊడ్చే కార్యక్రమాన్ని ప్రారంభించాలని, బయోమెట్రిక్ పాటించాలని తెలిపారు. వారి విధులు నిర్వహించిన అనంతరం క్యాన్సర్ టెస్టుల కేంద్రాలకు హాజరు కావాలన్నారు. అనంతరం కార్కినోస్‌లో సలహాదారు డాక్టర్ శ్రీరాం సిప్లా మాట్లాడుతూ క్యాన్సర్ నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. విశ్వనాథ్ క్యాన్సర్ కేర్ ఫౌండేషన్‌తో భాగస్వామ్య మిషన్‌లో కలిసి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో భాగస్వామ్యం అవుతున్నామని అన్నారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్యంపై దష్టి పెట్టి క్యాన్సర్ అవగాహన పెంపొందించడం, ముందస్తుగా గుర్తించి చికిత్స అందించడం ఎంతో మంచిదన్నారు. వ్యక్తుల ఇంటికి దగ్గరగా సమగ్ర క్యాన్సర్ సంరక్షణను అందించే లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. పూర్తి సమాచారం కోసం ఝఝఝ.ఝతీసఱ-అశీం.ఱఅని సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవికిరణ్, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్, సీ.ఎం.ఓ.హెచ్ పద్మజ, అంకాలజిస్ట్ డా.స్రవంతి, డా. కామాక్షి, డా.సనా ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

ఐవీఎఫ్ ద్వారా గర్భం దాల్చిన జంటలకు సత్కారం



నవతెలంగాణ-సిటీబ్యూరో

సికింద్రాబాద్ ఐవీఎఫ్ ద్వారా గర్భం దాల్చిన జంటలను ఒయాసిస్ ఫెర్టిలిటీ క్లినిక్ బుధవారం సత్కరించింది. అనంతరం సామూహిక సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఒయాసిస్ ఫెర్టిలిటీ క్లినికల్ క్లినిక్ హెడ్ అండ్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ పరీనాజ్ పర్వార్ మాట్లాడుతూ తల్లులందరికీ తన హదయపూర్వక శుభాకాంక్షలు చెప్పారు. జంటలు తల్లిదండ్రులు కావాలనే వారి కలలను ఒయాసిస్ ఫెర్టిలిటీలో సహాయపడటానికి అధునాతనమైన సంతానసాఫల్య చికిత్సలను అందిస్తున్నామని తెలిపారు. వయస్సుతో పాటు సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గుతూ వస్తుందని.. అందువలన సంతానం కోరుకునే జంటలు ఎటువంటి ఆలస్యం లేకుండా సంతానసాఫల్య చికిత్స సహాయాన్ని పొందడం చాలా ముఖ్యమని సూచించారు. ఆండ్రోల్యాఫ్ అనేది పురుషుల కోసం ప్రత్యేకమైన సంతానసాఫల్య క్లినిక్‌లు అని.. వీటి ద్వారా తక్కువ స్పెర్మ్ కౌంట్ ఉన్న పురుషులు కూడా మైక్రోటీఈఎస్ఈ వంటి అత్యాధునికమైన స్పెర్మ్ రిట్రీవల్ టెక్నిక్‌లను ఉపయోగించి పితత్వాన్ని సాధించేలా చేస్తామని చెప్పారు. ఫెర్టిలిటీ ప్రిజర్వేషన్ వంటి అధునాతన పద్ధతుల ద్వారా క్యాన్సర్ రోగులు తమ క్యాన్సర్ చికిత్సలకు ముందు సంతాన సాఫల్యతను కాపాడుకోవడం ద్వారా తల్లిదండ్రులు అయ్యే అవకాశాన్ని పదిలం చేసుకోవచ్చు అన్నారు. హెల్త్ కేర్ సర్వీసెస్ ప్రయివేటు లిమిటెడ్లో భాగమైన ఒయాసిస్ సెంటర్ ఫర్ రీప్రొడక్టివ్ మెడిసిన్ అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన అత్యుత్తమ వైద్య నియమావళిని, పద్ధతులను అందుబాటులోకి తీసుకురాడం ద్వారా దక్షిణ భారతదేశంలో సంతాన సాఫల్యానికి ఒక సరి కొత్త నిర్వచనం ఇచ్చింది. 2009లో స్థాపించినప్పటి నుంచి ఒయాసిస్ అంతర్జాతీయ అనుభవంతో అత్యంత అనుభవజ్ఞుల్కైన ఇన్ఫెర్టిలిటీ స్పెషలిస్ట్‌ల బందం నేతత్వంలో అధిక నాణ్యత సేవల ద్వారా నడిచే అధిక విజయాల రేట్‌తో అద్భుతమైన ఖ్యాతిని పొందింది. ఒయాసిస్‌కు ప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, ఝార్ఖండ్, గుజరాత్, మహారాష్ట్ర శా రాష్ట్రాలలో ప్రస్తుతం 30 కేంద్రాలు ఉన్నాయని వారు పేర్కొన్నారు.

నాగారం మున్సిపల్ అభివద్ధికి రూ.100 కోట్లు మంజూరు చేయండి



నవతెలంగాణ-మేడ్చల్‌కలెక్టరేట్

నాగారం మున్సిపల్ అభివద్ధికి రూ.100 కోట్లు మంజూరు చేయాలని కోరుతూ సీఎం కేసీఆర్‌ను నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి మల్లారెడ్డితో కలిసి ఆయన సీఎం కేసీఆర్‌ను సెక్రటేరియేట్‌లో కలిసి మున్సిపల్ అభివద్ధి కి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అందుకు సీఎం సానుకూలంగా స్పందిస్తూ అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. నాగారం మున్సిపల్ వైస్ చైర్మెన్ బి.మల్లేష్ యాదవ్ ,కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్ ,బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్ ,వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్ ,అన్నంరాజు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

యువతలో పెరుగుతున్న ప్రీడయాబెటిక్

- 18 ఏండ్లుపైబడిన 96 మిలియన్ల మందిలో...
- నివారణకు జాగ్రత్తలు తీసుకుంటే షుగర్‌కు దూరం

నవతెలంగాణ-సిటీబ్యూరో



డయాబెటీక్ లేదా షుగర్ భారతదేశాన్ని పీడిస్తున్న వ్యాధుల్లో ముఖ్యమైన వ్యాధి. అయితే చాలా మందిలో ప్రిడయాబెటిక్ ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఇటీవల కాలంలో యువతలో ప్రిడయాబెటిక్ కేసులు పెరుగుతున్న డాక్టర్లు చెబుతున్నారు. 2019 లెక్కల ప్రకారం... 18 ఏండ్ల పైబడిన 96 మిలియన్ల మందిలో ప్రిడయాబెటిక్ ఉన్నట్టు కనుగొన్నారు. డయాబెటీస్ ఒకసారి వస్తే దాన్ని నివారించలేం. జీవితాంతం మందులు వాడాల్సిందే. కానీ ప్రిడయాబెటిక్ అలా కాదు. దాన్ని గుర్తిస్తే నివారించడంతో పాటు భవిష్యత్తులో షుగర్ రాకుండా చికిత్స తీసుకునేందుకు వీలుంది. దీని పట్ల ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో ప్రిడయాబెటిక్ నుంచి డయాబెటిక్ వ్యాధి బారిన పడుతున్నారని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అనారోగ్యకరమైన భోజనం, చలనం లేని జీవనశైలి ప్రీడయాబెటిక్ రావడానికి ఎక్కువగా కారణమవుతున్నదని సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ కన్సల్టెంట్ ఎండోక్రైనాలజిస్ట్ డా.బి.ఆశిష్ రెడ్డి తెలిపారు. సాధారణ రక్త పరీక్ష ద్వారా ప్రిడయాబెటిక్ నిర్ధారించవచ్చని చెప్పారు. ఆరోగ్యకరమైన బరువు, సమతుల్యమైన భోజనం తినడం, సాధారణ శారీరక వ్యాయామం, ఎలివేటర్ బదులు మెట్లు ఎక్కడం వంటి చిన్న, చిన్న మార్పుల ద్వారా డయాబెటీస్ పెరిగే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని సూచించారు. తాజా పండ్లు, కూరగాయులు తీసుకోవడం అలవాటు చేసుకోవాలని పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



అన్ని కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పనకు కషి చేస్తానని 135 మచ్చ బొల్లా రం డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని బాలాజీ ఎంక్లేవ్, రుక్మిణి ఎన్క్లేవ్‌లోని శివం బాయ్ వద్ద సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను ఎమ్మెల్యే హనుమంతరావు సహకారంతో పూర్తి చేస్తానని తెలిపారు. డివిజన్ పరిధిలో అభివద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. ఆయా అభివద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించి, నిర్ణీత సమయానికి పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మహేష్, ఏఈ రవళి, స్వాతి ,ప్రభాకర్, సాంబయ్య డివిజన్ అధ్యక్షుడు బొబ్బిలి సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, రాజేందర్ యాదవ్, శ్రావణ ముదిరాజ్, పుట్నాల కృష్ణ, శోభన్, వెంకటేష్ యాదవ్, సతీష్ ,కాలనీవాసులు నరసింహారావు ,సత్యనారాయణ, నరసింహారెడ్డి ,లక్ష్మణ్ గౌడ్ ,లావణ్య కష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-కంటోన్మెంట్



మారేడుపల్లి శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి నూతన పాలకమండలి కమిటీ బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. కార్యక్రమానికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని పాలకమండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లు చేయడం ద్వారా ఆలయ అభివద్ధికి కషి చేయాలని సూచించారు. పాలకమండలి సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు, అర్చకులు సమన్వయంతో ఆలయ అభివద్ధి కోసం కషి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఆలయం ఎంతో అభివద్ధి చెందిందని తెలిపారు. ఆలయం ముందు ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్న రోడ్డు అభివద్ధి, డ్రయినేజీ సమస్యను తానే నిధులు మంజూరు చేయించి పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం కమిటీ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వేణుగోపాల చారి, నర్సింగ్ రావు, పద్మజ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని కార్పొరేటర్ పూజలు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



రుక్మిణి ఎన్క్లేవ్ శివం బావి వద్ద గల శ్రీశ్రీశ్రీ శివాంబిక సంకష్ట హర గణపతి శ్రీ అభయాంజనేయ దేవాలయంలో మచ్చబొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల శస్త్ర చికిత్స చేసుకున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తొందరగా కోలుకుని ప్రజలకు సేవచేయాలని ఆకాంక్షిస్తూ గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీ వాసులు, ఆలయ నిర్వాహకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన మాహిళను కాపాడిన పోలీసులు

నవతెలంగాణ-జవహర్‌నగర్



ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళ ప్రాణాలను జవహర్ నగర్ పోలీసులు కాపాడారు. ఈ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే ఓ మహిళ తన కుటుంబసభ్యులతో కలిసి బీజేఆర్ నగర్‌లో నివాసముంటుంది. భర్తతో విభేదాల కారణంగా గత 3 సంవత్సరాల నుంచి తల్లిదండ్రుల వద్దనే ఉంటున్నది. అయితే ఆమె బుధవారం 3గంటల సమయంలో పడకగదిలోకి వెళ్ళి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించడంతో కుటుంబసభ్యులు 100కు డయల్ చేశారు. వెంటనే స్పందించిన పెట్రోలింగ్ పోలీసులు కానిస్టేబుల్ ఎండీ ఇంతియాజ్ 2 నిమిషాల్లోనే ఘటన స్థలానికి చేరుకుని ఇంటి తలుపులు పగులగొట్టి మహిళను కిందికి దించి ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఆమెకు ఎలాంటి ప్రాణాపాయం లేకుండా క్షేమంగా బయటపడింది. మహిళ ప్రాణాలను కాపాడిన జవహర్‌నగర్ పోలీసులకు బీజేఆర్ నగర్ కాలనీ వాసులు అభినందనలు తెలిపారు.

విజయమేరీ హైస్కూల్‌లో మెరిసిన ఆణిముత్యాలు





నవతెలంగాణ-మల్కాజిగిరి

గౌతంనగర్ డివిజన్‌లోని విజయమేరి హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు గొప్ప పేరు ప్రతిష్టలు తీసుకవచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రేగల్ల భీష్మారెడ్డి మాట్లాడుతూ 2023 పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు 10/10 జీపీఏ సాధించి కార్పొరేట్ స్కూల్స్‌ను అధిగమించారని అన్నారు. 22 మంది విద్యార్థులకు పైగా ఏ1, ఏ2 గ్రేడులు సాధించిన ఏకైక విద్యాసంస్థ విజయ మేరి హైస్కూల్ అన్నారు. తనూజ 10/10 జీపీఏ సాధించగా నితిన్ 9.8 జీపీఏ సాధించారని, 9 జీపీఏతో 12 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనారని తెలిపారు. ప్రతీ సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా అద్భుత ఫలితాలను సాధించారని, నిరంతర పర్యవేక్షణ, క్రమశిక్షణ తమ ప్రత్యేకత అని తెలపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించింది.

మరకత శ్రీ లక్ష్మీ గణపతి స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



అల్వాల్ సర్కిల్ పరిధిలోని కానాజిగూడలో మరకత శ్రీ లక్ష్మీ గణపతి స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు, ఆలయ నిర్వహకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి నేతత్వంలో విశేష పూజలు, విశిష్ట అభిషేకాలు 32 ఔషధీకత ద్రవ్యాలతో అభిషేకాలు, లక్ష్మీ గణపతి మూల మంత్రము మరకత శ్రీ మహాలక్ష్మీ హెూమంలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్న ప్రసాద వితరణకు విరాళాలు అందజేసే భక్తులు ఆలయ కార్యాలయంలో తనను సంప్రదించాలని కోరారు.

గోనె సొలమోన్‌కు ఎమెల్సీ అవకాశం కల్పించాలి

- తెలంగాణ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు రెవ, డాక్టర్ ప్రసాద్

నవతెలంగాణ-మల్కాజిగిరి



బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనె సొల మోన్ రాజ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ఐఈహెచ్‌సి నేషనల్ డైరెక్టర్, తెలంగాణ పాస్టర్స్ ఫెలోషిప్ మల్కాజ్‌గిరి నియోజక వర్గం సభ్యులు రెవ, డాక్టర్ ఎం, ఎం. ప్రసాద్ బుదవారం ఒక ప్రకటనలో ముఖ్య మంత్రి కేసీఆర్‌ను కోరారు. సీఎం కేసీఆర్ అన్ని మతాలకు సమాన అవకాశాలు కల్పిస్తున్నా రని క్రైస్తవ కమ్యూనిటి నుంచి మంచి సంబంధాలు కొనసాగిస్తున్నారని అన్నారు. 33 జిల్లాల క్రైస్తవుల మధ్య ఐక్యతను తెచ్చి సమాజ, భద్రత శ్రేయస్సును పెంపొందించి, కమ్యూనిటి సమస్యలకు పరిష్కారం చూపిస్తు న్న గోనె సొల్‌మన రాజుకు ఎమ్మెల్సీ ఇవ్వాలని కోరారు.

మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్లకు మంత్రి శంకుస్థాపన

నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట



ఉప్పుగూడలోని మహంకాళి దేవాలయంలో గల ఖాళీ స్థలంలో అధునాతనమైన జీ ప్లస్ 3 మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను నిర్మించేందుకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతబస్తీలో ఇలాంటివి ఇంకా మూడు నాలుగు ఫంక్షనల్లుకు నిర్మిస్తామని తెలిపారు. పాతబస్తీలోని లాల్ దర్వాజా, ఉప్పుగూడ, ఛత్రినాక, గౌలిపుర ప్రాంతాలలో చాలామంది హిందువులు ఉన్నారని వాళ్లకు శుభకార్యాలు జరుపుకోవడానికి ఫంక్షన్ హాల్ లేక బండ్లగూడ, సంతోష్ నగర్, దూర ప్రాంతాలకు వెళుతున్నారని అన్నారు. అందుకుగాను ఈ ప్రాంతంలో వంక్షన్ హాళ్లను నిర్మిస్తామని తెలిపారు. అంతేకాకుండా పాతబస్తీలోని స్మశానవాటికలను కూడా ఆధునికరిస్తామని, బోనాల పండుగ నేపథ్యంలో రోడ్లు, డ్రయినేజీల మరమ్మతులు తొందరగా పూర్తి చేస్తామని అన్నారు. పాతబస్తీకి ఎన్ని కోట్లు ఖర్చుపెట్టినా తక్కువేనని అన్నారు. బోనాల పండుగ సందర్భంగా ప్రతీ దేవాలయానికి వేల కొద్ది రూపాయలు అభివద్ధికి ఇస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అశోక్ సామ్రాట్, ఉప్పుగూడ కార్పొరేటర్ సమద్ బిన్ అబ్దుల్, ఉమ్మడి దేవాలయాల ఉత్సవాల మాజీ అధ్యక్షుడు రాకేష్ తివారి, బీఆర్ఎస్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రాఘవేంద్ర రాజు, సిరా రాజ్ కుమార్, ఆకుల శ్రీనివాస్, రాధాకష్ణతోపాటు ఉప్పుగూడ మహంకాళి దేవాలయ కమిటీ సభ్యులు, దేవాలయ కమిటీ అధ్యక్షుడు జనగామ మధుసూదన్ గౌడ్, కష్ణ తదితరులు పాల్గొన్నారు.

మౌన దీక్ష విజయవంతం చేయండి



నవతెలంగాణ-ఓయూ

టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఎన్టీఆర్‌కి "భారత రత్న పురస్కారం" ప్రధానం చేయడంలో కేంద్ర ప్రభుత్వ వివక్షకు నిరసనగా నేడు ఉదయం 10 గంటలకు ఇందిరా పార్కు ధర్నాచౌక్ వద్ద "మౌనదీక్ష" కార్యక్రమం విజయవంతం చేయాలని సికింద్రాబాద్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్ కుమార్ కోరారు. బౌద్ధనగర్‌లో జరిగిన టీడీపీ ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజమండ్రిలో జరిగే మహానాడు విజయవంతం, సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఉన్న సమస్యలను ప్రజలు ఎదుర్కొంటున్నా వివిధ అంశాలపై చర్చించారు. మహానాడు ముగిసిన వెంటనే ఉద్యమం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మరో వైపు పార్టీని బలోపేతం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు శ్రీనివాస్ కుమార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్స్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముజీబ్‌కు సన్మానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రాజ్ఞిక ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహించిన 'ప్రాజ్ఞిక' 7వ వార్షిక వేడుకలు బుధవారం రవీంద్రభారతిలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ప్రజలకు సేవ చేస్తున్న టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్)ని దైవజ్ఞ శర్మ, సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, సంగీత దర్శకులు కోటి సమక్షంలో సన్మానించారు. ఈ సందర్భంగా ముజీబ్ మాట్లాడుతూ తన కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, తల్లిదండ్రులు నేర్పించిన బాటలో అటు ఉద్యోగులు, ఇటు ప్రజలకు సహాయం చేస్తూ ముందుకు వెళ్తున్నానని తెలిపారు. తన సేవలను గుర్తించిన ప్రాజ్ఞిక ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు ప్రవీణ్‌కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కె.ఆర్.రాజ్ కుమార్, కుర్రాడి శ్రీనివాస్, వైదిక శాస్త్ర, ముఖీం ఖురేషి, ఖుతుబుద్దీన్, నాలుగో తరగతి నాయకుడు అబ్దుల్ ముజీబ్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్య, వైద్యానికి అధిక నిధులు కేటాయించాలి

- ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి
- తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం



నవతెలంగాణ-అడిక్‌మెట్

రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, వైద్యానికి అధిక నిధులు కేటాయించాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ప్రజలందరికీ విద్యను, వైద్యాన్ని ఉచితంగా ప్రభుత్వమే ఇవ్వాలని కోరుతూ ఉచిత వైద్య విద్య సాధన సమితి, పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు మద్దతుగా ప్రొఫెసర్ కోదండరాం, పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు సదానంద రెడ్డి, ఉచిత విద్య వైద్య సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నారగోని ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ మన ఊరు, మన బడి అసమర్థంగా పని చేస్తుందని అందరికీ తెలిసిందే అన్నారు. కేసీఆర్‌కు వైద్యం కావాలంటే యశోద హాస్పటల్‌కు వెళ్తాడు కానీ, సామాన్యుడు యశోదకు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలో దురదృష్టవశాత్తు విద్య, వైదానికి కనీస బడ్జెట్ కేటాయించడం లేదన్నారు. ఢిల్లీలో విద్య, వైద్యానికి బడ్జెట్‌లో అధికంగా కేటాయిస్తున్నారు అని తెలిపారు. విద్య, వైద్యాన్ని అమ్ముకునే పరిస్థితి రావద్దన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో మెరుగైన వైద్య సౌకర్యాలు అందిస్తూ ప్రతి బస్తీలో బస్తీ దవఖానాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్పొరేట్ హాస్పిటల్స్‌లో సామాన్యుడికి వైద్యం అందాలంటే వేలకు వేలు చెల్లించక తప్పని పరిస్థితి ఉందన్నారు. వైద్యాన్ని తమ వ్యాపారం కోసం ఉపయోగించుకుంటున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి మరి అధ్వానంగా తయారైందన్నారు. విద్యార్థులకు కనీస వసతులు కల్పించకుండా ప్రభుత్వ పాఠశాలలను నిర్వహిస్తున్నారని తెలిపారు. మెరుగైన విద్య ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న కనీస వసతుల్లేక విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని తెలిపారు తల్లిదండ్రులు వేలకు వేలు అప్పులు చేసి కార్పొరేట్ పాఠశాలలకు తమ బిడ్డలను పంపుతున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాల్లో మెరుగైన వసతులు కల్పించి కార్పొరేట్ విద్యాసంస్థల నిలువు దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలంలో ఒక జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ, ఐటీఐ ఇనిస్టిట్యూట్ నిర్మించాలన్నారు. కార్పొరేట్ కాలేజీల్లో ప్రతి వారం ఒక విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడుతున్నారని తెలిపారు. పిల్లలపై ఒత్తిడి లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ అధ్యక్షుడు ఉంద్యాల సదానంద రెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్యాన్ని కొందరు పాలకులు, అధికారులు తమ స్వలాభం కోసం వాడుకుంటున్నారన్నారు. అవినీతి లంచాల కారణంగా ప్రజలకు అందని ద్రాక్షగా మారిందన్నారు. ఓ పథకం ప్రకారం, వీటి స్థానంలో ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలను తీసుకొచ్చి ప్రజల శ్రమను, సంపదను దోచుకుంటూ, ప్రజల ఉసురు తీస్తున్నారన్నారు. పేరుకు మాత్రం ప్రజల కోసం తాము ఎంతో ఖర్చు చేస్తున్నాం అని చెబుతున్నారే కానీ ప్రజలకు మేలు చేసిన పాపాన పోలేదన్నారు. ప్రైవేట్ కార్పొరేట్లకు సహాయ సహకారాలు అందిస్తూ, అందినకాడికి దోచుకుంటున్నారన్నారు. దీని కారణంగా ప్రైవేట్, కార్పొరేట్లు మూడు పువ్వులు, ఆరు కాయలుగా దినదినాభివృద్ధి చెందుతూ ప్రజల శ్రమను, సంపదను నిర్వీఘ్నంగా కొల్లగొడుతున్నారు చెప్పారు. ఉచిత విద్య, వైద్య సాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు నారగోని ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రైవేటు విద్య, వైద్యం పేరుతో వసూలు చేసే ఫీజులపైన ప్రభుత్వానికి అజమాయిషీ లేకపోవడం వల్ల ఒక మాఫియా లాగా తయారైందన్నారు. మెరిట్ ఉన్నా సీటు కొనుక్కోలేక పోతున్నారని తెలిపారు. ఈ దీక్ష లో పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ హైదరాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎం.ధనమ్మ, విద్య వైద్య సాధన సమితి ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు సుధాకర్, సంయుక్త కార్యదర్శి లక్ష్మణ్ రావు, బానోతు శ్రీనివాస్ నాయక్, సామాజిక కార్యకర్త నందికంటి సాయి కుమార్, భద్రయ్య పాల్గొన్నారు.

ఓయూలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు



నవతెలంగాణ-ఓయూ

ఓయూ ప్రాంగణంలో సుమారు రూ.120 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని ఓయూ వీసీ ప్రొ.రవీందర్ చెప్పారు. బుధవారం ఓయూ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రీఫార్మ్, ఫర్మార్మ్, ట్రాన్స్‌ఫార్మ్‌లో భాగంగా రెండేండ్లలో తాము చేపట్టిన సంస్కరణలు, ప్రగతిని మూడో ఏడాది పూర్తి చేస్తామన్నారు. వీసీగా బాధ్యతలు చేపట్టి రెండేండ్లు పూర్తయిన సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొ. పి.లక్ష్మీనారాయణతో కలిసి ప్రగతి నివేదికను ఆవిష్కరించారు. పాలనా వ్యవస్థను గాడిలో పెట్టడం, అకాడమిక్, పరిపాలనా వ్యవస్థలను పటిష్టం చేయటం, విద్య, పరిశోధనా రంగాల్లో మేటిగా నిలపటమే ధ్యేయంగా తాము చేపట్టిన సంస్కరణలు ఫలితాలిస్తున్నాయన్నారు. మరో వందేండ్ల పాటు ఓయూ తన కీర్తి, ప్రతిష్టను కొనసాగించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ సహకారంతో ఓయూను విద్యా రంగంలో అగ్రగామిగా ఉంచడానికి కృషి చేస్తానని చెప్పారు. రూ.120 కోట్లతో బాలుర వసతి గృహాలు, శతాబ్ది నూతన పరిపాలనా భవనం, శతాబ్ది పైలాన్, ఓపెన్ ఎయిర్ థియేటర్ సహా అనేక మౌలికవసతుల ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఇంజినీరింగ్‌లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద కోల్ ఇండియా లిమిటెడ్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లు ఒక్కో చైర్ ఏర్పాటు చేసి ఒక్కొక్కరు రూ.3 కోట్ల చొప్పున నిధులు అందించిన విషయాన్ని వెల్లడించారు. ప్రొపెసర్ ఆఫ్ ప్రాక్టీస్ కింద మైనింగ్ విభాగంలో ఇద్దరు సింగరేణి ఉద్యోగులు అధ్యాపకులుగా పని చేస్తున్నారని తెలిపారు. ఓయూ పూర్వ విద్యార్థుల సమూహాన్ని ఒక్కచోటకు చేర్చి తొలిసారిగా గ్లోబల్ అల్యుమిని ఏర్పాటు చేసి సెక్షన్ 8 కంపెనీ కింద ఓయూ ఫౌండేషన్ ఏర్పాటు చేశామన్నారు. ఓయూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థులను ఉత్సాహపరిచేందుకు తక్ష్ లాంటి కార్యక్రమాలతో పాటు ఉస్మానియా ఆవిర్భావ ఉత్సవాలు జరుపుతున్నామని వెల్లడించారు. అకాడమిక్ క్యాలండర్‌ను సరిదిద్దటం, ఏటా స్నాతకోత్సవం నిర్వహించేలా ఏర్పాట్లు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మార్కెట్‌కు అనుగుణంగా విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరటంతో పాటు కొత్త కోర్సులను ప్రవేశపెట్టామని చెప్పారు. ఇంజినీరింగ్‌లో కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, మైనింగ్, బీఏ హానర్స్, ఏ కోర్సు చదివిన వారైనా ఆర్ట్స్, సోషల్ సైన్సెస్‌లో పీజీ చేసే వినూత్న అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చామని వివరించారు. క్లస్టర్ విధానం, హ్యూమన్ కాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్, స్కిల్ ఎన్హాన్స్మెంట్, ప్లేస్ మెంట్ సర్వీసెస్, గ్లోబల్ ఎడ్యుకేషన్ కోసం శిక్షణా కార్యక్రమాలు, సివిల్ సర్వీసెస్ అకాడమీ, స్టూడెంట్ డిస్కోర్స్ సెంటర్, హెచ్ఆర్డీసీ, సీబీసీఎస్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా ఫూలే, తెలంగాణ అధ్యయన కేంద్రం, ఇండో పసిఫిక్ అధ్యయన కేంద్రాలను కొత్తగా అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. దాదాపు పది విదేశీ విశ్వవిద్యాలయాలతో పరస్పర అవగాహనా ఒప్పందాలు చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.పప్పుల లక్ష్మీనారాయణ, డీన్, డైరెక్టర్ ప్రొ.స్టీవెన్ సన్, ప్రొ.జి.మల్లేశం, ప్రొ.శ్రీరాం వెంకటేశ్, ప్రొ.సి.గణేష్, ప్రొఫెసర్ వీరయ్య, ప్రొ.ప్యాట్రిక్ సహా ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, డైరెక్టర్లు, సీనియర్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రూ.లక్ష స్కీంను అన్ని బీసీ కులాలకు వర్తింపజేయాలి



- బీసీ బంధు ప్రవేశ పెట్టాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య
- మంత్రి గంగుల కమలాకర్‌కు వినతి

నవతెలంగాణ-అడిక్‌మెట్

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన రూ.లక్ష స్కీంను అన్ని బీసీ కులాలకు వర్తింపజేయాలనీ, బీసీబంధు పథకం ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి 5 కులాలకు ప్రకటించిన రూ.లక్ష పథకాన్ని బీసీ జాబితాలోని 130 కులాలకు వర్తింపజేయాలనీ, వారం రోజుల్లో ఈ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి బీసీ కుటుంబానికి బీసీబంధు ప్రవేశపెట్టి రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. బీసీ కార్పొరేషన్‌లో పెండింగ్‌లో ఉన్న రూ.5లక్షలా 47 వేల మందికి వెంటనే సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. ఇంజినీరింగ్/ఎంబీఏ/ఎంసీఏ/పీజీ/డిగ్రీ/ఇంటర్ తదితర కాలేజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థుల మొత్తం ఫీజుల స్కీంను పునరుద్ధరించాలని కోరారు. పెరిగిన ధరల ప్రకారం మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్స్ పెంచుతూ జీవో జారీ చేయాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు బీసీ గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలన్నారు. విదేశీ విద్య స్టైఫండ్ స్కీమ్ అర్హులందరికీ ఇవ్వడానికి బడ్జెట్‌లో రూ.60 కోట్ల నుంచి రూ.300 కోట్లకు పెంచాలన్నారు. గురుకుల పాఠశాలల హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. బీసీ స్టడీ సర్కిల్‌కు రూ.200 కోట్ల కేటాయించాలనీ, 12 బీసీ కులాల ఫెడరేషన్లకు జనాభా నిష్పత్తిలో రూ.2వేల కోట్లు కేటాయించాలని కోరారు. బీసీల ప్రతి డిమాండ్‌నూ సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని మంత్రి గంగుల కమలాకర్ హామీనిచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, అంజి, వేముల రామకృష్ణ, టి.నందగోపాల్, రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



బేగంబజార్ భగత సింగ్ చౌరాస్తాలో జరిగిన మహారాణ ప్రతాప్ 483 వ జయంతి వేడుకల్లో పాల్గొన్న సీపీఐ(ఎం) గోషామహల్ నియోజవర్గ కన్వీనర్ పి.నాగేశ్వర్. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు టాకూర్ సురేందర్ సింగ్, స్థానిక అఫ్జల్‌గంజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బుర్ర చిట్టి తదితరులు. నవతెలంగాణ-ధూల్‌పేట్

అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా జి.శ్రీనివాస్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా జి.శ్రీనివాస్ ఇటీవలే బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని వాహనదారులకు సూచించారు. అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నారాయణగూడ సీఐగా జి.శ్రీనివాస్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నారాయణగూడ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా 1996 బ్యాచ్‌కు చెందిన జి.శ్రీనివాస్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో హైదరాబాద్ వెస్ట్ జోన్‌లో ఎస్.బి విభాగంలో పని చేశారు. నారాయణగూడ సీఐగా నియమితులవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. నూతన బాధ్యతల నిర్వహణలో కచ్చితంగా ఉంటూ శాంతి, భద్రతల పరిరక్షణలో తన వంతు కృషి చేస్తానని తెలిపారు. నగర కమిషనర్ సీవీ ఆనంద్ ఆలోచనలకు అనుగుణంగా లా అండ్ ఆర్డర్ విధులు క్రమశిక్షణతో సక్రమంగా నిర్వహిస్తానని వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ జి.శ్రీనివాస్‌కు పలువురు ఎస్ఐలు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

'యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ విజయ దుందుభి'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో హిమాయత్ నగర్‌లోని రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ 15 ఆల్ ఇండియా ర్యాంకులు సాధించి విజయ దుందుభి మ్రోగించిందని ఆ అకాడమీ ఫౌండర్, మెంటార్ శ్రీరమణ ముప్పాళ్ల, డైరెక్టర్ డాక్టర్ వివేకానంద తెలిపారు. బుధవారం హిమాయత్ నగర్‌లోని అకాడమీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో టాప్ ర్యాంకు ఏఐఆర్ 22 సాధించిన డాక్టర్ జీవీఎస్ పవన్ దత్తా, వంద లోపు ర్యాంకులు సాధించిన సాయి ఆశ్రీత్ (ఏఐఆర్ 40), మల్లిడి శ్రీ ప్రణవ్ (ఏఐఆర్ 60), ఉత్కర్ష కుమార్ (ఏఐఆర్ 78)లతో పాటుగా ఆల్ ఇండియా ర్యాంకులు శ్రేయ శశాంక్ (192), జయసింహరెడ్డి (217), ఆశ్రిత (315), శ్రవణ్ కుమార్ రెడ్డి (426), సాయి కిరణ్ (460), భువన ప్రణీత్ (510), రుత్విక్ సాయి (558), దీప్తి చౌహాన్ (630), రవి కిరణ్ (694), భార్గవ్ (772), ప్రణయ్ కుమార్ (885) సాధించిన ర్యాంకులు తమ అకాడమీ విద్యార్థులే అవడం హర్షించదగ్గ విషయమన్నారు. గతేడాది తమ అకాడమీ నుంచి ఆరుగురు అభ్యర్థులు సర్వీస్ సాధించారనీ, ఈ ఏడాది సాధించిన ర్యాంకుల స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత మంది అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ యూపీఎస్సీ మెయిన్స్ ఆన్సర్ రైటింగ్, ఆంత్రోపాలజీ ఆప్షనల్ కోచింగ్, రేసిడ్యువల్ కోచింగ్, ఇతర విభాగాలకు ప్రసిద్ధి చెందిందనీ, ఈ ప్రత్యేకతలు ఢిల్లీలోని ఇనిస్టిట్యూట్‌లతో సరి సమానమైన ఫలితాలతో అకాడమీని దక్షిణ భారత దేశంలోనే సిఎస్‌ఈ కోచింగ్ కోసం అత్యధికంగా కోరుకునే సంస్థగా మార్చాయని వారు తెలిపారు. ఈ సమావేశంలో అకాడమీ బృందం కళ్యాణ్, రాకేశ్ శర్మ, డాక్టర్ మమత, తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలి

- సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి కృష్ణ నాయక్



నవతెలంగాణ-ధూల్‌పేట్

పేద ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి కృష్ణ నాయక్ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) సౌత్ జిల్లా ఆధ్వర్యంలో బండ్లగూడ తహసీల్దార్‌కు ప్రజా సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేద ప్రజలను గుర్తించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఇప్పటికే జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఏడాది గడిచినా నేటికీ పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలు ఇంటికి భారంగా ఇబ్బందులు పడుతున్నా పేద ప్రజలు పూర్తయిన ఇండ్లను వెంటనే పేద ప్రజలకు కేటాయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఈ ఇండ్లను ప్రజలకు కేటాయించాలనీ, రూ.వేలు, లక్షల కోట్లు కిరాయిలు మిగిలే విధంగా బాధ్యత చేపట్టాల్సింది ప్రభుత్వానిదే అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం దాదాపు హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్ రూమ్ కట్టిస్తాం అనే చేసిన వాగ్దానం నెరవేరలేదన్నారు. ఇప్పటివరకు 50 నుంచి 60 శాతం వరకు మాత్రమే పూర్తి చేసిందన్నారు. అందులో 10వేలు మాత్రమే అర్హులుగా గుర్తించి, మిగతా వారిని అర్హులుగా గుర్తించడంలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. స్థానికంగా జంగంమేట్ డివిజన్‌లో ఎంసీహెచ్ క్వాటర్ స్థానికులకు 72 మందికి అర్హులుగా సర్టిఫికెట్ గుర్తించారన్నారు. అక్కడ స్థానికులు గతంలో అనేకసార్లు అధికారులకు కలెక్టర్, ఆర్డీఓ, ఎంఆర్ఓకు విన్నవించి, ఆన్లైన్ చేసుకున్నా ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా అర్హులైన పేద ప్రజలను గుర్తించి, ఇండ్లు కేటాయించాలనీ, వారికి వెంటనే ఆల్టమేట్ చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు శ్రీను, రాజేష్, మహేష్, లక్ష్మి, భారత్, శాంతమ్మ, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.



మెరుగైన సమాజం కోసం బాల సాహిత్యం..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

బాల సాహిత్యాన్ని ఇతోధికంగా ప్రోత్సహించడం ద్వారా మెరుగైన సమాజాన్ని నెలకొల్పగలమని వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం పరిషత్తులోని డాక్టర్ దేవులపల్లి రామానుజ రావు కళామందిరంలో రెండు రోజుల బాల సాహిత్య సమ్మేళనం ప్రారంభమైంది. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షత వహించారు. పద్మభూషణ్ డాక్టర్ కేఐ వరప్రసాద్ రెడ్డి మాతృమూర్తి కోడూరు శాంతమ్మ స్మత్యర్థం ఏర్పాటు చేసిన ఈ సమ్మేళనంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు, వక్తలు, అతిథులు పాల్గొన్నారు. డాక్టర్ వరప్రసాద్ రెడ్డి సమ్మేళనాన్ని ప్రారంభిస్తూ తమ తల్లి సాహిత్యం పట్ల అభిరుచిని కలిగించారనీ, ముఖ్యంగా పద్యం ఆమె నుంచే నేర్చుకున్నానని తెలిపారు. బాలల్లో సాహిత్యం, కళా సంస్కృతుల అభిరుచి కల్పించలేకపోతే భవిష్యత్తుకు నష్టం కలుగుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.విరమణా చారి మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్ వల్ల కలుగుతున్న లాభాలతోపాటు నష్టాలు కూడా సమాజంపై పెను ప్రభావం చూపుతాయన్నారు. మన విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూనే మన సంప్రదాయాలు, భాషా సాహిత్యాలు, కళా సంస్కృతులను ఒంట పట్టించుకోవడం చాలా అవసరమని తెలిపారు. శాసన మండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని విశేషంగా వినియోగించుకుంటున్న అమెరికాలో కూడా అందరి చేతుల్లో పుస్తకాలు కనబడతాయని తెలిపారు. బాలల కోసం రచనలు చేసే వారిలో పసితనం తప్పక ఉండాలని తెలిపారు. ఆచార్య శివారెడ్డి మాట్లాడుతూ వరప్రసాద రెడ్డి అందించిన విరాళంతో బాల సాహిత్య సమ్మేళనం నిర్వహించడంతో పాటు బాలల కోసం అద్భుతమైన గ్రంథాలను పరిషత్తు ముద్రించి అందిస్తుందని తెలిపారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య స్వాగతోపన్యాసం చేస్తూ రెండు రోజుల సమ్మేళనంలో బాల సాహిత్యానికి సంబంధించిన వివిధ అంశాలపై సదస్సులు, చర్చాగోష్టులు సాగుతున్నాయనీ, సుమారు 100 మంది ప్రతినిధులు, 100 మంది వక్తలు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. పరిషత్తు ఈ సందర్భంగా ప్రచురించిన బాల కథా సౌరభం గ్రంథాన్ని ఆవిష్కరించారు. బాల సాహిత్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు డాక్టర్ ఎం.భూపాల్, చొక్కాపు వెంకటరమణ, డాక్టర్ దాసరి వెంకటరమణ, కన్నెగంటి అనసూయ, డాక్టర్ పత్తిపాక మోహన్, బాల సాహిత్య వేత్తలు గరిపెల్లి అశోక్, ముంజులూరి కృష్ణకుమారి, పైడిమర్రి రామకృష్ణ, డాక్టర్ అమ్మిన శ్రీనివాసరాజు, డాక్టర్ అమరవాది నీరజ, ప్రముఖ రచయిత్రి వి.శాంతి ప్రబోధ, వ్యక్తిత్వ వికాస నిపుణులు జీవీఎస్‌రాజు, పలువురు బాల రచయితలు, రచయితలు పాల్గొన్నారు. రేపు కూడా సమ్మేళనం కొనసాగుతుంది.

సివిల్స్ పరీక్షల్లో అనలాగ్ ఐఏఎస్ అకాడమీ విద్యార్థుల ఉత్తమ ప్రతిభ



నవతెలంగాణ-అడిక్‌మెట్

ప్రతిష్టాత్మకమైన యూపీఎస్సీ సివిల్స్ పరీక్షలకు శిక్షణ అందించే ప్రముఖ అనలాగ్ ఐఏఎస్ అకాడమీ ఈ ఏడాదీ 64 మంది ర్యాంకులను దేశానికి అందించిందని అకాడమీ డైరెక్టర్ శ్రీకాంత్ అన్నారు. ఇటీవల వెలువడిన సివిల్స్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు అందుకున్న అనలాగ్ ఐఏఎస్ అకాడమీ సంస్థ ఆధ్వర్యంలో కవాడిగూడ బ్రాంచ్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ హైదరాబాద్ కేంద్రంగా గల 21 ఏండ్లుగా ఎంతో మంది ఐఏఎస్ కావాలనే కలలను సాకారం చేశామన్నారు. సివిల్స్ ఫలితాల్లో మొదటి వందలో తొమ్మిది ర్యాంకులు, 300లో 26 ర్యాంకులు 500లో 45 ర్యాంకులు కైవసం చేసుకున్నామన్నారు. భవిష్యత్తులో మరింత మందిని తీర్చిదిద్దే ప్రయాణంలో తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు పరీక్షల శిక్షణ ఇచ్చే సమయంలో వ్యక్తిగతంగా ప్రతి అభ్యర్థికీ తగిన రీతిలో ఉత్తేజపరుస్తున్నామన్నారు. దేశంలోనే అత్యుత్తమైన శిక్షకులుగా పేరుగాంచిన ఫ్యాకల్టీలతో పాఠశాలలో బోధించడంతో పాటు ఉన్నతమైన స్టడీ మెటీరియల్‌ను రూపొందించి అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడం అనలాగ్ ఐఏఎస్ అకాడమీ ప్రత్యేకత అని తెలిపారు. అభ్యర్థుల ఇంటర్వ్యూలో బాగా రాణించడానికి వారికి తగిన రీతిలో శిక్షణ మెలకువలు అందిస్తున్నామని తెలిపారు.

పద్మారావుగౌడ్ క్యాంపు కార్యాలయం సందర్శన



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్‌లోని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ క్యాంపు కార్యాలయాన్ని ఎమ్మెల్యే గాదరి కిషోర్ బుధవారం సందర్శించారు. కార్యాలయం కర్యలాపాలు, సెట్విన్ సంస్థ పనితీరును ఆయనకు డిప్యూటీ స్పీకర్ వివరించారు. సికింద్రాబాద్‌లో వివిధ అభివృద్ధి కార్యకలాపాలు సాగుతున్న తీరు ఆదర్శవంతంగా నిలుస్తోందని గాదరి కిషోర్ ఈ సందర్భంగా ప్రశంసించారు. సీతాఫల్‌మండిలో కొత్తగా రూ.30 కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వ స్కూల్, కాలేజీ భవనాల నిర్మాణం, రూ.13 కోట్లతో నిర్మించనున్న కుట్టి వెల్లోడి ప్రభుత్వ హాస్పిటల్ నిర్మాణ పనులను డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ సమీక్షించారు. విద్యా రంగంలో చేయుతకు కృషి చేస్తూ, రాష్ట్రంలోనే మొట్ట మొదటి సారిగా జూనియర్, డిగ్రీ కాలేజీ సీతాఫల్‌మండి ప్రభుత్వ స్కూల్‌లో మంజూరు చేయించామనీ, ఈ జూనియర్, డిగ్రీ కాలేజీ భవనాల నిర్మాణానికి రూ.29.75 కోట్ల మేరకు నిధులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. సికింద్రాబాద్‌తోపాటు నగరంలో ఆదర్శంగా నిలిచేలా సెట్విన్ శిక్షణ కేంద్రాన్ని సీతాఫల్‌మండిలో ఏర్పాటు చేశామని తెలిపారు. కొత్త భవనాల నిర్మాణం పనులను సాధ్యమైనంత తొందరగా ప్రారంభించాలని అయన ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, కరాటే రాజు, కంది నారాయణ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఆశా వర్కర్లకు ఎగ్జామ్ వెంటనే రద్దు చేయాలనీ, పారితోషికాలను రూ.18వేలకు పెంచి ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలనీ, ఆశా వర్కర్ల ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కోఠిలోని ఆర్ఎఫ్‌పీటీసీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్ వైజర్ నర్సుబాయికి తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గోషామహల్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోషామహల్ సీఐటీయూ జోన్ కన్వీనర్ కె.జంగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఆశా వర్కర్లు గిరిజన ప్రాంతాల్లో 32 ఏండ్లుగా మైదాన ప్రాంతంలో పని చేస్తున్నారన్నారు. ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక ట్రైనింగ్‌లు పొందారనీ, రిజిష్టర్స్ రాయడం, సర్వేలు చేయడం, ఆన్ లైన్ పని చేయడం, ప్రజలకు బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర అన్ని రకాల జబ్బులను గుర్తిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం సప్లై చేస్తున్న మందులు ప్రజలకు అందజేస్తున్నారని చెప్పారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు సేవ చేస్తున్నారనీ, ఇంత కష్టపడి పని చేస్తున్న ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి.ఉమాదేవి, ఎస్.అమరావతి, ఎన్.మాదవి, బి.లలిత, తదితరులు పాల్గొన్నారు.

ఆయా బస్తీల్లో ఎమ్మెల్యే పర్యటన

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బెస్తివాడ, చింతల్‌బస్తీ, ఎరుకబస్తీ, తుమ్మలబస్తీ, గాంధీతాత నగర్ ప్రాంతాలను జీహెచ్ఎంసీ, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్, వాటర్ వర్క్స్, రెవెన్యూతో పాటు వివిధ శాఖలతో అధికారులతో ప్రజా సమస్యలు తెలుసుకోవడం కోసం ఎమ్మెల్యే దానం నాగేందర్ పర్యటించారు. స్థానికుల నుంచి అందిన ఫిర్యాదులను అధికారుల సమక్షంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు చెప్పాలని ప్రశ్నిస్తూ ఆ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మోడల్ హౌస్ దగ్గర శివరాజ్ లైన్ పైప్ లైన్ పనులను ఎమ్మెల్యే జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఇందిరా నాయక్, వాటర్ బోర్డు జీఎం హరీష్ శంకర్, ఏఎంహెచ్ఓ భార్గవ్ నారాయణ, విద్యుత్ అధికారి హైమ నంద్, మేనేజర్ శివకుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అశోక్, స్థానిక సంక్షేమ సంఘం నాయకులు, మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





ఇటీవల విడుదలైన సివిల్ సర్వీస్ ఫలితాల్లో అశోక్ నగర్ స్వయం శిక్షకు చెందిన రామ్ సుధీర్ ఐఏఎస్ అకాడమీ అభ్యర్థి ప్రణవ్ ఆల్ ఇండియా 60వ ర్యాంకును సాధించాడు. ఈ సందర్భంగా స్వయం శిక్ష సంస్థ డైరెక్టర్ రామ్ సుధీర్ ప్రణవ్‌ను తన అకాడమీలో ఘనంగా సత్కరించారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. నవతెలంగాణ-అడిక్‌మెట్

మత్స్య సహకార సంఘం చైర్మెన్ పదవి గంగపుత్రులకే ఇవ్వాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

మత్స్య సహకార సంఘం చైర్మెన్ పదవి గంగపుత్ర కులానికి ఇవ్వాలని రాష్ట్రంలోని గంగపుత్ర సంఘాలు డిమాండ్ చేశాయి. తెలంగాణ రాష్ట్ర హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం హనుమాన్ టికిడిలోని టీసీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ గంగపుత్ర విద్యాభివద్ధి సంస్థ చైర్మెన్ గులాబ్ శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర గంగాపుత్ర అభివృద్ధి సంస్థ అధ్యక్షులు గాలి సత్యనారాయణ, తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం అధ్యక్షులు మెట్టు ధనరాజ్, తెలంగాణ గంగపుత్ర సంఘాల ఐక్య వేదిక జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు రమావెని లక్ష్మణ్, గంగపుత్ర చైతన్య సమితి అధ్యక్షులు నర్సింగ్ గంగాపుత్ర మాట్లాడుతూ రాష్ట్రంలో కేవలం చేపల పట్టే వృత్తి జీవనాధారంగా గంగపుత్రులు జీవిస్తున్నారని తెలిపారు. తమ కులానికి చెందిన మత్స్య సహకార సంఘం చైర్మెన్‌ను ముదిరాజు పిట్టల రవీందర్‌కు ఇవ్వడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గంగపుత్రల వృత్తి హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. ముదిరాజులకు చైర్మెన్ పదవి ఇవ్వడం తెలంగాణ గంగపుత్రులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గంగపుత్ర సంఘాల నాయకులు కె.యాదయ్య, విజయ్, ప్రకాష్, పూసరాజు, బొట్టు సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వరద నీటి కాలువ నిర్మాణ పనుల పరిశీలన



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

డివిజన్ అభివద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివా సరావు అన్నారు. బుధవారం డివిజన్‌లో కొనసాగుతున్న అభి వృద్ధి పనులను ఆయన పరిశీలిం చారు ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ హైదర్‌నగర్ డివిజన్ లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, స్ట్రామ్ వాటర్ డ్రైన్ (వరద నీటి కాలువ), యూజీడీ, సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టా లని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికా రులకు సూచించారు. డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, అన్నివేళలా ప్రజలకు అందుబాటు లోకి ఉంటానని కార్పొరేటర్ తెలియజేశారు. అధికారులు ఏఈ రాజీవ్ కాలనీ వాసులు వెంకటేశ్వర రావు, శ్రీధర్, విజయ కృష్ణ, కేఎస్ఆర్ మోహన్ రావు, విజయ్ భాస్కర్, బ్రహ్మ శేఖర్, వినోద్, సురేంద్ర, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్‌లో విగ్రహ ప్రతిష్టాపనోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ శ్రీనివాస్ నగర్ కాలనీలో జరుగుతున్న శ్రీఅయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాల్లో భాగంగా బుధవారం జరిగిన శ్రీగణపతి పూజలో ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొని డిప్యూటీ మేయర్ ధనరాజు యాదవ్‌తో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భం గా ఆలయ అభివద్ధికి విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సురేష్ రెడ్డి, చిట్ల దివాకర్, సుజాత, బాలాజీ నాయక్, ఆగం రాజు, రావుల శేషగిరి, కో ఆప్షన్ సభ్యులు తలారి వీరేష్, ఏనుగుల అభిషేక్ రెడ్డి, గ్రామ పెద్దలు నర్సింహా రెడ్డి, ప్రమీల సాయిలు యాదవ్, సుధీర్ రెడ్డి, బీఆర్ఎస్ నిజాంపేట్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, నాయకులు బాల వెంగయ్య చౌదరి, ఆవుల జగన్ యాదవ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి

- శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి
- ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కేపి వివేకానంద్‌తో కలిసి ఆవిష్కరించిన స్పీకర్



నవతెలంగాణ-దుండిగల్

దివంగత నటుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావు సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని రాష్ట్ర శాసన సభ స్పీకర్ పోచా రం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. దివంగత ఎన్టీ రామా రావు శత జయంతిని పురస్కరించుకుని దుండిగల్ మున్సిపాల్టీ బహదూర్‌పల్లి చౌరస్తా రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ట కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని బుధవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి , ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఎన్టీ రామారావు గురించి ఎంత చెప్పుకున్నా తక్కువేనని, దేశంలోనే మొట్ట మొదటి



గా సంక్షేమ పథకాలను వారే ప్రవేశ పెట్టారని అన్నారు. పేదవాడి ఆకలి తీర్చేందుకు రూ. 2కే బియ్యాన్ని అందించిన గొప్ప ప్రజా సంక్షేమ నాయకుడు ఎన్టీఆర్ అని అన్నారు. నటుడిగానే కాకుండా ముఖ్యమంత్రిగా ప్రజలకు వారు అనేక సేవలు అందించారన్నారని గుర్తు చేశారు. ఎన్టీఆర్ నాయక త్వంలో 18 సంవత్సరాలు జిల్లా పార్టీ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఏకైక వ్యక్తి తనేనని స్పీకర్ పేర్కొ న్నారు. ఎమ్మెల్యే కేపి వివేకా నంద్ పుత్ర సమానుడని, అసెంబ్లీలో చక్కటి భాషతో తన వాణిని గట్టిగా వినిపిస్తాడని అన్నారు. బహదూర్ పల్లి చౌరస్తాలో చక్కటి స్థలాన్ని ఇచ్చి విగ్ర హాన్ని ప్రతిష్టించిన కృష్ణారావు , ఆర్గనైజేషన్ వారికి అభినందనలు తెలియజేశారు. అంతకుముందు ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలుగు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా ఎన్టీఆర్ జీవితం నిలిచిందన్నారు. తెలుగు సినిమాలలో ఆయన వేసిన పాత్రల ప్రభావం ప్రజల హదయాలలో చెరగని ముద్ర వేసిందని, రాజకీయ చైతన్యం, రాజకీయంలో నాయకులు ఎలా నడుచుకోవాలని చూపించిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైస్ చైర్మెన్ తుడుం పద్మారావు, కౌన్సిలర్ భరత్, మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వర రావు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ట కమిటీ అధ్యక్షుడు బొడ్డు రవి శంకర్, మాజీ కౌన్సిలర్ రంగారావు, వీరబాబు, రామకృష్ణ, దిలీప్, అజయ్, నరేందర్, నర్సింహా రావు, బాబి ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న శంభీపూర్ క్రిష్ణ

ఎన్టీఆర్ విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ పాల్గొన్నారు. వారితో పాటు వైస్ చైర్మెన్ పద్మారావు, కౌన్సిలర్లు భారత్ కుమార్, ఆనంద్ కుమార్, పాక్స్ డైరెక్టర్ అర్కల జీతయ్య మాజీ కౌన్సిలర్ రంగ రావు, మున్సిపల్



యూత్ అధ్యక్షులు మైసిగారి శ్రీకాంత్, నాయకులు ప్రేమ కుమార్, మధు సుధన్ రావు, కతల రాము కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకుల నివాళి

ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కొలను లీడర్ నరసింహారెడ్డి, యువ నాయకులు



కాసాని వీరేష్ ముదిరాజ్ లు హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'హరీష్ అన్నా సేవా సమితి' పేరుతో వసూళ్లు

- ప్రముఖులు విరాళాలిచ్చారంటూ ప్రచారం
- పలువురు నుంచి పెద్దమొత్తంలో డబ్బులు వసూళ్లకు స్కెచ్
- ఇద్దరు నిందితుల అరెస్టు



నవతెలంగాణ-సిటీబ్యూరో

సులువుగా డబ్బులు సంపాదించాలని ఆలోచించిన ఇద్దరు నిందితులు ఏకంగా ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ పేరుతో 'హరీష్ అన్నా సేవా సమితి' పుస్తకాన్ని ప్రింట్ చేశారు. విరాళాల పేరుతో పలువురి నుంచి వసూళ్లకు పాల్పడుతు నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులకు అడ్డంగా బుక్కయ్యారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి 'హరీష్ అన్నా సేవా సమితి' పేరుతో వున్న పుస్తకాన్ని, రిసిప్ట్ బుక్‌ను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం డీసీపీ పీ.రాధాకిషన్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్‌కు చెందిన పేరాల వెంకటేష్ అలి యాజ్ తెలంగాణ వెంకటేశ్వరా రావు, వెంకట్, గండిమై సమ్మకు చెందిన గడ్డమీది రాజేష్ కుమార్ సులువుగా డబ్బులు సంపాదించాలని పథకం వేశారు. ఫైనాన్స్ అండ్ హెల్త్ మినిస్టర్ హరీశ్‌రావుకు సంబంధించిన సామాజిక కార్యకలాపాలను తెలుసుకునేవారు. మంత్రి ఫాలోవర్స్‌గా ప్రచారం చేసుకున్నారు.'హరీష్ అన్నా సేవా సమితి'పేరుతో ఓ సంస్థను 2016లో కూకట్‌పల్లి, వివేకానందా కాలనీ అడ్రస్‌తో రిజిస్టర్ చేశారు. అనంతరం షాపూర్‌లోని లక్ష్మి ప్రిటింగ్ ప్రెస్‌లో 'హరీష్ అన్నా సేవా సమితి'కి వెంకటేష్ ఉపాధ్యక్షులుగాను, రాజేష్‌కుమార్ ప్రధానకార్యదర్శిగాను పుస్తకాన్ని ముద్రించారు. పథకం ప్రకారం పుస్తకంలోని ముందు పేజీలల్లో బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రము ఖ వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, బిల్డర్లుతోపాటు ప్రముఖులు లక్షలల్లో విరాళాలు ఇచ్చినట్టు పుస్తకంలో వారంతట వారే రాసుకున్నారు. వాటిని బిల్డర్లకు, వ్యాపార వేత్తలకు, ప్రముఖలకు చూపించి మీరుకూడా విరాళాలు రాయాలంటూ వసూళ్లకు పాల్పడుతున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫో ర్స్ పోలీసులు పంజాగుట్ట పోలీ సులతో కలిసి ప్రత్యేక నిఘావేశారు. డీసీపీ పీ.రాధా కిషన్ రావు ఆదేశాలతో ఇద్దరు నింది తులను అరెస్టు చేశారు. విచారణలో డబ్బుల కోసం తామంతట తామే ప్రముఖులు విరాళాలి చ్చినట్టు పుస్తకంలో రాసు కుని ఆ రిసిప్టలను ఇతరు లకు చూపించి పెద్దమొత్తంలో విరాళాలు సేకరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంజాగుట్ట ఏసీపీ ఎస్.మో హన్ కుమార్, టాస్క్‌ఫోర్సు ఇన్‌స్పెక్టర్ టీ.శ్రీనాథ్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సీ.హరిచంద్రారెడ్డి, ఎస్ఐలు బీ.అశోక్ రెడ్డి, బీ.అరవింద్ గౌడ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి యాత్రలో భాగంగా 66వ రోజు ఎమ్మెల్యే పర్యటన

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ 131 డివిజన్ పరిధిలోని వాజ్ పాయ్ నగర్ లో 'ప్రగతి యాత్ర'లో భాగంగా 66వ రోజు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ బుధవారం పర్యటించారు. మాజీ కార్పొరేటర్ కేఎం గౌరేష్‌తో కలిసి పాదయాత్ర చేస్తూ పూర్తి చేసిన సీసీ రోడ్లు పరిశీలించారు. కాగా తమ బస్తీ అభివద్ధికి ఎల్లవేళలా సహాయ సాకారాలు అందిస్తున్నందుకు ఎమ్మెల్యేకు స్థానికులు ఘన స్వాగతం పలికి, కతజ్ఞతలు తెలిపారు. అనంతరం మిగిలిన భూగర్భ డ్రయినేజ్, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి కషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. దాంతో ఎమ్మెల్యే త్వరలోనే వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న అధికారులను



ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ పాపమ్మ, మాజీ కౌన్సిలర్ సూర్య ప్రభ, బీఆర్ ఎస్ నియోజకవర్గం యూత్ ప్రెసిడెంట్ సోమేష్ యాదవ్, డివిజన్ ప్రెసిడెంట్ దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, నార్ల కంటి బాలయ్య, భాస్కర్ రాజు , ఉమేష్ , యాదగిరి , జయంచారి , జలిగం రాకేష్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్ట్ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి : ఎమ్మెల్యే



కుత్బుల్లాపూర్ 131 డివిజన్ పరిధి లోని కాకతీయ నగర్ మార్కెట్ వద్ద రూ.88 లక్షలతో చేపడుతున్న కల్వర్టు నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, అధికారులు, మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్‌తో కలిసి పరిశీలించారు. ఇప్పటికీ 40 శాతం పనులు పూర్తి కావడంతో మరింత వేగంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్‌ను వెంటనే రిపేర్ చేయాలి

- సీపీఐ(ఎం) కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం శంకర్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హైదర్‌నగర్ ట్రాఫిక్ సిగ్నల్‌ను వెంటనే రిపేర్ చేయాలని సీపీఐ(ఎం) కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం హైదర్‌నగర్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద సీపీఐ(ఎం) నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా హైదర్‌నగర్ బస్తీ మెయిన్ రోడ్ వద్ద సిగ్నల్ రానందువల్ల స్థానిక ప్రజలు రోడ్డు దాటడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై ట్రాఫిక్ అధికారులకు, టెక్నీషియన్ ప్రదీప్ కుమార్‌కు నాలుగు రోజుల కిందటే విన్నవించినా నేటికీ సిగ్నల్‌ను బాగు చేయలేదని తెలిపారు. కావున సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సిగ్నల్ వద్ద నిరసన తెలుపుతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రజల సౌకర్యార్థం అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం శంకర్, పార్టీ నాయకులు ఎం శంకర్, బీ. శ్రీను, నరసింహ, వెంకటయ్య, అశోక్, మహేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ ప్రజాగర్జన పోస్టర్ విడుదల

నవతెలంగాణ-దుండిగల్

జూన్ 4న కొత్తగూడంలో జరగబోయే ప్రజా గర్జన బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను సీపీఐ నాయకులు ఆశి.యాదయ్య అధ్వర్యంలో బుధవారం నిజాంపేట్ వార్డు కార్యాలయం వద్ద విడుదల చేశారు. ముఖ్య అతిథిగా సీపీఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండకట్టడానికే ఈ ప్రజా గర్జన బహిరంగ సభ అని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం తీసుకోవలసిన చర్యల గురించి, అలాగే ప్రజలు ఎటు వైపు పోవాలి అనే విషయాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

కేపీహెచ్‌బీ డివిజన్ సమస్యలపై కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కేపీహెచ్‌బీ డివిజన్‌లో సమస్యలపై బుధవారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పర్యటించారు. ముందుగా వసంత్ నగర్, మెడోలండ్స్, డైమండ్ ఎస్టేట్, డ్రీమ్ వ్యూ కాలనీలో పర్యటించారు. వసంత నగర్‌లో ప్రధా నంగా హెూటల్స్ నుంచి వచ్చే వ్యర్థాల వల్ల డ్రయినేజీ బ్లాక్ అవుతుందని, అలాగే డ్రయినేజీని సరిగా శుభ్రం చేయడం లేదని మందడి శ్రీనివాసరావు దష్టికి ప్రజలు తీసుకొచ్చారు వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని, డ్రయినేజీ ఎక్కడా బ్లాక్ అవ్వకుండా హెూటల్స్ వారికి గట్టి హెచ్చరికలు జారీ చేయాలని అధికారులకు కార్పొరేటర్ తెలిపారు అలాగే డ్రయినేజీని ఎప్పటికప్పుడు శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మెడో ల్యాండ్స్‌లో పర్యటిస్తూ కాంపౌండ్ వాల్ నిర్మాణం త్వరితగ తిని పూర్తి చేయాలని.. పిల్లలకు, మహిళలకు సంబంధించి పార్కుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రధానంగా పైప్‌లైన్ నిర్మాణం వల్ల అక్కడక్కడ రోడ్లు పెండింగ్‌లో ఉండడాన్ని స్థానికులు తెలపగా దీనిపై పనులు జాప్యం జరగకుండా చూడాలని, ప్రజలకు ఎక్కడా ఎటువంటి ఇబ్బంది కలకుం డా చేయాలని కార్పొరేటర్ సూచించారు. వీధి దీపాలు, ఎలక్ట్రిక్ పోల్స్ కు సంబంధించి ఫిర్యాదులు మేరకు వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు సహాయ సహకారాలతో ఎక్కడా ఎటువంటి ఇబ్బం దులు లేకుండా ప్రజలకు కావలసిన అన్ని సౌకర్యాలు అందించడానికి ఈ పాద యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇంకా ఏదైనా ఇబ్బంది ఉన్న ఎడల తమ కార్యాలయంలో సంప్రదించవచ్చున్నారు. కార్యక్రమంలో ఏఈ సాయి ప్రసాద్, హెచ్ ఎం డబ్ల్యు ఎస్ వెంకటేష్ , టి. ఎస్. ఎస్ .పి .డి సి .ఎల్ లింగస్వామి, జీహెచ్ఎంసీ డాక్టర్ సాల్మన్, ఎస్ఆర్‌పీ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏ కష్ణ, రాజేష్, ఎంటమాలజీ శ్రీనివాస్, స్ట్రీట్ లైట్ పుల్లారావు రాంకీ హరికష్ణ, టౌన్ ప్లానింగ్ రమేష్, రాజేష్, పాతురు గోపి ,గోపాల్ ,భవాని భారతి, కృష్ణకుమారి ,హేమ, వెంకటరెడ్డి, కాలనీ అసోసియేషన్ సభ్యులు అధికారులు పాల్గొన్నారు...

కుతుబుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాల్టీ బహదూర్ చౌరస్తా వద్ద ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు కొలను హనుమంత రెడ్డి, బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ లు హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్ట కమిటీ వారిని సన్మానించారు. నవతెలంగాణ-దుండిగల్





అనంతుల కరుణాకర్ రెడ్డి సేవలు శ్లాఘనీయం

- పారిశ్రామిక వేత్తలు
- పంచశీల కాలనీ ఇండస్ట్రియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరుణాకర్‌రెడ్డి సంతాప సభ



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట.

ప్రముఖ పారిశ్రామికవేత్త, యాంకర్ పరిశ్రమల అధినేత, శ్రీ లలితా పరమేశ్వరి దేవాలయ చైర్మెన్ అనంతుల కరుణాకర్ రెడ్డి సేవలు శ్లాఘనీయమని పలువురు పారిశ్రా మికవేత్తలు అన్నారు. మంగళవారం సాయంత్రం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి పంచశీల కాలనీలోని యాంకర్ ఇంజనీరింగ్ ప్రయివేటు లిమిటెడ్ పరిశ్రమ ప్రాంగణంలో పంచశీల కాలనీ ఇండస్ట్రియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో అనంతుల కరుణాకర్‌రెడ్డి సంతాప సభ ఏర్పాటు చేశారు. అనంతరం పారిశ్రామికవేత్తలతో పాటు కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, సన్నిహితులు, ఆయన చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ,శ్రీ లలితా పరమేశ్వరి దేవాలయ కమిటీ అధ్యక్షులు లయన్ .డాక్టర్ చిల్లా రాజశేఖర్ రెడ్డి సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గత రెండున్నర దశాబ్దాలుగా ఈ ప్రాంత పరిశ్రమల, కార్మికుల మనుగడ కోసం కరుణాకర్‌రెడ్డి ఎంతో కృషి చేశారని, దేవాలయం అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుప డేవారని గుర్తు చేసుకుంటూ ఆయన సేవలను కొనియా డారు. అందరితో కలుపుగోలుగా ఉండే కరుణాకర్ రెడ్డి తమ మధ్య లేకపోవడం తీరనిలోటని, జీర్ణించుకోలేకపోతు న్నామన్నారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రెడ్డి భార్య అనం తుల రజిత, కుమార్తెలు చరిత, నిఖిత, అల్లుడు స్వరూప్ రెడ్డిలు మాట్లాడుతూ కరుణాకర్‌రెడ్డి ఆశయ సాధనకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రామిక వేత్తలు (వి.వి.ఈ. ట్రాన్స్‌ఫార్మర్ అధినేత) యువ పారిశ్రామికవేత్త, ఐ.వినోద్, జి. కిషోర్ బాబు, వాసం బాలరాజు, నాగరాజు గౌడ్, పంచశీల కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గోపాల్ రెడ్డి, మాజీ అధ్యక్షులు పి.సతీష్ రెడ్డి, కేఎల్.రమణారెడ్డి, లయన్. విష్ణువర్ధన్ రెడ్డి, లయన్. వెంకటేశ్వర్ రెడ్డి, రామిని శ్రీనివాస్, రాజిరెడ్డి, వెంకట్ రెడ్డి, పరిశ్రమ కార్మికులు,సన్నిహితులు పాల్గొని నివాళులు అర్పించారు.



కల్లాల్లో కల్లోలం

- అకాల వర్షాలకు తడుస్తున్న ధాన్యం
- మిల్లర్ల తరుగు దోపిడీ
- కాంటా వేసినా దించుకోని మిల్లర్లు
- సివిల్ సప్లయ్ అధికారుల ఆదేశాలు బేఖాతర్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ధాన్యం పండించిన రైతుల పరిస్థితి దీనంగా మారింది. యాసంగి సీజన్ పంటల సాగు ఆశాజనకంగా సాగినా అకాల వర్షాల వల్ల తీవ్ర నష్టం వాటిల్లింది. ఉన్న ధాన్యాన్ని అమ్ముకుందామంటే తేమ, తాలు పేర కొనుగోళ్ల ప్రక్రియ సవ్యంగా సాగట్లేదు. తరుగు పేర మిల్లర్లు దోపిడీకి పాల్పడుతుండటంతో అన్నదాత అరిగోశ పడుతున్నాడు. తరుగు తీస్తే తప్ప కాంటా వేసిన ధాన్యం బస్తాలను దించుకోబోమని మిల్లర్లు బెదిరిస్తున్నారు. దీంతో కల్లాల్లో ధాన్యం రాసులు కదలట్లేదు. దిక్కులేని పరిస్థితుల్లో రైతులు రోడ్లెక్కి ఆందోళన చేస్తున్నారు. ఈ సమస్యతో రాష్ట్రంలో ఎక్కడో ఒక చోట ఆందోళనలు జరగని రోజంటూ లేదు. సివిల్ సప్లయ్ అధికారుల ఆదేశాలను మిల్లర్లు బేఖాతర్ చేస్తుండటం గమనార్హం.

ధాన్యం పండించడం కంటే అమ్ముకోవడమే కష్టంగా మారింది. వర్షాలకు తోడు మిల్లర్ల ఇష్టారాజ్యం.. అధికారుల పర్యవేక్షణ లోపంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వర్షాలకు ధాన్యం తడిసి రంగు మారడం, మొలకెత్తడాన్ని ఆసరా చేసుకుంటున్న మిల్లర్లు బహిరంగంగానే దోపిడీకి పాల్పడుతున్న ఉదంతాలున్నాయి. వారు చెప్పిందే వేదం అన్నట్టుగా సాగుతోంది. అధికారుల మొక్కుబడి పర్యటనలు తప్ప నిర్దిష్టమైన చర్యలు తీసుకోవడం లేదని తెలుస్తోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మెదక్ జిల్లాలో 2.24 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. జిల్లా వ్యాప్తంగా 411 కొనుగోలు కేంద్రాల ద్వారా 4.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 407 కేంద్రాల ద్వారా 25880 మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. లక్షా 7300 మెట్రిక్ టన్నుల వరకు ధాన్యాన్ని మిల్లర్లకు అప్పజెప్పారు. ఇంకా 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు రావాల్సి ఉంది. సంగారెడ్డి జిల్లాలో 1.01 లక్ష ఎకరాల్లో వరి సాగైంది. 200 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 2.07 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు లక్ష మెట్రిక్ టన్నుల వరకే కాంటా వేశారు.

సవ్యంగా సాగని కొనుగోళ్లు

ప్రతి గింజ కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్నా ఆచరణ ముందుకు సాగట్లేదు. ఏప్రిల్ నుంచే ధాన్యం మార్కెట్‌కు వచ్చినా కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. అకాల వర్షాలు పడటంతో తడిసిన ధాన్యం కాంటా వేయకూడదని కొనుగోళ్లల్లో జాప్యం జరిగింది. వర్షాలు తగ్గుముఖం పట్టాక మే మొదటి నుంచి వేగం పెంచారు. అప్పటికే ధాన్యం తడిసి పోయింది. రంగు మారడం, మొలకెత్తడం వల్ల కాంటా వేయలేదు. వాతావరణం అనుకూలించాక కాంటా వేయడంలో వేగం పెంచినా ఆ మేరకు ధాన్యం బస్తాలను వెనువెంటనే మిల్లర్లు దిగుమతి చేసుకోవడం లేదు. దాంతో మళ్లీ కాంటాలు నెమ్మదించాయి. కల్లాల్లో ధాన్యం రాసులు కదలని పరిస్థితి ఏర్పడింది. మళ్లీ వర్షాలు పడుతుండటంతో కాంటా వేసిన బస్తాలు, రాసులు తడిసిపోతున్నాయి. తూప్రాన్, నర్సాపూర్, నంగునూరు, హత్నూర్, చిలిపిచేడు, మెదక్, సదాశివపేట, సంగారెడ్డి, హుస్నాబాద్ వంటి ప్రాంతాల్లో రైతులు ఆందోళనలు చేయాల్సి వచ్చింది.

మిల్లర్ల తూకం దోపిడీ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసేటప్పుడే బస్తాకు కొంత తరుగు తీస్తున్నారు. 40 కిలోల తూకం వేస్తున్నారు. ఖాళీ బస్తా 650 గ్రాముల బరువుతోపాటు 5 నుంచి 8 కిలోల వరకు ధాన్యం అదనంగా జోకుతున్నారు. రైతుల ఆందోళనతో మిల్లర్లు కొంత పంథా ఎంచుకున్నారు. కాంటా వేసే సమయంలో కాకుండా లారీ లోడును మిల్లులో అన్‌లోడ్ చేసే సమయంలో లారీకి టోక్‌గా 18 క్వింటాళ్ల వరకు తరుగు తీసేందుకు అంగీకరిస్తేనే ధాన్యం దించుకుంటున్నారు. రైతులు అంగీకరించకపోతే లారీలను మిల్లు బయటే ఉంచుతున్నారు. దీంతో నర్సాపూర్, మెదక్, కౌడిపల్లి, తూప్రాన్, రామాయంపేట ఇతర మిల్లుల వద్ద 20 నుంచి 30 లారీల వరకు ధాన్యం లోడుతో ఉండిపోతున్నాయి. ఐదారు రోజుల వరకు దించుకోని పరిస్థితి ఉండటంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటా వేసే పని ఆపేస్తున్నారు. దీంతో ఎక్కడి ధాన్యం రాసులు అక్కడే ఉంటున్నాయి.

ధాన్యం కొనుగోళ్లలో వేగం: వనజాత, డీఎస్‌ఓ సంగారెడ్డి

ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నాం. ధాన్యాన్ని కాంటా వేసిన వెంటనే ఎగుమతి చేసేందుకు అవసరమైన లారీలను ఏర్పాటు చేస్తున్నాం. మిల్లర్లు ఎప్పటికప్పుడూ ధాన్యాన్ని దించుకునేలా చూస్తున్నాం. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నాం. తూకం పేర అదనంగా కాంటా వేయడం, మిల్లు పాయింట్ వద్ద తరుగు తీయడం జరగకుండా చూస్తున్నాం.

ధాన్యం కొనుగోళ్లల్లో సమస్యలు: జయరాజు, సీపీఐఎం జిల్లా కార్యదర్శి

తేమ పేరిట కాంటా వేయకపోవడంతో రైతులు వారాల తరబడి కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. ఆరబెట్టుకోవడానికి స్థలం లేదు. కొద్దిపాటి తేమ ఉన్నా కాంటా వేసేందుకు నిరాకరిస్తున్నారు. యుద్ధప్రాతిపాదికన రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. మళ్లీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున ధాన్యం కోనుగోళ్లను వేగంగా పూర్తి చేయాలి. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు రోజువారీగా పర్యవేక్షించి రైతులు నష్టపోకుండా చూడాలి.

యాసంగి పంటలపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



యాసంగి పంటల సాగును ముందుకు జరిపేందుకు ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం తొలి సమావేశం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగింది. దీనికి వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అధ్యక్షత వహించారు. మంత్రులు గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, కొప్పుల ఈశ్వర్, ఇంద్రకరణ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ తెలంగాణ రాకతో వ్యవసాయ రంగ స్వరూపం పూర్తిగా మారిపోయిందనీ, సాగు నీరు, ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుబీమా, పంటల కొనుగోళ్లతో రైతులో ఆత్మస్థైర్యం పెరిగిందని అభిప్రాయపడ్డారు. కానీ యాసంగి వరి పంట కోతల ఆలస్యం కారణంగా అకాల వర్షాలతో రైతులతో పాటు ప్రభుత్వానికీ నష్టం జరుగుతుందని చెప్పారు. దీని నివారణకు యాసంగి పంట కాలాన్ని ముందుకు జరిపేందుకు ఏ రకమైన విధానాలు అవలంబించాలో సలహాలు, సూచనలు ఇవ్వాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారుల్ని కోరింది. యాసంగి సాగులో యాజమాన్య పద్ధతులు, తక్కువ కాలంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి ఇచ్చే వరి రకాల సాగు తదితర అంశాలపై చర్చించారు. దీనిపై శాస్త్రవేత్తలు, నిపుణులు, అధికారుల అభిప్రాయాలు తీసుకోవాలని నిర్ణయించారు. మరోసారి సమావేశమై మరింత లోతైన అధ్యయనం చేసి, సీఎం కేసీఆర్‌కు నివేదిక ఇవ్వాలని నిర్ణయించారు.

బీజేపీ ప్రభుత్వ తిరోగమన నిర్ణయాలను సమీక్షిస్తాం

- కర్నాటక మంత్రి ప్రియాంక ఖర్గే

బెంగళూరు : పాఠ్యపుస్తకాల్లో మార్పులతో సహా గత బీజేపీ ప్రభుత్వం తీసుకున్న అన్ని తిరోగమన నిర్ణయాలను సమీక్షిస్తామని కర్నాటకలో నూతనంగా కొలువుతీరిన కాంగ్రెస్ మంత్రి ప్రియాంక ఖర్గే బుధవారం తెలిపారు. మత మార్పిడి నిరోధక చట్టం, గో హత్య నిరోధక చట్టంతో సహా బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన అన్ని చట్టాలను కాంగ్రెస్ సమీక్షిస్తుందని చెప్పారు. కర్నాటకలో హిజాబ్ వివాదంపై కూడా మంత్రి స్పందించారు. హిజాబ్ సమస్యను చట్టపరంగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక శ్రేయస్సు, రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు కాపాడే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రి చెప్పారు.

ఆటలు

నిర్ణయానికి సమయమున్నది

రిటైర్మెంట్‌పై ఊహాగానాల నేపథ్యంలో ధోనీ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : ఐపీఎల్ నుంచి రిటైర్మెంట్ విషయంలో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) కెప్టెన్ మహేంద్ర సింగ్ అనేక ప్రకటనలు చేస్తున్నారు. ఈ ప్రకటనలలో అంతరార్థం ఇప్పటికీ ఎవరికీ అంతు చిక్కటం లేదు. అసలు ధోని మనసులో ఏమున్నదో అన్నదానిపై క్రీడాలోకంలో తీవ్ర ఆసక్తి నెలకొన్నది. ఈ తరుణంలో ధోని కీలక వ్యాఖ్యలు చేశారు. గుజరాత్ టైటాన్స్‌తో క్వాలిఫైయర్ మ్యాచ్‌లో విజయం అనంతరం ఆయన మాట్లాడుతూ.. "నిర్ణయం తీసుకోవడానికి ఇంకా సమయం ఉన్నది. ఎందుకంటే తదుపరి ఐపీఎల్ వేళం ఈ ఏడాది డిసెంబర్‌లో ఉన్నది. నాకింకా 8 నుంచి 9 నెలల సమయం ఉన్నది. ఆ తలనొప్పి ఇప్పుడెందుకు?" అని ధోని అన్నాడు. అయితే, ధోని ప్రకటనతో ఐపీఎల్ నుంచి ఆయన నిష్క్రమిస్తారన్న వార్తలకు తాత్కాలికంగా తెరపడిందని క్రీడా నిపుణులు కొందరు తెలిపారు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన క్వాలిఫైయర్ మ్యాచ్‌లో విజయం సాధించిన సీఎస్‌కే.. పదోసారి ఐపీఎల్ ఫైనల్‌లో అడుగు పెట్టింది. చెన్నైలోని చిదంబరం స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్స్‌ను 15 పరుగుల తేడాతో ఓడించిన సీఎస్‌కే.. ఐపీఎల్ ట్రోఫీ రేసులో మరోసారి నిలిచింది.




విండీస్ క్రికెటర్ డెవాన్ థామస్‌పై ఐసీసీ సస్పెన్షన్ వేటు

న్యూఢిల్లీ : శ్రీలంక ప్రీమియర్ లీగ్ 2021లో ఫిక్సింగ్ పాల్పడ్డాడన్న అభియోగాల నేపథ్యంలో వెస్టిండీస్ వికెట్‌కీపర్, బ్యాటర్ డెవాన్ థామస్‌పై ఐసీసీ సస్పెన్షన్ వేటు వేసింది. థామస్‌పై సస్పెన్షన్ తక్షణమే అమల్లోకి వస్తుందని.. శ్రీలంక క్రికెట్, ఎమిరేట్స్ క్రికెట్ బోర్డ్, కరీబియన్ ప్రీమియర్ లీగ్ యొక్క అవినీతి నిరోధక కోడ్‌ల ప్రకారం అతనిపై ఏడు అభియోగాలు మోపినట్టు వెల్లడించింది. వీటిపై విచారణకు ఏమాత్రం సహకరించడం లేదని తెలిపింది. డెవాన్ థామస్ గతేడాదే టెస్ట్ అరంగేట్రం చేశాడు. అతను విండీస్ తరపున ఒక టెస్ట్, 21 వన్డేలు, 12 టీ20లు ఆడాడు. ఇందులో మొత్తంగా 320 పరుగులు, 36 క్యాచ్‌లు, 4 రనౌట్లు, 8 స్టంపింగ్‌లు చేశాడు. టెస్టుల్లో, వన్డేల్లో బౌలింగ్ సైతం చేసిన థామస్.. ఫార్మాట్‌కు 2 చొప్పున 4 వికెట్లు పడగొట్టాడు.

ఒక్కో డాట్ బాల్‌కు 500 మొక్కలు : బీసీసీఐ

ముంబయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్-16లో భాగంగా బీసీసీఐ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2023 ప్లే ఆఫ్స్ మ్యాచుల్లో నమోదయ్యే ఒక్కో డాట్ బాల్‌కు 500ల మొక్కల చొప్పున నాటాలని బీసీసీఐ నిర్ణయించుకున్నట్టు సమాచారం. మంగళవారం గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరిగిన క్వాలిఫయర్-1 మ్యాచ్ ద్వారా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఎలిమినేటర్, క్వాలిఫయర్-2, ఫైనల్ మ్యాచుల్లోనూ నమోదయ్యే డాట్ బాల్స్ లెక్కల ప్రకారం బీసీసీఐ మొక్కలు నాటనుంది. పర్యావరణ పరిరక్షణను బీసీసీఐ తీసుకున్న నిర్ణయం పట్ల నెటిజన్లు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మంగళవారం గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టీం.. 34 డాట్ బాల్స్, చెన్నై 38 డాట్ బాల్స్ వేశారు. ఈ లెక్కల ప్రకారం బీసీసీఐ 36 వేల మొక్కలు నాటనుంది. బుధవారం జరిగే లక్నో సూపర్ జెయింట్స్, ముంబయి మధ్య జరిగే ఎలిమినేటర్ మ్యాచ్, శుక్రవారం జరిగే క్వాలిఫయర్-2, ఆదివారం జరిగే ఫైనల్లో వేసే డాట్ బాల్స్‌నూ బీసీసీఐ పరిగణనలోకి తీసుకోనుంది



నవచిత్రం


నాగశౌర్య

హీరో నాగశౌర్య తాజాగా నటిస్తున్న చిత్రం 'రంగబలి'. నూతన దర్శకుడు పవన్ బాసంశెట్టి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, ఎస్ఎల్‌వి సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోనాగశౌర్యకి జోడిగా యుక్తి తరేజ నటిస్తోంది.

మన ఊరిలో ఎవడ్రా ఆపేది..

పవన్ సిహెచ్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా ఫస్ట్ సింగిల్ 'మన ఊరిలో ఎవడ్రా అపేది..' పాటను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ పాట లోకల్‌గా ఉండే ప్రాముఖ్యతను వివరిస్తుంది. అనురాగ్ కులకర్ణి ఈ పాటని డైనమిక్‌గా పాడారు. నాగశౌర్య తన మాస్ డ్యాన్స్‌లతో పాటలో గ్రేస్ చూపించారు. జానీ మాస్టర్ అద్భుతంగా కొరియోగ్రఫీ చేశారు. పవన్ బాసంశెట్టి, శ్రీ హర్ష ఈమని కలిసి సాహిత్యం అందించారు. ఈ సినిమాలో నాగశౌర్య విభిన్నమైన పాత్రలో నటిస్తున్నారు. షూటింగ్ చివరి దశలో ఉన్న ఈ చిత్రం జూలై 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. నాగ శౌర్య, యుక్తి తరేజ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: డీవోపీ: దివాకర్ మణి, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్, ఆర్ట్: ఏఎస్ ప్రకాష్.


రవితేజ


కృతిసనన్, ప్రభాస్, సన్నిసింగ్

జూన్ 6న తిరుపతిలో ప్రీ రిలీజ్ వేడుక

ప్రభాస్ లేటెస్ట్‌గా నటిస్తున్న చిత్రం 'ఆదిపురుష్'. ఓమ్ రౌత్ డైరెక్షన్‌లో రూపొందిన ఈ చిత్రాన్ని రామాయణ ఇతిహాసంలోని ఓ ఘట్టంగా తెరకెక్కించారు. ప్రభాస్ రాఘవుడుగా, కృతి సనన్ సీతగా నటించిన ఈ చిత్రంలో సన్ని సింగ్ హనుమంతుడుగా, సైఫ్ అలీఖాన్ రావణుడు పాత్రల్లో నటించారు. ఇప్పటికే ఈ మూవీ ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఓ గొప్ప కథను వెండితెరపై చూడబోతున్నాం అనే ఆసక్తిని అందరిలోనూ క్రియేట్ చేసింది. జూన్ 16న ప్రపంచవ్యాప్తంగా 70 దేశాల్లో భారీ స్థాయిలో విడుదల కాబోతున్న ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు తిరుపతి వేదిక అవ్వడం విశేషం. జూన్ 6న తిరుపతిలో అత్యంత వైభవంగా ఈ వేడుకను మేకర్స్ నిర్వహించబోతున్నారు. ఆ తర్వాత దేశవ్యాప్తంగా మరికొన్ని ప్రీ రిలీజ్ ఈవెంట్స్ చేయనున్నప్పటికీ శ్రీ వెంకటేశ్వరుడు కొలువైన తిరుపతి క్షేత్రంలో తొలి ప్రీ రిలీజ్ ఈవెంట్ జరగడం మరో విశేషం. భూషణ్ కుమార్, క్రిష్ణకుమార్, ఓమ్‌రౌత్, ప్రసాద్ సుతారియా, రెట్రోఫిల్స్ రాజేష్ నాయర్, యూవీ క్రియేషన్స్ వంశీ, ప్రమోద్ ఈచిత్రానికి నిర్మాతలు.

తెలుగులోనూ బ్లాక్‌బస్టర్ ఖాయం..

ఈనెల 5న విడుదలైన మలయాళం సినిమా '2018'. ఈ సినిమా బ్లాక్ బస్టర్ టాక్‌తో ముందుకు సాగుతూ అద్భుతమైన వసూళ్ళను రాబడుతోంది. ఈ సినిమా మొదటి రోజు రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన కలెక్షన్స్ కేవలం రూ.1.85 కోట్లు మాత్రమే. కానీ అనూహ్యంగా ఈ సినిమా కేవలం మౌత్ టాక్‌తోనే పదిహేను రోజుల్లో 150 కోట్లకు పైగా వసూలు చేసింది. మలయాళంలో సంచలనం సృష్టిస్తున్న ఈ సినిమాను తెలుగులో నిర్మాత బన్నీ వాసు రిలీజ్ చేయనున్నారు. తెలుగులో ఈనెల 26న భారీ స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈచిత్రాన్ని మీడియా వారికి ప్రత్యేకంగా ప్రదర్శించారు. అనంతరం జరిగిన


'2018'లో ఒక దృశ్యం

విలేకరుల సమావేశంలో చిత్ర దర్శకుడు జూడ్ ఆంథోనీ జోసెఫ్, సినిమాటోగ్రాఫర్ అఖిల్ జార్జ్, ఎడిటర్ చమన్ చక్కో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి దర్శకుడు హరీష్ శంకర్ ముఖ్య అతిథిగా హాజరై, ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు ఖచ్చితంగా నచ్చుతుందని, నాది హామీ అని అన్నారు. 2018 ఆగస్టు నెలలో ఋతుపవనాల కారణంగా కురిసిన అధిక వర్షాలు వలన కేరళలో అధిక వరదలు సంభవించి, సుమారు 164 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. కేరళ చరిత్రలో సుమారు ఓ శతాబ్దంలో ఇవే అతి పెద్ద వరదలు. దీన్ని బేస్ చేసుకుని దర్శకుడు జూడ్ ఆంథనీ జోసెఫ్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. కేరళలోని ఒక మారుమూల పల్లెటూరు నేపథ్యంలో ఈ కథ జరుగుతుంది. టోవినో థామస్, కున్చాకో బోబన్, వినీత్ శ్రీనివాసన్, అసిఫ్ అలీ, లాల్, అపర్ణ బాలమురళి.. లాంటి ప్రముఖ నటీనటులు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషించారు.

పులుల్ని వేటాడే పులిని ఎప్పుడైనా చూశావా...?

అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకంపై రవితేజ టైటిల్ రోల్ పోషిస్తున్న పాన్ ఇండియా సినిమా 'టైగర్ నాగేశ్వరరావు'. వంశీ దర్శకత్వంలో అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ప్రమోషన్‌లు వినూత్న పద్ధతిలో ప్రారంభమయ్యాయి. ఫియర్స్ అండ్ మెజెస్టిక్ ఫస్ట్-లుక్ పోస్టర్, ఆసక్తికరమైన కాన్సెప్ట్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. రాజమండ్రిలోని ఐకానిక్ హేవ్‌లాక్ బ్రిడ్జ్ (గోదావరి) వద్ద గ్రాండ్‌గా ఈ ఫస్ట్-లుక్ లాంచ్ ఈవెంట్ జరిగింది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో రవితేజ ఫెరోషియస్ టైగర్‌లా రగ్గడ్ గెటప్‌లో కనిపించారు. ఈ పోస్టర్ వీడియోలో తెలుగు వెర్షన్‌కి వెంకటేష్ వాయిస్ ఓవర్ ఇవ్వగా, జాన్ అబ్రహం, శివ రాజ్‌కుమార్, కార్తీ, దుల్కర్ సల్మాన్ వరుసగా హిందీ, కన్నడ, తమిళం, మలయాళ భాషలలో అగ్ర హీరోలు టైగర్ నాగేశ్వరరావు ప్రపంచాన్ని పరిచయం చేశారు. ఇందులో "జింకల్ని వేటాడే పులుల్ని చూసుంటావ్. పులుల్ని వేటాడే పులిని ఎప్పుడైనా చూశావా?' అని రవితేజ చెప్పిన డైలాగ్ ఆయన పాత్ర స్వభావాన్ని తెలియజేస్తోంది. సూపర్‌స్టార్ల వాయిస్ ఓవర్‌లు ప్రజంటేషన్‌ని మరింత ఆసక్తికరంగా మార్చాయి. ఫస్ట్‌లుక్ లాంచ్ ఈవెంట్‌లో దర్శకుడు వంశీ మాట్లాడుతూ,'ఫస్ట్‌లుక్‌ని ఇంత గ్రాండ్‌గా లాంచ్ చేసిన నిర్మాతలకు కృతజ్ఞతలు. రవితేజ అభిమానుల ఆకలి తీరేలా ఈ సినిమా ఉంటుంది. ఈ సినిమా చాలా బాగా ఆడుతుందని నమ్ముతున్నాను. అక్టోబర్ 20న సినిమాని మిస్ కావద్దు' అని అన్నారు. 'కొన్ని దారి రాస్తుంది. కొన్ని నేను రాస్తాను .వాళ్ళు కష్టాలు రాస్తూ ఉంటారు. నేను గమ్యం రాసేస్తాను. నా రెక్కలు మీరు కోసేసిన నేలపై వుండి నింగిని రాసేస్తాను' ఇదీ మా టైగర్ నాగేశ్వరరావు' అని నిర్మాత అభిషేక్ అగర్వాల్ చెప్పారు. మయాంక్ మాట్లాడుతూ, 'ఫస్ట్ లుక్‌లో రవితేజ మునుపెన్నడూ కనిపించని విధంగా, డేంజరస్ లుక్‌లో కనిపిస్తున్నారు' అని తెలిపారు.

ఛాలెంజింగ్ రోల్ చేశా..

తేజ దర్శకత్వంలో అభిరామ్ హీరోగా అరంగేట్రం చేస్తున్న యూత్ ఫుల్‌లవ్, యాక్షన్ ఎంటర్‌టైనర్ 'అహింస'. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై పి కిరణ్ నిర్మిస్తున్నారు. జూన్ 2న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో హీరోయిన్ గీతికా తివారీ మీడియాతో ముచ్చటించారు. 'మాది మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్. గ్రాడ్యుయేషన్ తర్వాత కొన్ని కమర్షియల్ యాడ్స్ చేశాను. తర్వాత సినిమాల్లోకి రావాలని డిసైడ్ అయ్యాను. టాలీవుడ్‌లో ఆడిషన్స్ ఇచ్చే క్రమంలో దర్శకుడు తేజని కలిస్తే, ఆయన ఈ సినిమా ఆడిషన్స్‌కి పిలిచారు. కొత్త వారిని పరిచయం చేయడంలో ఆయనది లక్కీ హ్యాండ్. ఆయన సినిమా ద్వారా లాంచ్ కావడం అదృష్టం. ఇందులో నా పాత్ర పేరు అహల్య. అమాయకత్వం నుంచి స్ట్రాంగ్‌అండ్ పవర్‌ఫుల్‌గా ఎదిగే పాత్ర. తనకి ప్రేమపై నమ్మకం ఉంటుంది. నాది చాలా కీలకమైన పాత్ర. చాలా కష్టాలు ఎదుర్కొంటూ వెళ్ళే ఈ పాత్ర ప్రయాణం నాకు చాలా నచ్చింది. అలాగే సవాలుగా అనిపించింది. తేజ హీరోయిన్‌లను అద్భుతంగా చూపించే మార్క్‌లోనే ఉంటుంది. అభిరామ్‌తో వర్క్ చేయడం ఎలా హ్యాపీగా అనిపించింది. ఆర్పీ పట్నాయక్ వండర్‌ఫుల్ మ్యూజిక్ ఇచ్చారు. ఇందులో సదా అడ్వకేట్ పాత్రలో, చాలా స్ట్రాంగ్ రోల్ చేశారు.


గీతికా తివారి

మెప్పించే ది ట్రయల్

ఎస్ఎస్ ఫిల్మ్స్, కామన్ మేన్ ప్రొడక్షన్స్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'ది ట్రయల్'. స్పందన పల్లి, యుగ్ రామ్, వంశీ కోటు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి రామ్ గన్నీ దర్శకుడు. స్మృతి సాగి, శ్రీనివాస్ కె నాయుడు నిర్మాతలు. లేటెస్ట్‌గా ఈ చిత్ర టీజర్‌ను రచయిత శ్రీకాంత్ విస్సా, సంగీత దర్శకుడు రఘు కుంచె, హీరో రక్షిత్ అట్లూరి చేతుల మీదుగా విడుదల చేశారు.

ఈ సందర్భంగా దర్శకుడు రామ్ గన్నీ మాట్లాడుతూ, 'ఇదొక లేడీ ఓరియంటెడ్ కథ. ఓ మహిళ, ఆమె భర్త చుట్టూ జరిగే ఓ కాన్స్పిరసీ. ఒక సంఘటన జరుగుతుంది. ఆ సంఘటన చుట్టూ కథనం సాగుతుంది' అని తెలిపారు.

హీరో యుగ్‌రామ్ మాట్లాడుతూ,'మా దర్శకుడు,



వంశీ కోటు, స్పందన పల్లి, యుగ్ రామ్

ప్రొడ్యూసర్స్, నా తోటి ఆర్టిస్టులతో పాటు టెక్నీషియన్స్ అందరం చాలా కష్టపడి చేశాం. చిన్న సినిమాలా అస్సలు కనిపించదు. ట్రైలర్ ఇంకా బావుంటుంది. సినిమా కూడా మీ అందరికీ నచ్చుతుంది' అని అన్నారు. 'ప్రతి హీరోయిన్ ఇలాంటి పాత్ర చేయాలనుకుంటుంది. థ్రిల్లర్ సినిమా అయినా చాలా ఫన్‌గానూ ఉంటుంది' అని హీరోయిన్ స్పందన చెప్పారు. హీరో వంశీ కోటు మాట్లాడుతూ, 'ఈ సినిమాకు అసలు హీరో అంటే స్పందన. టీజర్ మాదిరిగానే సినిమా కూడా అందరినీ ఎట్రాక్ట్ చేస్తుంది' అని అన్నారు.

'మా డైరెక్టర్ రామ్ అద్భుతంగా వర్క్ చేశాడు. శర్వా మంచి మ్యూజిక్ ఇచ్చాడు. మా ఆర్టిస్టులంతా చాలా బాగా నటించారు. స్పందన ఇంకా బాగా యాక్ట్ చేసింది. ఈ మూవీ మంచి విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాం' అని నిర్మాత సతీష్ వర్మ అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

కర్నాటక దేశానికందించిన సందేశం!



పాతూరి వెంకటేశ్వరరావు 9849081889

"బీజేపీ తిరోగమన పాలనను చూస్తూ ఊరుకోదు - ఇండియా రియాక్ట్" అన్న కేసీఆర్ మాటను, మొన్న మునుగోడు - నిన్న హిమాచల్‌ప్రదేశ్ - నేడు కర్నాటక రుజువుచేశాయి. అయితే కన్నడ ప్రజలు దేశానికొక వినూత్న సందేశాన్నందించారు. మోడీ ప్రభుత్వం మామూలుగా ఎన్నికలు నిర్వహించి ఉంటే, బహుశా కన్నడ ప్రజలంత తీవ్రంగా స్పందించి ఉండేవారు కాదేమో? కానీ 40శాతం కమీషన్ల బురదలో పొర్లాడుతున్న బొమ్మై ప్రభుత్వం ఒకవైపు, కోట్లాది రూపాయల నోట్లతో పట్టుబడ్డ బీజేపీ మంత్రి ఇంకోవైపు కేంద్రం నిర్లక్ష్యపు ధోరణి, అమర్థతను చాటిచెప్పాయి. అంతర్జాతీయ అవినీతి పరునిగా అపఖ్యాతి పాలైన అదానీవైపు గానీ కన్నెత్తి చూడని మోడీ ప్రభుత్వం, కాంగ్రెస్ వాళ్ళు అవినీతి పరులన్న అపఖ్యాతిని ప్రజల్లో వ్యాపింపజేయాలని చూశారు. వ్యవస్థల దాడులతో ఊపిరాడ కుండా చేసి, ఎన్నికల ప్రచారంలో వాళ్ళు పూర్తిగా నిమగ్నం కాలేని స్థితిని కల్పించే లక్ష్యంతో ముందుకు సాగారు. కాంగ్రెస్ ప్రముఖులు వాళ్ళ అనుచరులపై వ్యవస్థలను ఉసిగొల్పారు. రాహుల్‌గాంధీ జోడో యాత్ర ఇమేజ్‌ని చెరిపేసేందుకని అతనిపై కేసు బనాయించి, శిక్షించించే ఈ నేపథ్యంలో కర్నాటకలో ఎన్నికలను ప్రకటింపజేసింది మోడీ ప్రభుత్వం.

కుట్రపూరిత బీజేపీ అంతర్యాన్ని గ్రహించి కర్నాటక కాంగ్రెస్‌కు ఉత్తర, దక్షిణ ధృవాల వంటి శివకుమార్, సిద్ద రామయ్యలు ప్రజలముందుకొచ్చారు."మేం చేయీ, చేయీ కలిపి నడుస్తాం! బీజేపీని మట్టిగరిపిస్తాం" మంటూ భరోసా కల్పించారు. దాంతో ఊగిసలాటలో ఉన్న తటస్థ ఓటర్లు ధైర్యంగా కాంగ్రెస్‌వైపు మొగ్గారు. ఉదాహరణకు ఎన్నికలకు రెండ్రోజుల ముందుగా బీజేపీ మద్దతు దారులైన లింగాయత్‌లు కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించటం అందుకొక నిదర్శనం! "నేనే కింగ్! మాకధికా రాన్నప్పగిస్తే బీజేపీకైనా, కాంగ్రెస్‌కైనా మద్దతిస్తామంటూ తన అధికార దాహాన్ని, అవకాశవాదాన్ని చాటుకున్నాడు కుమారస్వామి గౌడ, కానీ తరాలుగా అతనికి మద్దతిస్తున్న ఒక్కళిగలు తదితరులు కూడా బీజేపీని ఓడించాలన్న కసితో ఉన్నారు. అందుకే కుమారస్వామి జేడీఎస్‌ను తిరస్కరించి కాంగ్రెస్‌కు ఓటేశారు. కుమారస్వామి కొడుకు సినీహీరో నిఖిల్‌గౌడ ఓటమి అందుకొక నిదర్శనం. అలాగే కుమారస్వామి వంటి అవకాశవాదితో చేయి కలపకుండా దేశ క్షేమం పట్ల తన నిబద్ధతను ప్రజలకు తెలియజేశాడు కేసీఆర్ అని విశ్లేషకుల అభిప్రాయం! హుబ్లీ ఈస్ట్, బీజాపూర్‌లలో పోటీ చేసిన ఎంఐఎం, మరోచోట జేడీఎస్‌కు మద్దతిచ్చింది. బీజేపీకి బినామీగా, ముస్లింలకు శకునిలా వ్యవహరిస్తుందన్న ఆగ్రహంతో ఎంఐఎంను తిరస్కరించి 'అష్రాఫీ, పస్మాండ, షియా, సున్నీ, బహ్మో తెగల కతీతంగా ముస్లింలంతా సమైక్యంగా కాంగ్రెస్‌ను గెలిపించుకున్నారు. మోడీ హయాంలో బీజేపీ, ఎంఐఎం నేతలు తప్ప, వ్యవస్థల దాడులకు గురికాని బీజేపీయేతర పార్టీలు, నేతలు లేరన్నది నిజం. బీజేపీకి బినామీ ఎంఐఎం అనటానికి ఇంతకన్నా నిదర్శనమేం కావాలి? అని బహిరంగంగానే చర్చించు కుంటున్నారు కన్నడ ముస్లింలు! ఈ



ఎన్నికల సందర్భంగా బీజేపీ పట్ల ఆగ్రహంతో కొందరు కన్నడ యువకులు "ఈ మత విద్వేష బీజేపీ ఢీకొనగల కాంగ్రెస్, కమ్యూనిస్టు, జాతీయ ప్రాంతీయ ఏ పార్టీనైనా గెలిపించుకోవాలన్నన మనలాంటి ఆలోచనలు దేశ ప్రజలందరిలో జ్వలిస్తే ఎంత బాగుంటుందో కదా!" అనుకుం టున్నారట ఆవేశంలో ఉన్న, అర్థవంతం గానే ఆలోచిస్తున్నారు వాళ్ళని విశ్లేషకులంటున్నారు.

బీజేపీ పట్ల కన్నడ ప్రజల్లో అంత వ్యతిరేకతే ఉంటే.. మా ఓటింగ్ శాతం తగ్గి వుండాలి గదా అన్నది బీజేపీ నేతల వాదన. అందుకు ఆత్మ పరిశీలన ద్వారానే వారికి జవాబు దొరుకుతుంది! కర్నాటక ఎన్నికల్లో 1. మోడీతో సహా 15 మంది కేంద్ర మంత్రులు, 128మంది జాతీయ నేతలు అమిత్‌షా, నడ్డాల పర్యవేక్షణలో 19 భారీ బహిరంగ సభలు, 6 భారీ రోడ్డుషోలు, అనేక ర్యాలీలతోపాటు 2. కేరళ ఫైల్స్ సినిమా రిలీజు, దాన్ని గూర్చి మోడీగారి భజన, 3. వేలాది సంఘ్ పరివార కార్యకర్తల ఇంటింటి ప్రచారం 4. మోడీ జై భజరంగ భలీ నినాదాలు 5. హనుమాన్ చాలీసా పారాయణాలు 6. ఉచిత గ్యాస్ సిలెండర్లు, పాలప్యాకెట్లు వగైరా ఉచిత హామీలు 7. ఎన్నికల కమిషన్‌ను జాన్‌దేవ్ అంటూ హిజాబ్ - హలాల్ - లవ్‌జిహాద్" వగైరా మత విద్వేష అస్త్రాల ప్రయోగం. 8. కాంగ్రెస్‌కు ఉగ్ర వాదులతో సంబంధాలున్నాయి, వాళ్ళ అధికారానికొస్తే మతకల్లోలాలు చెలరేగుతాయి, కర్నాటకను భారత్ నుండి విడదీయాలను కుంటున్న దేశద్రోహులు వాళ్ళంటూ ప్రధాని మోడీ, ఆధార రహిత ఆరోపణలు చేశాడు! దేశ ప్రధాని, రక్షణమంత్రి మోడీ, అమిత్‌షాలిలా యధేచ్ఛగా మత విద్వేషాన్ని రెచ్చగొడుతున్నా ఇది చట్ట విరుద్ధమంటూ కాంగ్రెస్ నేతలు మొరపెడుతున్నా ఎన్నికల కమిషన్ చలించలేదు. వ్యవస్థలు మోడీ ప్రభుత్వ చేతి రిమోట్లలా వ్యవహరిస్తున్నా యనటానికి ఇంతకన్నా నిదర్శనమేం కావాలంటున్నారు పలువురు.

ఈ మత విద్వేష ప్రచారానికైన భారీ ఖర్చంతా ప్రజా (ప్రభుత్వ)ధనమేననీ ఓటర్లపై బీజేపీ కురిపించిన నోట్ల వర్షమంతా ఎన్నికల బాండ్ల రూపంలో ఆశ్రిత పెట్టుబడిదారులు బీజేపీ కందించిన భారీ నిధులేననీ ఈసీకి తెలియనిదా? ఇంత చేసినా గ్రామీణ ప్రాంతాలలో భారీగా ఓట్లు కోల్పోయింది బీజేపీ! మతం మత్తింకా దిగని పట్టణ ప్రాంతాలలో మాత్రం కొన్ని ఓట్లను పెంచుకోగలిగింది బీజేపీ! ఇంతగా చెమటోడ్చినా, గతంలో బీజేపీ ఓట్ల శాతం 36.5శాతం నుండి ఈ ఎన్నికల్లో 35.9శాతానికి తగ్గిన మాట వాస్తవం! మరి బీజేపీ పట్ల ప్రజాభిమానం తగ్గినట్లా? లేక బీజేపీ వ్యతిరేక వరదకు తమ ఓటర్లు కొట్టుకుపోకుండా వ్యవస్థలు - విద్వేషాలు - కార్పొరేట్ల నిధులు - కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలతో అడ్డుకట్ట వేసుకున్నట్లా? జవాబు బీజేపీనే చెప్పాలి.అందుకే ప్రస్తుతం రాష్ట్రాలన్నింటా తానే అధికారాన్ని పొందాలన్న పేరాశకు పోకుండా ఆయారాష్ట్రాలలో కాంగ్రెస్, తదితర పార్టీల బలాబలాలను బేరీజువేసుకుని, కాంగ్రెస్ కాధిక్యమున్న చోట బీజేపీ యేతర పార్టీలతో సంఘటితమవుతూ, ప్రాంతీయ పార్టీలకు, ఆధిక్యమున్నచోట వాటికి మద్దతు ప్రకటిస్తూ "మత విద్వేష కార్పొరేట్ బీజేపీ ముక్త్ భారత్" లక్ష్యం దిశగా కృషి చేస్తూ తన దేశభక్తిని మరోసారి చాటుకోవలసిన ఆవశ్యకతను కాంగ్రెస్ విస్మరించకూడదు. ■

మండేకాలం... జర జాగ్రత్త?



మేకిరి దామోదర్ 9573666650

ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ మార్పులు కాలాలకు అతీత (పరస్పర విరుద్ధ) పరిస్థితులను చూస్తున్నాం, అనుభవిస్తున్నాం. వేసవి రాకముందే ఉష్ణోగ్రతలు పెరిగిపోయి ఉక్కపోత, అకాల వర్షాలు... శీతాకాలంలో రాత్రిపూట వేడి, ఇలాంటి వాటి అన్నింటికీ వాతావరణ మార్పులే ప్రధాన కారణం. ఈ పరిస్థితిలే దేశవ్యాప్తంగా కనిపిస్తున్నాయి. 2023లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని అంతర్జాతీయ వాతావరణ శాస్త్రవేత్తలు ముందుగానే ప్రభుత్వాలను హెచ్చరించారు. వాటితో పోరాడేలా అధిక వేడి కార్యాచరణ ప్రణాళికలు... అవగాహన, రక్షణ చర్యలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ పరస్పర విరుద్ధ వాతావరణాలే ఈఎల్‌నినో, లానినా! ఇవి రెండు స్పానిష్ పేర్లు. భూమధ్యరేఖ వెంబడి పసిఫిక్ మహాసముద్రం ఉపరితలంపై అసాధారణ వేడి లేదా... చల్లదనం లాంటివి నమోదవుతుంటాయి. దీనినే సదరన్ ఆసిలేషన్ సిస్టమ్ (ఈఎన్ఎస్ఓ) అంటారు. దీని వలన ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలను, వర్షపాతాన్ని ప్రభావితం చేస్తాయి. ఎల్‌నినో అయితే విపరీతమైన వేడి, తక్కువ వర్షపాతం, లా..నినాలో వర్షాలు విపరీతంగా ఉంటాయి. ఈ రెండు పరిణామాలు ప్రతి నాలుగైదు ఏండ్లకు భ్రమణంలో ఈ రెండు పరిణామాలు ఒకదాని తర్వాత ఒకటి సంభవిస్తాయి. మన దేశంలో 90శాతం భూభాగం వేడి గాలులకు గురయ్యే ప్రమాదం ఉందంటున్నారు. ఆ పరిణామాల ప్రభావం మేరకు ఉదయం నుంచే ఎండ భగభగ మండిపోతుంది. మన దేశవ్యాప్తంగా ఇవే పరిస్థితులు ఉంటున్నాయి. అందులో 1990-2020 మధ్య కాలంలో వడగాల్పుల వల్ల దేశంలో 25,983 మంది మరణించినట్లు ప్రభుత్వ గణాంకాలే చెపుతున్నాయి. 2050 నాటికి దేశంలోని 24నగరాల్లో వేసవి ఉష్ణోగ్రతల సగటు 35డిగ్రీలకు మించి పోనుందని ఓ అంచనా తెలుపుతుంది. ప్రపంచంలో అధిక వేడి ఉంటున్న దేశాల్లో భారత్ ఒకటి కావడం ప్రమాద సంకేతమని అంటున్నారు. అలాగే ప్రకృతి విపత్తుల పరంగా రాష్ట్రంలో వడ గాలులు ఎక్కువగా ప్రాణాలు తీస్తున్నాయి. 2015 నుంచి 2017 వరకు 973 మరణాలు సంభవించాయి. భానుడి భగభగలతో రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 45డిగ్రీలు దాటాయి. ఇప్పటికే సుమారు ఇరవైమంది వరకు చనిపోయినట్టు వార్తలు.

వడగాలుల తీవ్రత... నీటి ఎద్దడి

ఈసారి వడగాలుల తీవ్రత పెరగనుందని అందుకు తగ్గట్టుగా కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు రాబోయే నీటి ఎద్దడిని తట్టుకునేలా వేసవి సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాల్సి ఉంది. వేసవి ఉష్ణోగ్రతలు ఏకంగా గత చరిత్రను తిరగ రాసి రికార్డులు సృష్టిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా మన దేశంలో ఎక్కువ ప్రాణాలు హరిస్తున్న ప్రకృతి విపత్తుల్లో వేసవిలో అగ్ని ప్రమాదాలు, పిడుగులు, సంభవిస్తాయి. ప్రజలు నిత్యావసరాలు, చదువులు, పర్యాటక ప్రయాణాలు, పెళ్లిళ్ల లాంటివి ఎన్నో కార్యక్రమాల కోసం బయటకు తిరగాల్సి ఉంటుంది. ప్రజలు వేసవి కాలంలో వడదెబ్బ బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సి ఉంది. కార్మికులు, కర్షకులు, కూలీలు తదితర పేద, మధ్యతరగతి ప్రజలు వారి జీవనోపాధి కోసం ఏ కాలంలో నైన బతుకుతెరువుకై వ్యవసాయ పనులకు, ప్రభుత్వం వారి ఉపాధి హామీ పనులకు వెళ్లక తప్పదు. కానీ వారి పని వేళల్లో వేసవి మండే ఎండల తీవ్రత దృష్ట్యా మిట్ట మధ్యాహ్నపు వేళలలో పనులను ఆపివేయాలి. ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వీలైనంతవరకు ఉదయం 11గంటలలోపు, సాయంత్రం 4గంటల తర్వాత బయటకు వెళ్లేలా పనులను చక్కబెట్టుకోవాలి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణ ప్రమాదం సంభవిస్తుంది. నిపుణుల హెచ్చరికల దృష్ట్యా వేసవిలోని మండే ఎండల్లో తగు జాగ్రత్తలు, భద్రత పాటించకపోతే వడదెబ్బ బారిన పడి అనారోగ్యాల పాలు కావలసి వస్తుంది. సమస్య తీవ్రమైతే ప్రాణ నష్టం కూడా జరుగుతుంది. అందుకే "చేతులు కాలాక ఆకులు పట్టుకునే" కంటే వేసవికాలంలో పిల్లలు, వృద్ధులు, మధ్య వయస్సువారు అనే తేడా లేకుండా వడదెబ్బ నిశ్శబ్దంగా కబళించి వేస్తుంది. అందుకే ఎండ తగలకుండా ఉండే ప్రయత్నాలు చేయాలి. అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి.

తగు జాగ్రత్తలు అవసరం

వేసవిలో మన ఆరోగ్యం మన చేతుల్లోనే... రక్షిత మంచి నీరు తాగుతుండాలి. మజ్జిగ, నిమ్మకాయ రసం, పండ్ల రసాలు, కొబ్బరి నీరు తీసుకోవడం చాలా మంచిది. ఆహారం మితంగా తీసుకోవాలి. ఈ కాలంలో దొరికే సొర, దోస, పుచ్చకాయ లాంటి నీరు అధికంగా ఉండే ఆకుకూరలు, కూరగాయలు ఆహారంలో తీసుకోవాలి. ముంజలు లాంటివి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఎప్పుడు ఖాళీ కడుపుతో ఉండకూడదు. అనివార్యంగా బయటికి వెళ్లాల్సి వస్తే




గొడుగు తీసుకెళ్లాలి. కండ్లకు కూలింగ్ అద్దాలు, తలకు, ముక్కుకు, రక్షణగా టోపీ లేదా స్కార్ఫ్ గుడ్డ కట్టుకోవాలి. ఆహార పదార్థాలు తీసుకోవడంలో తగు జాగ్రత్తలు పాటించాలి. మసాలాలు, మాంసాహారం, అధికంగా కొవ్వు ఉండే పదార్థాలకు, నూనెలు, వేపుళ్లకు దూరంగా ఉండాలి. టీ, కాఫీ వల్ల శరీరం డిహైడ్రేషన్కు లోనవుతుంది. వీటిని నియంత్రించాలి. అలాగే బట్టలు ముదురు రంగు దుస్తులు వాడరాదు. లేత, తెలుపు, కాటన్ వస్త్రాలు చాలా శ్రేయస్కరం. అంతేకాదు వేడిమిని నియంత్రించగలవు, శరీరానికి చల్లదనాన్ని ఇస్తాయి. సన్ స్క్రీన్ లోషన్ రాసుకోవాలి. సమ్మర్ కిట్‌లో పైన చెప్పిన వాటితో పాటు మెత్తని టవల్ ఓ ఆర్ఎస్, గ్లూకోజ్ ప్యాకెట్లు ఉంచుకోవడం మంచిది. అలాగే ఉష్ణోగ్రతలు అధికమవుతున్నందువల్ల అగ్ని ప్రమాదాలు, విద్యుత్ పరికరాల వాడకంలో, మొబైల్ ఫోన్ల వాడకంలో, ప్రయాణ సాధనాలైన బైకులు, కార్లు వంటి వాడకంలో కూడా తగు జాగ్రత్తలు పాటించాలి. లేని పక్షంలో అత్యధిక ఉష్ణోగ్రత వల్ల ప్రమాదాలు సంభవించి ఆస్తి నష్టం, ప్రాణస్టం కూడా తోడవుతుంది. వేసవి సెలవుల్లో పిల్లలు, పెద్దలు ప్రయాణాంలో అప్రమత్తత ఎంతో అవసరం ఉంది. వేసవి కాలంలో ఎవరైనా ఎండలో తిరగవద్దు అంటారు, తిరగడం తప్పని పరి స్థితిలో ఎక్కడికి అక్కడ తగు జాగ్రత్త తీసుకుంటూ వేసవి చిట్కాలు పాటిస్తూ, మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకునే "మనలో ఉన్న శక్తిని" ఆయుధంగా చేబుని ఆందోళన చెందకుండా ఎండాకాలం గండాన్ని అలవోకగా దాటేసి, హాయిగా వర్షాకాలన్ని ఆహ్వానిద్దాం.., అన్ని కాలాలను అధిగమిస్తూ జీవించడమే మనిషి జీవన స్వభావం. ఇదే ప్రకతి మనకు ఇచ్చిన అద్భుతమైన శక్తి సామర్థ్యం ఏమంటారు..? ■

జీవరాశులను కాపాడుకోవాలి

వన్యప్రాణులు ప్రకృతి సంపదలో ఒక భాగం వన్యప్రాణులు అంటే వన్యప్రాణులను మాత్రమే కాకుండా, పక్షులు, కీటకాలు, మొక్కలు, సూక్ష్మ జీవులతో సహా అన్ని పెంపుడు జంతువులను కూడా కలిగి ఉంటుంది. ఈ భూమిపై ఆరోగ్యకరమైన పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి, అన్ని జీవరాశులను మానవుల వలె ముఖ్యమైనవిగా పరిగణించాలి. అందుకే వన్యప్రాణులను కాపాడుకోవాలి. ఈ భూమిపై ఉన్న ప్రతి జీవికి పర్యావరణ వ్యవస్థలో పాత్ర ఉంది. దురదృష్టవశాత్తు ప్రపంచంలోని అనేక జంతువులు నివాస నష్టం, అక్రమ వేట మొదలైన వాటి కారణంగా క్రమంగా అంతరించి పోతున్న సంఖ్యను పెంచుతున్నాయి. వన్యప్రాణుల వలన ప్రకృతికి మానవాళికి దోహదపడే అంశాలు ఎన్నో ఎన్నెన్నో ఉన్నవి. మన వన్యప్రాణులను రక్షించడానికి ఎటువంటి కఠినమైన చర్యలు తీసుకోకపోతే, మన జంతువుల ఆవాసాల అంతరించిపోవడం మానవ జాతిపై కూడా ఘోరమైన ప్రభావం చూపుతుంది. ప్రతిరోజూ మానవ జీవితం వివిధ ప్రయోజనాల కోసం వ్యవసాయ పంటలు, మొక్కలపై ఎక్కువగా ఆధారపడుతుంది. ఈ పంటల పెరుగుదలలో వన్యప్రాణులు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. పరాగసంపర్కం ద్వారా, ఇది మొక్కలలో పునరుత్పత్తి వ్యవస్థ, దీనిలో మగ పువ్వు నుండి పుప్పొడి గింజలు ఆడపువ్వుకు బదిలీ చేయబడతాయి. అది విత్తనాలను ఉత్పత్తి చేస్తుంది. పరాగసంపర్కం ఎలా జరుగుతుందనే విషయంలో పక్షులు, తేనెటీగలు, కీటకాలు అన్నీ పాత్రలను కలిగి ఉంటాయి. పుప్పొడి మోసే జంతువుల సంఖ్య తగ్గితే పంట పెరుగుదల గణనీయంగా ప్రభావితమవుతుంది.

ఆరోగ్యకరమైన, క్రియాత్మక పర్యావరణ వ్యవస్థకు జీవవైవిధ్యం చాలా ముఖ్యమైనది. పర్యావరణ వ్యవస్థ సున్నితమైనది. సహజ ఆవాసాల నుండి వన్యప్రాణులను సంగ్రహించడం అనివార్యంగా వినాశకరమైన ఫలితాలకు దారితీస్తుంది. ఒకే జాతి అంతరించిపోతే, మొత్తం ఆహార గొలుసు దెబ్బతింటుంది అన్ని జాతులను ప్రభావితం చేస్తుంది. అదేవిధంగా, ఒక జాతి సంఖ్య పెరిగితే, అది పర్యావరణ సమతుల్యతపై



ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. మాంసాహారులు అంతరించిపోతుంటే, శాకాహార జంతువుల సంఖ్య పెరుగుతుంది, తత్ఫలితంగా మనకు అసమతుల్య పర్యావరణ వ్యవస్థ ఏర్పడుతుంది. వ్యవసాయ రంగంలో విప్లమాత్మక మైన మార్పులు రావడంతో అత్యాధునిక సాంకేతిక పరికరాలు ఉపయోగిం చడం వలన సాంప్రదాయంగా ఉపయోగించిన పనిముట్లు కనుమరుగయ్యాయి. వ్యవసాయానికి ఉపయోగపడే పశు సంపద ఎడ్లు దున్నపోతులు, పాడి పరిశ్రమకు అవసరమైన బర్లు ఆవుల సంఖ్య గణనీయంగా పడిపోతున్నది. ఇంతే కాక ఇవి విసర్జించే పేడ ద్వారా సహజమైన సాంప్రదాయ బద్ధమైన ఎరువుల వాడకం కూడా తగ్గిపోతున్నది. మనం అత్యంత వేగంతో ప్రకృతికి భంగం కలిగిస్తుం డటంతో, వాటిని పుస్తకం రూపంలో ఫొటో రూపంలో ఆల్బం రూపాల్లో జంతు ప్రదర్శన శాలలో మాత్రమే చూడవలసి వస్తుంది భవిష్యత్ తరం. అందుకే వీలైనంత వరకు జీవరాశులను కాపాడుకోవాలి.

డి. రాంచందర్ రావు, 9849592958

రోహిణి కమిషన్ ఖర్చుల రికార్డులు గాయబ్ !

- 2021 సెప్టెంబర్ నుంచి అందుబాటులో లేని వివరాలు

న్యూఢిల్లీ : ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీలు) వర్గీకరణపై ఏర్పాటైన జస్టిస్ జి. రోహిణి కమిషన్ కార్యాలయపు ఖర్చుల వివరాలు 2021 సెప్టెంబర్ నుండి తమ వద్ద అందుబాటులో లేవని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. సమాచార హక్కు చట్టం కింద హిందూ దినపత్రిక అందించిన దరఖాస్తుకు ప్రభుత్వం ఈ మేరకు సమాధానం ఇచ్చింది. సుమారు మూడు వేల ఓబీసీ కులాలను వర్గీకరించేందుకు 2017లో ఈ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. నివేదిక సమర్పించేందుకు తొలుత 12 వారాల గడువు ఇచ్చినప్పటికీ ఆ తర్వాత దానిని 14 సార్లు పొడిగించారు. ఈ సంవత్సరం జనవరిలో చివరిసారిగా ఈ కమిషన్‌కు పొడిగింపు లభించింది. ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి. రోహిణి నేతృత్వంలో ఏర్పడిన ఈ కమిటీలో డాక్టర్ జేకే బజాజ్, ఇతర అధికారులు సభ్యులుగా ఉన్నారు.

ఆర్‌టీఐ కింద పొందిన వివరాల ప్రకారం 2017 అక్టోబర్ నుండి ఈ సంవత్సరం ఏప్రిల్ వరకూ కమిషన్ ఛైర్‌పర్సన్, ఇతర సభ్యుల జీతాల నిమిత్తం రూ.3,75,53,250 ఖర్చు చేయగా కన్సల్టెంట్ల జీతాల కోసం రూ.26,04,775 చెల్లించారు. కార్యాలయ ఖర్చులు, ఇతరాల కింద 2021 ఆగస్ట్ వరకూ రూ.7,20,000 ఖర్చు చేశామని ప్రభుత్వం తెలిపింది. ఆ తర్వాత ఆ ఖర్చులకు సంబంధించి తన వద్ద ఎలాంటి రికార్డులు లేవని స్పష్టం చేసింది. 2021 ఆగస్ట్ వరకూ జాతీయ బీసీ కమిషన్ ఈ ఖర్చులను భరించింది. ఆ తర్వాత సామాజిక న్యాయ-సాధికారత మంత్రిత్వ శాఖ నేరుగా చెల్లింపులు జరిపింది. అయితే సంబంధిత అధికారి ఖర్చుల వివరాలు నమోదు చేయకపోవడం వల్లనే తమ వద్ద సమాచారమేదీ అందుబాటులో లేదని మంత్రిత్వ శాఖ వివరణ ఇచ్చింది. ఈ సంవత్సరం జనవరిలో గడువు పొడిగింపు పొందకముందే కమిషన్ తన పని పూర్తి చేసిందని హిందూ పత్రిక తెలపగా నివేదికను ఖరారు చేసే పనిలో ఉన్నదని, కొన్ని అనుబంధాలను చేరుస్తోందని ప్రభుత్వ వర్గాలు చెప్పుకొచ్చాయి. కమిషన్ చేయాల్సిన పని చాలా ఉందని, కొంత సమయం అవసరమని ప్రభుత్వం కూడా గడువు పొడిగింపును సమర్ధించుకుంది. అంతకుముందు కోవిడ్‌ను సాకుగా చూపుతూ కమిషన్ గడువును పలు పర్యాయాలు పొడిగించింది.

హైదరాబాద్‌లో దజోన్ సీఓఈ కేంద్రం ఏర్పాటు

- రూ.200 కోట్ల పెట్టుబడులు



హైదరాబాద్ : ప్రముఖ గ్లోబల్ స్పోర్ట్స్ స్ట్రీమింగ్ సర్వీస్ సంస్థ దజోన్ హైదరాబాద్‌లో తన ప్రధాన టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ఏర్పాటు చేసినట్టు ప్రకటించింది. నాలెడ్జ్ సిటీలోని అరబిందో గెలాక్సీలో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త కార్యాలయాన్ని అందుబాటులోకి తెచ్చామని దజోన్ గ్రూప్ సీఈఓ షే సెగెవ్ వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌లో షే సెగెవ్ మీడియాతో మాట్లాడుతూ.. రూ.200 కోట్ల పెట్టుబడులతో.. 2023 డిసెంబర్ నాటికి 1000 మందిని నియమించుకోవాలని లక్ష్యంగా చేసుకున్నామన్నారు. ఐదు నెలల క్రితం కార్యకలాపాలు ప్రారంభించిన తమ అత్యాధునిక కార్యాలయంలో ఇప్పటికే 350 మందికి పైగా పని చేస్తున్నారన్నారు. 2024 డిసెంబర్ నాటికి ఉద్యోగుల సంఖ్యను 2500కు పెంచనున్నామని తెలిపారు. "హైదరాబాద్‌లో టెక్నాలజీ సీఓఈని ఏర్పాటుచేయడం సంతోషంగా ఉంది. ఇది అందించే అదనపు సాంకేతిక సామర్థ్యం.. అత్యున్నత స్పోర్ట్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థగా మారడంలో మా రోడ్ మ్యాప్‌ను మరింత వేగవంతం చేస్తుంది." అని షే సెగెవ్ చెప్పారు. దజోన్ గ్రూపు చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ సందీప్ టికు మాట్లాడుతూ, "అధునాతన స్ట్రీమింగ్ టెక్నాలజీల ఆవిర్భావం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ విజన్, ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఎఆర్), వర్చువల్ రియాలిటీ (విఆర్), వేరబుల్ టెక్నాలజీతో క్రీడాభిమానులు ఇంతకు ముందు ఎప్పుడూ చవిచూడని సరికొత్త అనుభవాన్ని వారికి అందించే సామర్థ్యం తమ సంస్థకు ఉందన్నారు.

దామరచర్ల @45.2 డిగ్రీలు

- రెడ్ అలర్ట్ జోన్‌లో నాలుగు జిల్లాలు
- తన ప్రతాపాన్ని చూపుతున్న భానుడు
- కొన్ని ప్రాంతాలకు తేలికపాటి నుంచి మోస్తరు వర్ష సూచన!



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 10 గంటల నుంచే భానుడు తన విశ్వరూపాన్ని చూపుతున్నాడు. అదే సమయంలో తీవ్ర ఉక్కపోత తీవ్రంగా ఉంటున్నది. నల్లగొండ జిల్లా దామరచర్లలో 45.2 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రెడ్ అలర్ట్ జోన్‌లో ఐదు జిల్లాలున్నాయి. అందులో నల్లగొండ, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం జిల్లాలున్నాయి. ఆయా జిల్లాల్లో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు బుధవారం 45 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. బుధవారం రాత్రి పది గంటల వరకు రాష్ట్రంలో 25 ప్రాంతాల్లో వర్షం కురిసింది. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వచ్చే రెండు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సూచించింది. అక్కడక్కడా ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కూడా పడొచ్చని సూచించింది. ముఖ్యంగా నల్లగొండ, మంచిర్యాల జిల్లాలో వడగండ్ల వాన పడే అవకాశాలున్నాయని హెచ్చరించింది.

అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు	
దామరచర్ల(నల్లగొండ)	45.2 డిగ్రీలు
రామగుండం(పెద్దపల్లి)	5.1 డిగ్రీలు
మహదేవపూర్(జయశంకర్ భూపాలపల్లి)	45.1 డిగ్రీలు
రంగంపల్లి(పెద్దపల్లి)	45.1 డిగ్రీలు
నేలకొండపల్లి(ఖమ్మం)	45.0 డిగ్రీలు
మార్తాన్‌పేట(రాజన్నసిరిసిల్ల)	44.9 డిగ్రీలు
తంగుల(కరీంనగర్)	44.8 డిగ్రీలు
చాప్రాల(ఆదిలాబాద్)	44.8 డిగ్రీలు
మల్లాపూర్(జగిత్యాల)	44.7 డిగ్రీలు

విస్తరిస్తున్న 5జీ నెట్‌వర్క్

- అద్భుత ఫలితాల ఆవిష్కరణ
- కేంద్ర ఐటీశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌చంద్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశంలో అత్యంత వేగంగా 5జీ సేవలు విస్తరిస్తున్నాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌చంద్ తెలిపారు. ఇప్పటి వరకు 5జీ సేవలు 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాల్లో అందుబాటులోకి వచ్చాయన్నారు. బుధవారంనాడాయన గంగోత్రిలో రెండోలక్ష 5 జీ సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేవలం 8 నెలల్లో 696 జిల్లాలను కవర్ చేసే 2 లక్షల సైట్‌లు ఇన్‌స్టాల్ అయ్యాయని తెలిపారు. అలాగే చార్‌ధామ్‌కు (బద్రీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి)కి ఫైబర్ కనెక్టివిటీని అంకితం చేస్తున్నట్టు కేంద్రమంత్రి తెలిపారు. చార్‌ధామ్‌లో ఇప్పుడు పూర్తిస్థాయి 5జీ ఫైబర్ కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చిందన్నారు. దీనివల్ల చార్‌ధామ్ యాత్రామార్గంలో వాయిస్, వీడియో కాల్ నాణ్యత పెరుగుతుందని తెలిపారు. భారతదేశం 6జీ టెక్నాలజీలో వందకు పైగా పేటెంట్లను కలిగి ఉందన్నారు. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలు భారతీయ 4జీ, 5జీ టెక్నాలజీపై ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. ఉత్తరాఖండ్‌లో టెలికాం సేవలను అత్యంత వేగంగా ఏర్పాటు చేయడంలో సహకరించిన అక్కడి రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమలో పాల్గొన్న ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామ్ రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో టెలికాం సేవలను ప్రారంభించేందుకు మద్దతు ఇచ్చినందుకు సర్వీస్ ప్రొవైడర్లకు ధన్యవాదాలు తెలిపారు. పర్వతాల్లో హై-స్పీడ్ నెట్‌వర్క్ వల్ల విపత్తు నిర్వహణ, నిఘా సులభతరమవుతాయని అన్నారు.

మంత్రి ఎర్రబెల్లికి కృతజ్ఞతలు తెలిపిన పంచాయతీరాజ్ ఇంజినీర్లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీరింగ్ విభాగాన్ని పునర్వ్యవస్థీకరించినందుకు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు ఆ శాఖ ఇంజినీర్లు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం మంత్రి ఎర్రబెల్లిని వారు సన్మానించారు. పునర్వ్యవస్థీకరణ ద్వారా కొందరికి ప్రమోషన్లు రావడమే కాక, పరిపాలన సౌలభ్యం కలిగిందని వారు మంత్రికి చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అధికారులు మరింత బాధ్యతతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలనీ, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మంత్రిని కలిసిన వారిలో పలువురు పీఆర్ఎస్ఇలు, ఈఈలు, డిఈఈలు, ఏఈలు ఉన్నారు

టీడీపీ నూతన కార్యవర్గంలోకి మరో 28 మంది

నవతెలంగాణ-హైదరాబాద్

తెలుగుదేశం తెలంగాణ శాఖ రాష్ట్ర కమిటీ విస్తరణలో భాగంగా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ మరో 28 మందికి నూతన కార్యవర్గంలో చోటు కల్పించారు. పార్టీ చేనేత విభాగం అధ్యక్షుడుగా బడుగు దానయ్య (భువనగిరి), తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ముంజా వెంకట రాజంను (స్టేషన్ ఘనపూర్) నియమించారు. ఈమేరకు బుధవారం వీరికి నియామక ఉత్తర్వులను ఇచ్చారు. తాజా నియామకాలతో కలిపి తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గం సభ్యుల సంఖ్య 61కి చేరింది. బుధవారం ప్రకటించిన జాబితాలో రాష్ట్ర కార్యవర్గంలో ఒకరిని ఉపాధ్యక్షులుగా, ముగ్గురిని ప్రధాన కార్యదర్శులుగా, ఐదుగురిని అధికార ప్రతినిధులుగా, ఎనిమిది మందిని కార్యనిర్వాహక కార్యదర్శులుగా, పదకొండు మందిని కార్యదర్శులుగా నియమించారు. మరో విడతలో పూర్తి స్థాయి కమిటీ నియమిస్తామని కాసాని జ్ఞానేశ్వర్ తెలిపారు. సీనియార్టీ, పనితీరు, ప్రాంతాలు, ఇతర సమీకరణాలను దష్టిలో ఉంచుకొని మహానాడు అనంతరం మరో విడత రాష్ట్ర కార్యవర్గాన్ని విస్తరిస్తామని చెప్పారు. అర్హులైన నాయకులకు పార్టీ అనుబంధ విభాగాల్లో అవకాశం కల్పిస్తామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఏడు శాతం ఎగువన వృద్ధి

- ఆర్‌బీఐ గవర్నర్ అంచనా
- ద్రవ్యోల్బణం ఆధారంగానే వడ్డీ రేట్లు

న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరం (2022-23)లో భారత వృద్ధి రేటు 7 శాతం ఎగువన నమోదయ్యే అవకాశాలున్నాయని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అంచనా వేశారు. బుధవారం సీఐఐ కార్యక్రమంలో దాస్ మాట్లాడుతూ.. గడిచిన ఏడాదిలో అధిక వృద్ధి రేటు చోటు చేసుకోవచ్చన్నారు. చివరి త్రైమాసికంలో ఆశ్చర్యకరమైన గణంకాలు నమోదు కావొచ్చన్నారు. వ్యవసాయ రంగం అద్భుత ప్రగతిని కనబర్చిందని దాస్ పేర్కొన్నారు. మూలధనం, మౌలిక వసతుల రంగంలో ప్రభుత్వం అధిక వ్యయం చేసిందని దాస్ పేర్కొన్నారు. ప్రయివేటు రంగంలోనూ పెట్టుబడులు పెరిగాయని.. అదే విధంగా స్టీల్, సిమెంట్ రంగాల ఉత్పత్తులకు డిమాండ్ పెరిగిందన్నారు. తయారీ రంగం సామర్థ్య వినియోగంలో 75 శాతానికి చేరిందని ఇటీవల ఆర్‌బీఐ నిర్వహించిన సర్వేలో వెల్లడయ్యిందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 6.5శాతం పెరగొచ్చని దాస్ అంచనా వేశారు. రిటైల్ ద్రవ్యోల్బణం 4.7 శాతానికి పరిమితం కావొచ్చన్నారు. 2016లో రోజుకు 2.28 కోట్ల డిజిటల్ లావాదేవీలు నమోదు కాగా.. ప్రస్తుతం రోజుకు 37.75 కోట్ల లావాదేవీలు రుగుతున్నాయని తెలిపారు. 2022-23కు సంబంధించిన జీడీపీ గణంకాలను ఈ నెల చివరి రోజున సీఎస్ఓ వెల్లడించే అవకాశం ఉంది.

ద్రవ్యోల్బణం ఆధారంగానే వడ్డీ రేట్లు నిర్ణయం అవుతాయని దాస్ పేర్కొన్నారు. చాలా మంది రేట్ల పెంపును నిలిపివేయాలని తమను కోరుతున్నారని.. కానీ అది తమ చేతుల్లో లేదన్నారు. అది పూర్తి క్షేత్ర స్థాయి పరిస్థితులు, ఆర్థిక వ్యవస్థ పరపతి, ద్రవ్యోల్బణం ఇతర అంశాల ఆధారంగా రేట్ల నిర్ణయం జరుతుందన్నారు. భారత బ్యాంకింగ్ వ్యవస్థ స్థిరంగా, పటిష్టంగా ఉందన్నారు. రూ.2,000 నోట్ల మార్పిడి ప్రక్రియ ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతుందన్నారు.

భారత్‌లో టెస్లా కార్యకలపాలకు సిద్ధం

- ఎలన్ మస్క్ వెల్లడి

వాషింగ్టన్ : విద్యుత్ వాహనాల తయారీ కంపెనీ టెస్లా భారత్‌లో ప్లాంట్ ఏర్పాటుపై ఎట్టకేలకు స్పష్టతనిచ్చింది. ఎప్పటి నుంచో ఊగిసలాటలో ఉన్న ఆ కంపెనీ అధినేత ఎలన్ మస్క్ అమెరికన్ మీడియాతో తప్పకుండా భారత్‌లో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఎక్కడ ఏర్పాటు చేసేది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఫ్యాక్టరీకి అనువైన పలు ప్రాంతాలను పరిశీలిస్తున్నామన్నారు. భారత్‌లో ప్లాంట్ నెలకొల్పే విషయంలో ఇప్పటికే టెస్లా ప్రతినిధులు ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపారు. 2024 కార్ల ఉత్పత్తిని ప్రారంభించి.. 2025 నాటికి భారత్‌లో అమ్మకాలు చేయాలని ఆ కంపెనీ వర్గాలు భావిస్తున్నాయి.

కుమ్మిన్స్ ఇండియా 650శాతం డివిడెండ్

పూణె : డీజిల్, గ్యాస్ ఇంజిన్లను తయారు చేసే కుమ్మిన్స్ ఇండియా తన వాటాదారులకు మెరుగైన డివిడెండ్‌ను ప్రకటించింది. 2022-23కు గాను రూ.2 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్‌పై రూ.13 లేదా 650 శాతం డివిడెండ్‌ను అందించడానికి బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. ఇంతక్రితం ఫిబ్రవరిలో కూడా ఆ సంస్థ రూ.12 మధ్యంతర డివిడెండ్‌ను అందించింది. 2023 మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఈ సంస్థ 29 శాతం వృద్ధితో రూ.1,889 కోట్ల అమ్మకాలు నమోదు చేసింది. నికర లాభాలు 68 శాతం పెరిగి రూ.319 కోట్లకు చేరాయి.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రత్యేక రిక్రూట్‌మెంట్ ప్రోగ్రామ్

ముంబయి : ప్రయివేటు రంగంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ యువ గ్రాడ్యుయేట్లను ఒక ఏడాది లోగా బ్యాంకింగ్ నిపుణులుగా మార్చేందుకు ప్రత్యేక రిక్రూట్‌మెంట్ ప్రోగ్రామ్ 'ఫ్యూచర్ బ్యాంకర్స్ 2.0'ని ప్రారంభించినట్లు తెలిపింది. మణిపాల్ గ్లోబల్ అకాడమీలోని బిఎఫ్ఎస్ఐతో కలిసి నియామకాలు చేపడుతున్నట్లు పేర్కొంది. ఇందుకోసం ఒక ఏడాది కాలపరిమితితో ప్రొఫెషనల్ డిప్లమో కోర్సును ప్రవేశపెట్టినట్లు తెలిపింది. విజయవంతమైన అభ్యర్థులందరికీ రూ.5.59 లక్షల వరకు వార్షిక వేతనం లభిస్తుందని వెల్లడించింది. ఆసక్తి కలిగిన వారు 'హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఫ్యూచర్ బ్యాంకర్స్' వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది.

చమురు ధరలు పెరుగొచ్చు

ఉత్పత్తికి ఒపెక్ కోత..!

న్యూయార్క్ : అంతర్జాతీయంగా చమురు వ్యాపారులు ఉత్పత్తిని తగ్గించడం ద్వారా ధరలు పెరిగే అవకాశం ఉందని రిపోర్టులు వస్తున్నాయి. చమురు ఎగుమతి దేశాలు (ఒపెక్) ఉత్పత్తికి కోత పెట్టే అవకాశం ఉందని సౌది ఇంధన శాఖ మంత్రి ప్రిన్స్ అబ్దుల్ అజీజ్ బిన్ సల్మాన్ చేసిన వ్యాఖ్యలతో మంగళవారం ఫ్యూచర్ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగాయి. జూలై డెలివరీ కోసం వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యుఐటి) న్యూయార్క్ మర్కంటైల్ ఎక్స్ఛేంజీలో బ్యారెల్‌కు 86 సెంట్లు లేదా 1.19 శాతం పెరిగి 72.91 యుఎస్ డాలర్ల వద్ద ముగిసింది. జూలై డెలివరీ కోసం బ్రెంట్ క్రూడ్ 85 సెంట్లు లేదా 1.12 శాతం పెరిగి లండన్ ఫ్యూచర్స్ ఎక్స్ఛేంజీలో బ్యారెల్ 76.84 డాలర్ల వద్ద నమోదయ్యింది. వచ్చే నెలలో పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ (ఒపెక్) భాగస్వాముల భేటీకి ముందు సౌదీ మంత్రి ప్రకటనతో ఉత్పత్తి తగ్గింపునకు అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

జులై 3న ఎఫ్‌టిసిసిఐ అవార్డుల ప్రదానం

మే 31 వరకు దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్ : ఎఫ్‌టిసిసిఐ ఎక్సలెన్సీ అవార్డ్స్–2022 వాటాదారుల సమావేశం బుధవారం జరిగింది. దీనికి సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. 106 సంవత్సరాల చరిత్ర గల తెలంగాణా ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టిసిసిఐ) జూలై 3వ తేదీన హెచ్ఐసిసిలో 23 విభాగాల్లో అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ప్రకటించింది. మే 31 వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని తెలిపింది. ఒక్కొక్కటి 2 కేజీల వెండితో చేసిన ఒరిజినల్ ట్రోఫీలు ప్రదర్శించబడుతాయని అనిల్ అగర్వాల్ తెలిపారు. 1974లో ఏర్పాటు చేసిన అవార్డులను గత 49 ఏళ్లుగా (మహమ్మారి కాలంలో మినహా) నిరంతరాయంగా అందిస్తున్నామన్నారు.

న్యాయమైన బహుళ ధ్రువ ప్రపంచం సాధ్యమే : పుతిన్

మాస్కో : దోపిడీపై ఆధారపడిన నయావలసవాదానికి కాలం చెల్లిందని, న్యాయమైన బహుళ ధ్రువ ప్రపంచం సాధ్యమేనని రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ ఉద్ఘాటించారు. రష్యా, దాని అంతర్జాతీయ భాగస్వాములు కలసి ఈ లక్ష్య సాధనకు కృషి చేస్తాయని అన్నారు. ఉమ్మడి బెదిరింపులు, సవాళ్లను ఎదుర్కోడానికి భావ సారూప్యత కలిగిన అన్ని దేశాలతో సహకరించడానికి రష్యా సిద్ధంగా ఉందన్నారు. భద్రతా సమస్యలపై బుధవారం నాడిక్కడ జరిగిన 11వ అంతర్జాతీయ ఉన్నత ప్రతినిధుల సదస్సునుద్దేశించి పుతిన్ వీడియో ప్రసంగం చేస్తూ,' మనందరం కలిసి మరింత న్యాయమైన బహుళ ధ్రువ ప్రపంచాన్ని ఏర్పరచుకుందాం. ప్రపంచ వనరుల లూటీకి దోహదం చేస్తున్న నయా వలసవాద వ్యవస్థను అంతమొందిద్దాం' అని అన్నారు. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల మధ్య చారిత్రాత్మకమైన మైత్రి, సహకారం ఎంతో విలువైనది. దీనిని మరింత బలోపేతం చేద్దాం' అని ఆయన అన్నారు. అమెరికా తన ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు ఇతర దేశాల ఆంతరంగిక వ్యవహారాల్లో సైనిక జోక్యాలకు దిగుతోందని ఆయన విమర్శించారు. అంతర్జాతీయ అశాంతికి, అస్థిరతకు అమెరికా విధానాలే కారణమని పుతిన్ దుయ్యబట్టారు. రష్యా సారథ్యంలో జరిగిన ఈ భద్రతా సదస్సుకు వివిధ దేశాల నుంచి వంద మందికిపైగా ప్రతినిధులు హాజరయ్యారు. ఆహారం, సమాచార భద్రత,మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడంలో సహకారంపై మరింత శ్రద్ధ పెడతామని నిర్వాహకులు తెలిపారు.

అమెరికాలో చైనా రాయబారిగా సీ ఫెంగ్

బీజింగ్: చైనా పట్ల అమెరికా శత్రుపూరిత వైఖరి తీసుకున్న నేపథ్యంలో అమెరికాలో తన కొత్త రాయబారిగా సీ ఫెంగ్‌ను చైనా నియమించింది. సీఫెంగ్ గతంలో చైనా విదేశాంగ శాఖ ఉప మంత్రిగా పనిచేశారు. దశాబ్దాలుగా ఈ రంగంలో అపారమైన అనుభవం కలిగిన నిపుణుడిగా కూడా ఆయన పేరొందారు. ప్రస్తుతం పెళుసుగా ఉన్న చైనా–అమెరికా ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరచేందుకు సీ ఫెంగ్ నియామకం తోడ్పడుతుందని పలువురు నిపుణులు భావిస్తున్నారు. సీఫెంగ్ ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, చైనా ప్రజల ప్రతినిధిగా, దేశ ప్రయోజనాలను కాపాడేందుకు కృషి చేస్తానని చెప్పారు. చైనా, అమెరికా సంబంధాలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న స్థితిలో ప్రపంచ ప్రజల ఉమ్మడి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సున్నితమైన, ముఖ్యమైన సమస్యలను దౌత్యపరమైన చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు తన వంతు కృషి చేస్తానని సీ ఫెంగ్ చెప్పారు.

దోస్త్‌కు 35,873 మంది రిజిస్ట్రేషన్

- **10,368 వెబ్‌ఆప్షన్ల నమోదు**

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్


రాష్ట్రంలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీకాం ఆనర్స్, బీబీఏ, బీసీఏ, బీబీఎం, బీఎస్‌డబ్ల్యూ, బీసీఏ కోర్సుల్లో 2023–24 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)కు 35,873 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్, దోస్త్ కన్వీనర్ ఆర్ లింబాద్రి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు వచ్చేనెల 10వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గడువున్నదని తెలిపారు. ఇప్పటి వరకు 10,368 వెబ్‌ఆప్షన్లు నమోదయ్యాయని వివరించారు. వచ్చేనెల 11వ తేదీ వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశమున్నదని పేర్కొన్నారు. వచ్చేనెల 16వ తేదీన తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. విద్యార్థులు పూర్తి వివరాలకు https://dost.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

పసిడికి పండగొచ్చింది

- **రూ.2 వేలు నోట్లతో కొనుగోలు!**

విశాఖపట్నం : వివాహాది శుభకార్యాలు, అక్షయ తృతీయ వంటి సమయాలలో బంగారం కొనుగోలు అధికంగా ఉంటుంది. అవేమీ కాకుండా ఇప్పుడు అనుకోకుండా బంగారం కొనుగోలు ఒక్కసారిగా పెరిగింది. అన్ని తరగతుల ప్రజలూ బంగారం కొనడం వల్ల అమ్మకాలు పెరిగాయని భావించడానికి వీలులేదు. రూ.2 వేలు నోట్లను లక్షల కొద్ది దాచి పెట్టుకున్న వారు వాటితో ఇప్పుడు బంగారం కొనేందుకు పరుగులు తీస్తున్నారు. రూ.2 వేలు నోట్లను చలామణిలో ఉంచొద్దని, సెప్టెంబర్‌లోగా ప్రజలు తమ వద్ద ఉన్న నోట్లను బ్యాంకుల్లో జమ చేసుకోవాలని రిజర్వ్ బ్యాంకు కొన్ని షరతులతో ఆమోదం తెలిపింది. ఈ షరతులను అంగీకరించి బ్యాంకుల్లో పెద్ద మొత్తంలో రూ.2 వేల నోట్లను జమ చేస్తే కొన్ని చిక్కులు వచ్చే వీలు ఉందని భావించి కొందరు తమ వద్ద ఉన్న ఈ నోట్లతో బంగారాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ కారణంగా పారిశ్రామిక రాజధానిగా పేరున్న విశాఖలో బంగారం దుకాణాలకు అనుకోకుండా పండగ వచ్చినట్లయింది. తక్కువ మొత్తంలో కాకుండా, అధిక మొత్తంలో ఈ నోట్లతో బంగారం కొనుగోలు చేసేందుకు వస్తున్నారని ఒక బంగారం వర్తకుడు తెలిపారు. నగరంలోని ద్వారకానగర్, ఆశీలుమెట్ట ప్రాంతంలో పెద్దపెద్ద బంగారం షాపింగ్ మాల్స్ ఉన్నాయి. జగదాంబ జంక్షన్, పూర్ణ మార్కెట్, కురుపాం మార్కెట్, దొండపర్తి, గోపాలపట్నం, భీమిలి, గాజువాక, అనకాపల్లి ప్రాంతాలలో సుమారు 500 వరకు చిన్న, పెద్ద బంగారం షాపులు ఉన్నాయి. బంగారం వ్యాపారానికి ఆదరణ ఉండడంతో ఏటా 2 నుంచి 3 వరకు పెద్దపెద్ద బంగారం షాపింగ్ మాల్స్ నగరంలో వస్తున్నాయి. నగరంలో పండగలు, శుభకార్యాలు, వంటి రోజులలో రోజుకు రూ.20 కోట్ల మేర బంగారం అమ్మకాలు జరుగుతాయి. 10 నుంచి 20 కిలోల చొప్పున అమ్మకాలు ఉంటాయి. మిగిలిన రోజులలో ప్రతిరోజు రూ.2 కోట్ల మేర అమ్మకాలు ఉంటాయని ఒక వ్యాపారి తెలిపారు. ఇప్పుడు రూ.2 వేల నోటు సమస్య రావడంతో గత రెండు రోజులుగా 5 నుంచి 10 శాతం మేర బంగారు నగల అమ్మకాలు పెరిగాయని చెప్తున్నారు. నగరంలో మంగళవారం పది గ్రాముల మేలిమి బంగారం (24 క్యారెట్లు) ధర రూ.61,200, ఆర్నమెంట్ బంగారం పది గ్రాములు ధర రూ.56,300గా ఉంది.

ఏఐపీడబ్ల్యూఎఫ్ మాజీ ప్రధానకార్యదర్శి పి లాలాజీ బాబు కన్నుమూత



న్యూఢిల్లీ/తిరువనంతపురం : కేరళ కార్మికోద్యమ నేత, అఖిల భారత ఉద్యాన కార్మికుల సమాఖ్య (ఏఐపీడబ్ల్యూఎఫ్) మాజీ ప్రధానకార్యదర్శి పి లాలాజీ బాబు బుధవారం ఉదయం కన్నుమూశారు. ఆయన వయస్సు 75 సంవత్సరాలు. లాలాజీ బాబు 1948లో చెంగన్నూరులో జన్మించారు. అత్యధిక కాలంలో కొల్లంలో జీవించిన ఆయన నాలుగు దశాబ్దాల సుదీర్ఘకాలం ఉద్యాన కార్మికుల హక్కుల కోసం పోరాడారు. సీఐటీయూ వర్కింగ్ కమిటీ సభ్యులుగానూ సేవలందించారు. దేశంలో అత్యయిక పరిస్థితి విధించినప్పుడు ఆరు నెలల పాటు జైలు జీవితం గడిపారు. రబ్బరు బోర్డు సభ్యునిగా, ఆయిల్ పాం ఇండియా లిమిటెడ్ బోర్డు సభ్యునిగా, పథనపురం తాలుకా వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు అధ్యక్షులుగా, సహకార బ్యాంకు అధ్యక్షులుగా, అనేక ఇతర ముఖ్యమైన సంస్థలకు వివిధ హోదాల్లో సేవలందించిన ఆయన నిత్యం కార్మికవర్గ ప్రయోజనాల పరిరక్షణ కోసం కృషిచేశారు.

2013లో త్రిపురలోని అగర్తలలో జరిగిన ఏఐపీడబ్ల్యూఎఫ్ మహాసభలో ఆయన ఫెడరేషన్ అఖిల భారత అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఉద్యాన కార్మికోద్యమాల నిర్మాణంలో విశేష పాత్ర పోషించిన లాలాజీ బాబు తీవ్ర అనారోగ్య సమస్యల కారణంగా 2022 డిసెంబరులో డార్జిలింగ్‌లో జరిగిన ఏఐపీడబ్ల్యూఎఫ్ మహాసభలో బాధ్యతల నుంచి విరమణ పొందారు. అదే ఏడాది ఢిల్లీలో జరిగిన ఫెడరేషన్ వర్కింగ్ కమిటీ సమావేశానికి హాజరై తిరిగివస్తుండగా గుండెపోటుకు గురై.. అప్పటి నుంచి కోలుకోలేదు. లాలాజీబాబు మృతి పట్ల సిఐటియు తీవ్ర సంతాపం ప్రకటించింది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. ఉద్యాన కార్మికుల ఉద్యమంలో ఆయన కృషి చిరస్మరణీయమని కొనియాడుతూ ఘన నివాళులర్పించింది.

కేరళలో క్షీరవిప్లవం

దేశంలోనే అత్యంత నాణ్యమైన పాలుగా 'మిల్మా' ఘనత

- కేంద్ర పశుసంవర్ధక, డైరీ శాఖ పరీక్షలో వెల్లడి
- ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ చొరవతో ప్రగతిపథాన పాడి, పౌల్ట్రీ రంగాలు

తిరువనంతపురం : కేరళలో పాడి, పౌల్ట్రీ పరిశ్రమలు ప్రగతిపథాన దూసుకెళ్తున్నాయి. సహకార రంగానికి మారుమేరుగా బాసిల్లే కేరళలో పాడిపరిశ్రమలోనూ బలోపేతమైన సహకార రంగంతో క్షీరవిప్లవం నడుస్తోంది. నాణ్యమైన పాలు, నాణ్యమైన కోడి మాంసం, కోడి గుడ్ల ఉత్పత్తిదారుగా కేరళ దేశానికే మకుటాయమానంగా నిలుస్తోంది. వామపక్ష ప్రజాతంత్ర కూటమి (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం ప్రత్యామ్నాయ విధానాలతో కేరళ పశుసంవర్ధక, డైరీ రంగాలు దేశానికే ఆదర్శనీయమైన రీతిలో అభివృద్ధి సాధిస్తున్నాయి. కేరళ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ (మిల్మా) కింద పనిచేస్తున్న మలబార్ ప్రాంతీయ సహకార పాల ఉత్పత్తిదారుల సంఘం (ఎంఆర్‌సిఎంయు) సేకరిస్తున్న పాలు దేశంలోనే అత్యంత నాణ్యమైన పాలుగా కేంద్ర పశుసంవర్ధక, డైరీ శాఖ ఇటీవల విడుదల చేసిన నివేదికలో పేర్కొన్నారు. ఇది వామపక్ష ప్రభుత్వ సహకారంతో మలబార్ పాడి పరిశ్రమ రైతులు సాధించిన విజయమని మిల్మా ఛైర్మన్ కెఎస్ మణి హర్షం వ్యక్తం చేశారు. 2022–23లో మలబార్ పాడి రైతులకు పాల సేకరణ కింద రూ.1041.47 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. అలాగే పాడి రైతుల సంక్షేమం కోసం రూ.7.7 కోట్లతో సంక్షేమ నిధి కూడా మిల్మా ఏర్పాటు చేసిందన్నారు. దాణా రాయితీ కింద మరో రూ.7.65 కోట్లు రైతులకు అందజేసిందని తెలిపారు. దీంతో పాటు పాడి రైతులను ప్రోత్సహించేందుకు అదనపు పాల ధర కింద రూ.29.16 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. అలాగే పాడి రైతుల ఆరోగ్యం కోసం గ్రూపు ఇన్సూరెన్స్‌గా రూ.15.01 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు.

ఎంబీఆర్‌టీ పరీక్షలో 204 నిమిషాలు

పాల నాణ్యత కోసం మిథైలీన్ బ్లూ డై రిడక్షన్ టెస్ట్ (ఎంబీఆర్‌టీ) పరీక్ష నిర్వహిస్తారు. నమూనాగా తీసుకున్న పాలలో మిథైలీన్ నీలి రంగు కలుపుతారు. పాలలో ఆ రంగు ఎంత ఎక్కువ సమయం రంగు వెలిసిపోకుండా ఉంటే పాలు అంత నాణ్యమైనవిగా పరిగణిస్తారు. ఈ పరీక్షలో మిల్మా పాలు 204 నిమిషాలు రంగు వెలిసిపోకుండా ఉన్నాయి. దేశంలో ఇతర అన్ని ప్రాంతాల్లో సేకరించిన పాలు కంటే ఇదే అత్యధికం. అంటే అత్యంత నాణ్యమైనవని కేంద్ర ప్రభుత్వమే నిర్ధారించింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎంబిఆర్‌టి పరీక్షలో 236 నిమిషాలను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంటున్నట్లు మిల్మా ఛైర్మన్ మణి చెప్పారు. ఎంబిఆర్‌టి పరీక్షలో కేరళ తర్వాత స్థానాల్లో కర్ణాటక (190 నిమిషాలు), పంజాబ్ (180 నిమిషాలు) పాలు నిలిచాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌లో సేకరిస్తున్న పాల నాణ్యత 30 నిమిషాల వద్దే ఆగిపోయింది.

దీంతో పాటు పాడి పరిశ్రమ ఆధునీకరణలోనూ ప్రత్యేకించి ప్యాకేజీ, డిజిటలీకరణ విషయాల్లో కేరళ ఘననీయమైన ప్రగతి సాధిస్తోంది. కేరళ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'క్షీరశ్రీ' వెబ్ పోర్టల్‌కు 2022లో కేంద్ర ప్రభుత్వం డిజిటల్ ఇండియా – 2022 సిల్వర్ మెడల్ అవార్డుతో సత్కరించింది. మిల్మా ఉత్పత్తులన్నిటికీ ఏకీకృత ప్యాకేజీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చి పాల ఉత్పత్తుల్లో నకిలీకి తావు లేకుండా చేశారు. పౌల్ట్రీ రంగంలోనూ కేరళ అధునాతన విధానాలతో ముందుకెళ్తోంది. చికెన్ ఫింగర్, చికెన్ బర్గర్ ప్యాటీ, చికెన్ నగెట్స్ వంటి మాంసం ఉత్పత్తులకు వేల్యూ యాడెడ్ ప్లాంటు నెలకొల్పి పౌల్ట్రీ రైతులకు ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం చేయూతనందిస్తోంది. గొర్రెలు, ఇతర పశు సంపద పరిరక్షణ కోసం అత్యాధునిక మొబైల్ వెటర్నరీ క్లినిక్‌ల ద్వారా సేవలందిస్తోంది. 'గోవర్ధిని' పథకం కింద 42,747 దూడలకు శాస్త్రీయ చికిత్సలు అందించారు. లంపీ చర్మవ్యాధి రాకుండా 9,14,871 పశువులకు టీకాలు వేశారు. కేరళ చికెన్ కూడా అత్యంత నాణ్యమైన చికెన్‌గా వివిధ సంస్థలు ధ్రువీకరించాయి. ప్రతి రోజు ఔట్‌లెట్ల ద్వారా నాణ్యమైన 24 వేల కిలోల చికెన్ అమ్మకం జరుగుతోంది.

కేరళ ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (కేఈపీసీఓ) సహకారంతో అమల్జేస్తున్న 'ఆశ్రయ' పథకం కింద వితంతువులకు ఆర్థిక చేయూతనందించి పాడి పరిశ్రమలో ఉపాధి కల్పిస్తున్నారు. అలాగే షెడ్యూలు తెగలకు చెందిన లబ్దిదారులకు 100 చొప్పున కోళ్లు, వాటికి సరిపడా దాణా అందించి బడుగు జీవులకు వామపక్ష ప్రభుత్వం మెరుగైన జీవనాన్ని అందిస్తోంది. 'వనితా మిత్రం' అనే మరో పథకం కింద 'కుడుంబశ్రీ' సభ్యులకు, వారి పిల్లలకు పౌల్ట్రీ రంగంలో శిక్షణ అందిస్తున్నారు. మేకల శాటిలైట్ పథకం కింద 700 యూనిట్లు నెలకొల్పారు. వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వ ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలలో ఇటు పాడి పరిశ్రమలోనూ అటు అనుబంధ పౌల్ట్రీ, పశుపోషణ రంగాల్లోనూ కేరళ ముందడుగేస్తోంది.

అదానీ స్టాక్స్‌ల్లో రూ.45 వేల కోట్ల ఎల్ఐసి వాటాలు

ముంబయి : అదానీ గ్రూపు కంపెనీల స్టాక్స్‌ల్లో ఎల్ఐసి వాటాల విలువ రూ.45,000 కోట్లకు పైగా చేరింది. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు అదానీ గ్రూపులోని ఎల్ఐసి మార్కెట్ విలువ రూ.6,200 కోట్లు పెరగడంతో.. మొత్తం పెట్టుబడుల విలువ రూ.45,481 కోట్లుగా నమోదైంది. ఈ విలువను 2023 మార్చి ముగింపు నాటి నుంచి మంగళవారం వరకు లెక్కించారు. అదానీ గ్రూపు అవకతవకలకు పాల్పడుతోందని ఈ ఏడాది జనవరిలో హిండెన్‌బర్గ్ ఇచ్చిన రిపోర్ట్‌లో ఆ కంపెనీల షేర్లు భారీగా పడిపోయాయి. ఆ క్రమంలోనే ఎల్ఐసి కూడా భారీగా నష్టపోయింది. అయినప్పటికీ అదానీ గ్రూపులో పెట్టుబడులు కొనసాగించడం గమనార్హం. అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ స్టాక్స్‌లో ఎల్ఐసికి రూ.14.145 కోట్లు విలువ చేసే 9.12 శాతం వాటా ఉంది. అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో రూ.12,017 కోట్లు విలువ చేసే 4.25 శాతం వాటాలు, అదానీ టోటల్ గ్యాస్‌లో రూ.10,500 కోట్లు విలువ చేసే పెట్టుబడులను కలిగి ఉంది. అదానీ ట్రాన్స్‌మిషన్, అంబూజా సిమెంట్, అదానీ గ్రీన్ ఎనర్జీ స్టాక్స్‌ల్లోనూ ఎల్ఐసి పెట్టుబడులు భారీగానే ఉన్నాయి.

'షెల్'కు వ్యతిరేకంగా లండన్‌లో నిరసనల హోరు



లండన్: శిలాజ ఇంధన దిగ్గజం 'షెల్' వార్షిక సర్వసభ్య సమావేశాన్ని లక్ష్యంగా చేసుకుని బ్రిటన్‌లో పెద్దయెత్తున నిరసనలకు దిగారు. బ్రిటన్‌లో ఒకవైపు లక్షలాది మంది పేదరికం, వాతావరణ సంక్షోభంతో నానా అవస్థలు పడుతుంటే, మరో వైపు షెల్ కంపెనీ రికార్డు స్థాయిలో లాభాలు ఆర్జిస్తోందని నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శిలాజ రహిత ఇంధనం, ఎక్స్‌టెన్షన్ రెబిలియన్ (ఎక్స్ఆర్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన ర్యాలీలో ' షెల్ హెల్‌కు వెళ్లు, తిరిగి రావద్దు' అంటూ నినదించారు. నిరసనకారుల ఆందోళనతో తూర్పు లండన్‌లో షెల్ వార్షిక సమావేశం దాదాపు గంట ఆలస్యంగా ప్రారంభమైంది. ఇల్లును గుల్ల చేయడమే గాక ప్రజల ఉపాధిని, జీవితాలను నాశనం చేసే షెల్‌ను మూసివేయాలి అని ఓ నిరసనకారుడు సమావేశ మందిరంలోకి వెళ్లి నినదించాడు. షెల్ కంపెనీ ఛైర్మన్ సర్ ఆండ్రూ మెకంజీ ఆ నిరసనకారుడిని ఉద్దేశించి మీ డిమాండ్ విన్నాం . ఇక మీరు వెళ్ళొచ్చు అని అన్నారు. సమావేశ స్థలికి వెలుపల షెల్‌కు వ్యతిరేకంగా బ్యానర్లు పట్టుకుని, పాటలు పాడుతూ, నృత్య రూపకాలను ప్రదర్శించారు. షెల్ కంపెనీ పుణ్యమాని తాము నరకానికి చేరువవుతున్నామని అన్నారు. ఇంతలోనే భద్రతాదళాలు వచ్చి నిరసనకారులను చెదరగొట్టేందుకు బాష్పవాయువును ప్రయోగించారు. కొంత మందిని బలవంతంగా లాక్కెళ్లి పోలీసుల వాహనమెక్కించారు. పీపుల్స్ హెల్త్ ట్రిబ్యునల్‌కు చెందిన ఒక కార్యకర్త మాట్లాడుతూ, 'షెల్ అనేది ప్రపంచ వ్యాపితంగా మానవ హక్కులను, పర్యావరణ చట్టాలను కాలరాసే సంస్థ అని విమర్శించారు. షెల్ ఆఫ్రికా అంతటా ప్రజల ఆరోగ్యాన్ని, జీవనోపాధిని, పర్యావరణ వ్యవస్థలను నాశనం చేసిందని ఎంఎస్ ఒస్సోర్న్ అనే మరో కార్యకర్త అన్నారు.

'వాస్తవాలు' చర్చించాలి

- ఆస్ట్రేలియా గ్రీన్స్ సెనెటర్ జాన్
- పార్లమెంటులో మోడీ

దాక్యుమెంటరీ ప్రదర్శన



సిడ్నీ : మానవ హక్కుల విషయంలో వాస్తవాలపై చర్చ అవసరమని ఆస్ట్రేలియా గ్రీన్స్ సెనెటర్ జోర్డాన్ స్టీల్ జాన్ అన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో జరిగిన చర్చల్లో ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ దీనిని ప్రస్తావించక పోవడం శోచనీయమని అన్నారు. వాస్తవానికి ఆస్ట్రేలియాలోనూ మానవ హక్కుల పరిరక్షణలో అల్బనీస్ కూడా ఘోరంగా విఫలమయ్యారని ఆయన విమర్శించారు. వీరిద్దరి వ్యవహారాన్ని చూస్తుంటే తనకు 'నిజమైన ఆగ్రహం' ఏమిటో తెలుస్తోందన్నారు. గుజరాత్‌లో గోద్రా అనంతర నరమేధంలో వేలాది మంది ముస్లింల ఊచకోత కోయబడ్డారు. ఈ మారణహోమంలో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ పాత్రను బయటపెడుతూ బిబిసి ఒక డాక్యుమెంటరీ రూపొందించిన సంగతి విదితమే. ఈ డాక్యుమెంటరినీ భారత ప్రభుత్వం నిషేదించింది. అయితే ఇప్పటికే భారత్ సహా పలు ప్రాంతాల్లో మానవ హక్కుల కార్యకర్తలు, మేధావులు ఈ నిషేధాన్ని తప్పుబట్టాయి. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియాలో ప్రధాని మోడీ పర్యటనను నిరసిస్తూ ఆస్ట్రేలియన ఎంపీలు, వివిధ మానవ హక్కుల సంఘాలు ఆస్ట్రేలియా పార్లమెంటులో బిబిసి డాక్యుమెంటరీని ప్రదర్శించాయి.

వాణిజ్యం, పెట్టుబడులు, వలసల విషయంపై చర్చలు జరిపేందుకు ప్రధాని మోడీ ఆస్ట్రేలియాలో మూడు రోజుల పాటు పర్యటించారు. మంగళవారం నాడు సిడ్నీలో 20 వేల మంది స్థానిక ప్రజానీకంతో మోడీ కోసం అల్బనీస్ అట్టహాసంగా ఒక సభను ఏర్పాటు చేశారు. బుధవారం సిడ్నీలోని ఒపెరా హౌస్ వద్ద భారత పతకాన్ని ప్రదర్శించి ఇరువురు నేతలు ఫొటోలకు ఫోజులు ఇచ్చారు. అదే సమయంలో పార్లమెంటు హౌస్‌లో మోడీ ప్రభుత్వం నిషేధించిన బిబిసి డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఈ చిత్రాన్ని 50 మంది ప్రముఖులు వీక్షించారు. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ తదితర భాగస్వామ్యంలో నిర్వహించిన ఈ చిత్ర ప్రదర్శన సందర్భంగా అక్కడకు విచ్చేసిన వారంతా మానవ హక్కుల కోసం నినదించారు. భారత్‌లో మానవ హక్కుల ఉల్లంఘనల పట్ల, పత్రికా స్వేచ్ఛ హరించివేస్తున్నతీరుపట్ల మోడీతో చర్చల సందర్భంగా అల్బనీస్ నిలదీయాల్సిందని వారు అభిప్రాయపడ్డారు.. మానవ హక్కుల విషయంలో పశ్చిమ దేశాలు ఎల్లప్పుడూ ద్వంద్వ వైఖరి అవలంబిస్తూనేవుంటాయని సెనెటర్ స్టీల్ జాన్ విమర్శించారు. జాన్ ఇంగ్లండ్‌లో జన్మించారు. తాను జన్మించిన ఇంగ్లండ్ భారత్‌లో వ్యవస్థీకృత దోపిడికి పాల్పడిందని, అలాగే ఆస్ట్రేలియాలో ఆదివాసీలపైన దాడులు కొనసాగుతున్నాయని ఆయన చెప్పారు. మోడీపై బిబిసి డాక్యుమెంటరీ వీక్షణకు 50 మంది మాత్రమే హాజరయ్యారన్న అసంతృప్తి తనకు లేదని, అంతకుమించి ఈ విషయంలో మోడీతో చర్చలేకుండా విఫలమైన అల్బనీస్ వైఖరిపైనే తనకు నిజమైన ఆగ్రహం ఉందని జాన్ పేర్కొన్నారు. భారత్‌తో సత్సంబంధాల బలోపేతానికి తామెంతో గౌరవమిస్తామని, అయితే భారత్‌లో మానవ హక్కుల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. అయితే ఆస్ట్రేలియాలోనూ మానవ హక్కుల పరిస్థితి భారత్‌ను మించిపోయేంత గొప్పగా ఏమీ లేవని పేర్కొన్నారు. అందువల్ల మనమంతా నిజాలు మాట్లాడుకోవాల్సివుందన్నారు. అలాగే నిజాలు నిర్భయంగా మాట్లాడటం కూడా నేర్చుకోవాలన్నారు. భారత దేశంలో ముస్లింలు, ఇతర మైనార్టీలు తీవ్రమైన వివక్షకు గురౌతున్నారని, రాజకీయ నాయకులు వారిపై తీవ్ర అణిచివేత కొనసాగిస్తున్నారని, వీటన్నింటికి బిబిసి డాక్యుమెంటరీ దర్పణం పట్టిందని ఆయన తెలిపారు.

అధికారిక గణాంకాల ప్రకారమే గుజరాత్ నరమేధంలో రెండు వేల మందికిపైగా ముస్లింలు హత్యకు గురయ్యారని ఆయన వాపోయారు. మూడు నెలల పాటు నిర్విరామంగా మారణకాండ కొనసాగినా అప్పటి పాలకులు మొద్దు నిద్దర నటించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఇంత జరిగినా ఈ మత ఘర్షణల్లో మోడీ ప్రమేయానికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) క్లీన్‌చిట్ ఇచ్చిందన్నారు. అయితే మోడీకి ప్రత్యక్ష ప్రమేయముందన్న విషయాన్ని బ్రిటన్ ప్రభుత్వం రూపొందించిన నివేదిక బట్టబయలు చేసిందని, ఇదే విషయాన్ని బిబిసి డాక్యుమెంటరీలో కూడా పేర్కొన్నారని సెనెటర్ జాన్ తెలిపారు. ముస్లిం మహిళలపై వ్యవస్థీకృతంగా అత్యాచారాలకు పాల్పడటం మొదలుకొని అన్ని నైతిక ప్రామాణికాలకు తిలోదకాలు ఇచ్చేసి యథేశ్చగా హింసాకాండ సాగించేందుకు నాటి బిజెపి ప్రభుత్వమే కారణమని బ్రిటన్ నివేదిక బట్టబయలు చేసిందన్నారు. 'హిందువులు ఆగ్రహంతో ఉన్నారు. ఏమి జరిగినా మీరు జోక్యం చేసుకోవద్దు' అంటూ పోలీసులకు మోడీనే స్వయంగా ఆదేశాలు జారీ చేసినట్లు బ్రిటీష్ అధికారులను ఉటంకిస్తూ డాక్యుమెంటరీలో పేర్కొన్నారు. వలస వాద మైండ్‌సెట్‌తో ఈ డాక్యుమెంటరినీ బిబిసి రూపొందించిందని ఆరోపించిన మోడీ సర్కార్ భారత్‌లో ప్రదర్శనపై నిషేదం విధించింది. అంతేకాదు ఈ డాక్యుమెంటరీ వెలుగులోకి వచ్చిన వెనువెంటనే న్యూఢిల్లీలోని బిబిసి కార్యాలయాలపై కేంద్ర దర్యాప్తు సంస్థల చేత సోదాలు కూడా జరిపించి వేధింపులకు గురి చేసిన సంగతి విదితమే.

కొత్త పాస్‌పోర్టు కోసం రాహుల్ పిటీషన్

న్యూఢిల్లీ : మరికొద్ది రోజుల్లో అమెరికా పర్యటనకు సిద్ధమవుతున్న కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ కొత్త పాస్‌పోర్టు కోసం కోర్టును ఆశ్రయించారు. 'సాధారణ పాస్‌పోర్టు'ను పొందేందుకు నిరభ్యంతర పత్రాన్ని ఇవ్వాలంటూ బుధవారం ఢిల్లీలోని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఈ నెల 26 (శుక్రవారం)న విచారణ జరపనున్నట్లు న్యాయస్థానం తెలిపింది.'మోదీ ఇంటిపేరు' వ్యాఖ్యల కేసులో రెండేళ్ల జైలు శిక్ష పడటంతో రాహుల్ పై అనర్హత వేటు పడిన విషయం తెలిసిందే. దీంతో ఆయన లోక్‌సభ సభ్యత్వం రద్దయ్యింది. ఫలితంగా రాహుల్ తన దౌత్య పాస్‌పోర్టు సహా అన్ని రకాల ప్రయాణ పత్రాలను సంబంధిత అధికారులు సమర్పించారు. అలాగే, నేషనల్ హెరాల్డ్ కేసులో రాహుల్ నిందితుడిగా ఉన్నారు. దీంతో కొత్తగా సాధారణ పాస్‌పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ పిటిషన్‌ను స్వీకరించిన న్యాయస్థానం.. శుక్రవారం విచారణ చేపడతామని తెలిపింది. నేషనల్ హెరాల్డ్ కేసులో రాహుల్ గాంధీతో పాటు మరికొందరికి 2015 డిసెంబరు 19న ఢిల్లీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రాహుల్ గాంధీ ఈ నెల 31 నుంచి పది రోజులపాటు అమెరికాలో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ ఇటీవల వెల్లడించిన విషయం తెలిసిందే. జూన్ 4న న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసే బహిరంగ సభతో పాటు వాషింగ్టన్, కాలిఫోర్నియాలోని పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నట్లు తెలుస్తోంది.

మణిపూర్‌లో ఆగని హింస

- బిష్ణోపూర్ జిల్లాలో ఒకరి మృతి
- మరో ఇద్దరికి గాయాలు



ఇంఫాల్ : మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతూనే ఉంది. బుధవారం బిష్ణోపూర్ జిల్లాలో చెలరేగిన ఘర్షణల్లో ఒకరు చనిపోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. దుండగులు మూడు ఇళ్లను తగుల పెట్టారు. మొయిరాంగ్‌లో సమీపంలోని పలు గ్రామాలపై సాయుధ యువకులు బుధవారం తెల్లవారు జామున దాడులకు తెగబడ్డారు. ఒక సామాజిక తరగతి ప్రజలను లక్ష్యంగా చేసుకుని తుపాకీలతో కాల్పులు జరిపినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. కాల్పుల్లో గాయపడిన ఇద్దరిని ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలోనే ఒకరు మరణించారు. మంగళవారం ఇదే జిల్లాలోని ఫౌబక్చావో వద్ద నాలుగు ఇళ్లను దగ్ధం చేయగా..ఆ ఘటనకు ప్రతీకారంగానే బుధవారం దాడులు జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ నెల 3 నుంచి మణిపూర్‌లో ఘర్షణలు కొనసాగుతున్నాయి. బిజెపి ప్రభుత్వం వైఫల్యంతోనే ఈ హింసాత్మక ఘర్షణలు కొనసాగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ తన ఆధీనంలోనే హోం శాఖను ఉంచుకున్నా.. సామాజిక తరగతుల మధ్య ఘర్షణలను నివారించి శాంతిభద్రతను పునరుద్ధరించడంలో ఆయన ఘోరంగా విఫలమయ్యారు. కొన్ని ప్రాంతాల్లో బిజెపి నాయకులే హింసాకాండను ప్రేరేపిస్తుండటంతో ముఖ్యమంత్రి చేవలేనివాడిగా మిన్నుకుండిపోతున్నారు. బుధవారం నాటి ఘర్షణల నేపథ్యంలో బిష్ణుపూర్, ఇంఫాల్ తూర్పు, ఇంఫాల్ పశ్చిమ జిల్లాల్లో కర్ఫ్యూ ఆంక్షలను పునరుద్ధరించారు.

ఇథియోపియన్ యువరాజు అవశేషాలు తిరిగి ఇవ్వడానికి ఇంగ్లండ్ నిరాకరణ

లండన్ : ఒక ఇథియోపియన్ యువరాజు మృతదేహం అతని దేశానికి 6 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్రిటన్‌లోని విండ్సర్ శశ్మాన వాటికలో ఖననం చేయడం ఇప్పటికీ అంతుచిక్కని రహస్యంగానే మిగిలిపోయింది. ఈ యువరాజు మృతదేహం అవశేషాలను ఇథోయోపియాకు ఇవ్వడానికి ఇంగ్లండ్ అంగీకరించడం లేదు. ఈ సంఘటన వివరాల ప్రకారం ప్రిన్స్ డెజాచ్ అలెమాయేహు (1861–1879) అబిస్సినియా (ఇప్పుడు ఇథియోపియా అని పిలుస్తున్నారు) సింహాసనానికి వారసుడు. ఇతని తండ్రి చక్రవర్తి టెవోడ్రోస్ 2 1868లో ఇంగ్లండ్‌తో జరిగిన యుద్ధంలో మరణించాడు. దీంతో అలెమయేహును, అతని తల్లిని ఇంగ్లండ్‌కు బలవంతంగా తీసుకుని వచ్చారు. అయితే తల్లి మార్గమధ్యంలో మరణించింది. ఇంగ్లండ్‌కు తీసుకుని వచ్చిన అలెమాయెహును బ్రిటీష్ ఆర్మీ ఆఫీసర్ ట్రిస్టమ్ చార్లెస్ సాయర్ స్పీడి ఆధ్వర్యంలో ఉంచారు. అతన్ని ప్రముఖ పాఠశాలల్లో చదువుచెప్పారు. అతని జీవితం బ్రిటన్ రాజవంశస్థులతో గడిచినప్పటికీ అలెమాయేహు దయనీయమైన పరిస్థితులు ఎదుర్కొన్నట్లు చరిత్రకారుల కథనం. తీవ్రమైన జాత్యాహంకారాన్ని ఎదుర్కొన్నాడని, ఇథియోపియన్‌కు తిరిగి పంపించాలనే అతని అభ్యర్థనలను రాజ ప్రభుత్వం విస్మరించిందని విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం మృతదేహం అవశేషాలను తిరిగి ఇవ్వడానికి కూడా ఇంగ్లండ్ నిరాకరిస్తుంది.